సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50


సంపుటి: 15 సంచిక: 322

శనివారం 5-8-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ణి చేయడమే నా ముందున్న లక్ష్యం'



3 రోజుల నష్టాలకు బ్రేక్

ఐటీ, ఫార్మా, ప్రైవేట్ బ్యాంకు రంగాల షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మూడు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. సెన్సెక్స్ 481 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ 136 పాయింట్లు బలపడింది. సెన్సెక్స్ దాదాపు ఒకశాతం లాభపడటంతో బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.1.8 లక్షల కోట్లు పెరిగి రూ. 304.09 లక్షల కోట్లకు చేరింది.

13లో



'జ్ఞానవాపి'పై స్టే ఇవ్వబోం

జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ సర్వేకు అనుమతిపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

వివరాలు 6లో ►



'ఇండియా'పై అభ్యంతరం

విపక్షాల కూటమికి 'ఇండియా' అని పేరు పెట్టుకోవడంపై ఢిల్లీ హైకోర్టులో గిరీశ్ భరద్వాజ్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు.


వివరాలు 6లో ►



కోర్టుకు హాజరైన ట్రంప్

అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో అవకతవకల ఆరోపణలపై ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోర్టుకు హాజరయ్యారు.

వివరాలు 6లో ►



పార్లమెంట్‌లో వాయిదాల పర్వం

మణిపూర్ ఘటనపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో ఇరు సభలూ వాయిదా పడ్డాయి.

వివరాలు 6లో ►



'అసైన్డ్' రాత మారింది

- అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు
- చట్ట సవరణకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం
- కేటాయించి 20 ఏళ్లు పూర్తయిన భూములపై రైతులకు సర్వ హక్కులు
- 1954 నుంచి 2003 లోపు ఇచ్చిన భూములు 28 లక్షల ఎకరాలకుపైనే.. కేటాయించి పదేళ్లు దాటితే ఇళ్ల స్థలాలపైనా యాజమాన్య హక్కులు
- చట్ట సవరణలో అది కూడా పొందుపరిచిన ప్రభుత్వం
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 'అసైన్డ్'పై విప్లవాత్మక నిర్ణయం

10లో

పుంగనూరు బైపాస్ వద్ద పోలీసుల వాహనాలను ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు



రాళ్లు, రాడ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో పక్కా ప్లాన్

టీడీపీ రాక్షస క్రీడ

రక్తపాతం లక్ష్యంగా చంద్రబాబు స్కెచ్.. రెచ్చగొట్టి, గొడవలతో లబ్ధి పొందాలనే వ్యూహం

ప్రాజెక్టుల పరిశీలన ముసుగులో భారీ కుట్ర

- అప్పటికప్పుడు రూట్ మ్యాప్ మార్చి పుంగనూరులోకి వచ్చేందుకు విఫలయత్నం.. టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టిన టీడీపీ అధినేత
- బీరు సీసాలు, కర్రలు, రాళ్లతో పోలీసులపై దాడి.. తుపాకీ సైతం తెచ్చిన ఓ నాయకుడు.. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనా రాళ్లు.. తరమండిరా అంటూ బాబు తీవ్ర వ్యాఖ్యలు
- రెండు పోలీసు వాహనాలపై పెట్రోలు పోసి నిప్పంటించిన టీడీపీ మూకలు
- 27 మంది పోలీసులు, 50 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు

2లో

రాయలసీమలో రక్తపాతమే లక్ష్యంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పక్కా స్కెచ్‌తో అగ్గి రాజేశారు. టీడీపీ గూండాలను రెచ్చగొట్టి.. పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాళ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో దాడులు చేయించారు. అంతటితో ఆగక పోలీసు వాహనాలపై పెట్రోలు పోసి నిప్పంటించి విధ్వంసం సృష్టించారు. శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలిగించారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర రక్త గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.

సాగుకు 'సహకారం'



- రైతన్నలకు చేరువలో బ్యాంకింగ్ వ్యవస్థతో తక్కువ వడ్డీకే రుణాలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- గత నాలుగేళ్లలో సహకార రంగంలో పలు కీలక సంస్కరణలు.. రైతుల కోసం 1964 సహకార చట్టం సవరణ
- పారదర్శకతకు పెద్దపీట.. డీసీసీబీల్లో ప్రొఫెషనల్స్
- 'ఆప్కాబ్' వజ్రోత్సవ వేడుకల్లో నూతన లోగో ఆవిష్కరించిన సీఎం

10లో



మళ్లీ ఎంపీగా రాహుల్ గాంధీ!

- పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేతకు భారీ ఊరట.. రెండేళ్ల జైలు శిక్షపై స్టే విధించిన సుప్రీంకోర్టు
- మధ్యంతర ఉత్తర్వులు జారీ
- ఇక రాహుల్ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ!
- వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు తొలగిన అడ్డంకులు

6లో



భారత్ బాణం బంగారం

- ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తొలిసారి స్వర్ణం
- చరిత్ర సృష్టించిన జ్యోతి సురేఖ, అదితి, పర్ణీత్‌కౌర్ బృందం
- మహిళల కాంపౌండ్ టీం ఈవెంట్‌లో విశ్వవిజేతగా భారత్

- వివరాలు 13లో

పసుపు నాణ్యత లెక్క..

2 నిమిషాల్లో పక్కా..

కృత్రిమ మేధతో కర్క్యుమిన్ శాతాన్ని గుర్తించే యంత్రం

- నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్ర సుగంధ ద్రవ్యాల బోర్డు
- ఐదు నిమిషాల్లో తేమ శాతాన్ని తేల్చే పరికరం కూడా..
- క్లౌడ్ టెక్నాలజీ ద్వారా పసుపు పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లో..
- 'ఈ-నామ్' సైట్‌కు అనుసంధానం.. రైతులకు అధిక ధర లభించే చాన్స్
- ఇక్కడ విజయవంతం కావడంతో మేఘాలయలోని షిల్లాంగ్‌లోనూ ఏఐ యంత్రం ఏర్పాటు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నడిచే కర్క్యుమిన్ టెస్టింగ్ మెషీన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ఆరుగాలం కష్టపడి పండించిన పంట. అందులోనూ పొలాన్ని శ్రద్ధగా, శుచీశుభ్రంగా చూసుకుంటూ పండించే పసుపు పంట. దిగుబడి వచ్చాక మార్కెట్‌కు తీసుకొస్తే.. నాణ్యతపై కొర్రీలు.. 'కర్క్యుమిన్' శాతంపై సందేహాలు.. ల్యాబ్‌ల నుంచి రిపోర్టులు రావడానికి నాలుగైదు రోజులు.. వేచి ఉండలేక తక్కువ ధరకు అమ్ముకునే రైతులు.. ఇన్నేళ్లుగా కనిపించిన దృశ్యమిది.

మరి ఇప్పుడు.. మార్కెట్లో వెంటనే నాణ్యత పరీక్షలు.. నిమిషాల్లోనే 'కర్క్యుమిన్', తేమ శాతం లెక్కలు.. ఆన్‌లైన్‌లో పసుపు పంట విక్రయాలు.. రైతులకు మంచి ధరలు.. దీనంతటికీ కారణం 'కృత్రిమ మేధ (ఏఐ)'తో కూడిన అత్యాధునిక యంత్రాలు.

.. దేశంలోనే ముఖ్యమైన పసుపు మార్కెట్లలో ఒకటైన నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఈ సరికొత్త సాంకేతికత రైతులకు వరంగా మారింది. దేశంలోనే మొదటిసారిగా కేంద్ర సుగంధ ద్రవ్యాల బోర్డు ఇక్కడ 'కర్క్యుమిన్ రీడింగ్ మెషీన్'ను ఏర్పాటు చేసింది.

రెండేళ్ల కింద మొదలై..

పసుపులో కర్క్యుమిన్ ఆధారిత మార్కెటింగ్ దిశగా దేశంలోనే తొలిసారిగా నిజామాబాద్ మార్కెట్‌లో పునాది పడింది. రైతుల పసుపు పంటలోని కర్క్యుమిన్ శాతాన్ని స్థానికంగానే, త్వరగా తెలుసుకునేందుకు 2021లో కేంద్ర ప్రభుత్వ సుగంధ ద్రవ్యాల బోర్డు ఇక్కడి మార్కెట్ యార్డులో 'కర్క్యుమిన్ రీడింగ్ మెషీన్'ను ఏర్పాటు చేసింది. 'ఏజీ-నెక్స్ట్' సంస్థ తయారు చేసిన ఈ యంత్రం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పనిచేస్తుంది. ఇంటర్నెట్ ఆధారంగా 'క్లౌడ్ టెక్నాలజీ'తోనూ అనుసంధానం అవుతుంది. రైతులు తెచ్చిన పసుపులోని ఒక కొమ్మును పొడిచేసి, ఈ యంత్రంలో పెడితే.. కేవలం రెండు నిమిషాల్లోనే అందులోని కర్క్యుమిన్ శాతాన్ని వెల్లడిస్తుంది. ఇంతకుముందయితే.. పసుపు శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపేవారు, ఫలితాలు రావడానికి రెండు, మూడు రోజులు సమయం పట్టేది. ఇక పసుపులో తేమశాతాన్ని గుర్తించే యంత్రాన్ని సైతం గత ఏడాది ఇక్కడి మార్కెట్లో ఏర్పాటు చేశారు. పసుపు కొమ్ములను దంచి ముక్కలను ఇందులో వేస్తే.. కేవలం 5 నిమిషాల్లో తేమ శాతం తెలిసిపోతుంది.

రైతులకు ఉచితంగా..

నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు పంట వచ్చే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కర్క్యుమిన్ పరీక్షలు చేస్తున్నారు. ప్రతి శాంపిల్‌కు రూ.140 రుసుము వసూలు చేస్తున్నారు. అయితే మార్కెట్‌లో పసుపు అమ్మేందుకు వచ్చిన రైతుల నుంచి మాత్రం రుసుము తీసుకోవడం లేదు. వారి పసుపు కర్క్యుమిన్ శాతం ఫలితాలను 'ఈ-నామ్' సైట్‌లో నమోదు చేసి, సంబంధిత పసుపు విక్రయ లాట్‌కు అనుసంధానం చేస్తున్నారు. 'ఈ-నామ్' సైట్ ద్వారా దేశవ్యాప్తంగా ఏ ప్రాంతంలోని రైతులు అయినా.. ఇక్కడి పంటను కొనుగోలు చేయవచ్చు. దీనివల్ల కర్క్యుమిన్ శాతం ఎక్కువగా ఉన్న పసుపు రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు తెలిపారు. కర్క్యుమిన్ పరీక్ష యంత్రం, దాని సాఫ్ట్‌వేర్, నిర్వహణ కలిపి మొత్తం రూ.50 లక్షలు అని వెల్లడించారు. నిజామాబాద్‌లో ఇది విజయవంతం కావడంతో ఇటీవలే మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోనూ ఏర్పాటు చేశారని చెప్పారు.



పసుపులో తేమ శాతాన్ని తెలిపే యంత్రం

ఏమిటీ 'కర్క్యుమిన్'?

పసుపులో ఉండే కీలక రసాయన పదార్థమే 'కర్క్యుమిన్'. దీనితోనే పసుపు పంటకు ఆ రంగు వస్తుంది. ఆహారం నుంచి ఔషధాల దాకా.. రంగుల తయారీ సౌందర్య ఉత్పత్తుల దాకా.. దీని ప్రయోజనాలెన్నో. కర్క్యుమిన్‌కు యాంటీ బయాటిక్, యాంటీ ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలు ఉంటాయని.. కేన్సర్ సహా ఎన్నో రకాల వ్యాధుల నుంచి రక్షణకు, శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి ఇది తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు ఎప్పుడో గుర్తించారు.

ఆరోగ్య 'సిరి'ధాన్యాలు

మార్కెట్‌లో చిరుధాన్యాలకు డిమాండ్.. మన్యంలో పెరుగుతున్న సాగు

బుట్టాయగూడెం: ప్రజల ఆహార అలవాట్లలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. వరి అన్నం బదులు బామ్మలు, తాతయ్యలు ఒకప్పుడు తిన్న తిండిని ఇప్పుడు ఇష్టపడుతున్నారు. వైద్యులు కూడా చిరుధాన్యాలు(సిరిధాన్యాలు) తినమని సూచిస్తున్నారు. దీంతో రాగులు, జొన్నలు, సామలు, అరికెలకు డిమాండ్ పెరిగింది. ఈ మార్పు ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు సైతం చెపుతున్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు తింటూ ఆయురారోగ్యాలను పొందే ప్రయత్నం చేస్తున్నారు.



ఏజెన్సీలో పెరిగిన సాగు విస్తీర్ణం

వ్యాధుల నుంచి రక్షించుకోవడం కోసం ఆహారపు అలవాట్లలో మార్పులు అనివార్యంగా భావిస్తున్నారు. ఈ మేరకు కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, సామలు, అరికలు వంటి పంటలు ఇప్పుడు సిరి ధాన్యాలుగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని ఎలాంటి పరిస్థితుల్లోనైనా స్థిరమైన దిగుబడి ఇవ్వడంతో పాటు అధిక పోషక విలువలు కలిగిఉన్నవే చిరుధాన్యాలు. చిరుధాన్యాల వినియోగంపై అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపడంతో తాజాగా వీటి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. చిరు ధాన్యల సాగుతో లాభాలు మెండుగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల కొండ ప్రాంతంలో నివసించే ఆదివాసీల ప్రధాన పంటలు జొన్నలు, రాగులు, సామలు. అయితే మారుతున్న కాలంతో పాటు గిరిజనులు కూడా ఆహారపు అలవాట్లలో మార్పులు కోరుకున్నారు. ప్రస్తుత ఆరోగ్య సమస్యల కారణంగా వారు కూడా చిరుధాన్యాల సాగువైపు మళ్లీ దృష్టి సారించారు. దీంతో ఏజెన్సీ గత కొన్నేళ్లుగా చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెరిగింది.

600 ఎకరాల్లో చిరుధాన్యాలు

ఈ ఏడాది ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతంలో సుమారు 600 ఎకరాల్లో చిరుధాన్యాల పంటలు పండించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 350 ఎకరాలు చిరుధాన్యాల పంటలు వేసినట్లు అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన చిరుధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, సామలు, అరెకల్లో అన్ని పోషకాలు ఉండడంతో ప్రజలు కూడా వాటిని తినేందుకు ఆసక్తి చూపుతున్నారు.

గర్భిణులకు చిరుధాన్యాల ఆహారం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు చిరుధాన్యాలనే ఆహారంగా ఇస్తున్నారు. అలాగే బాల సంజీవని కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలతో పాటు పిల్లలకు కూడా కొర్రలు, రాగి, జొన్నలు వంటి ఆహారాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారు. గిరిజన ప్రాంతంలోని సుమారు 437 అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా చిరుధాన్యాల వంటలను ఆహారంగా ఇస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాల పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నాం. అన్ని పోషకాలు ఉండడంతో వారికి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తున్నాయి.

-ఈ.తులసి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి, బుట్టాయగూడెం

అవగాహన కల్పిస్తున్నాం

చిరుధాన్యాల పంటలపై రైతులను ప్రోత్సహిస్తున్నాం. పంటల ప్రాముఖ్యతపై గ్రామాల్లో రైతులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పాత తరం వారు వెంటనే పంటలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. చిరుధాన్యాల పంటల సాగు పెరగాలంటే కొంత సమయం పడుతుంది.

-బి.సుమలత, ఏఓ, బుట్టాయగూడెం

విద్యుత్ శాఖకు 'సైబర్' షాక్!

బిల్లుల పేరుతో వినియోగదారులకు నకిలీ లింకులు

సాక్షి, అమరావతి: విద్యుత్ వినియోగదారులు, అధికారులను టార్గెట్ చేసుకుని కొద్ది రోజులుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ లింకులతో వినియోగదారుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఇందుకోసం ఏకంగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పేరుతో నకిలీ ఫేస్‌బుక్, వాట్సాప్ ఖాతాలు సృష్టించడం కలకలం రేపుతోంది. తాజాగా సైబర్ మోసగాళ్లు 9335509390 అనే ఫోన్ నంబరు ద్వారా ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు పేరుతో ఫేక్ వాట్సాప్ డీపీ సృష్టించారు. దీనిద్వారా జెన్‌కో, ట్రాన్స్‌కో ఉద్యోగులతోపాటు కొందరు వినియోగదారులకు మెసేజీలు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న ఎండీ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. సైబర్ మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ జెన్‌కో ఎండీ తరఫున విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి (సీవీఎస్‌వో) పనసారెడ్డి శుక్రవారం విజయవాడ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

మోసాలు ఇలా: ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు కొన్ని నెలలుగా 'మీరు కరెంట్ బిల్లు చెల్లించలేదు.. మీ విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. వెంటనే విద్యుత్ అధికారిని సంప్రదించండి..' అంటూ మెసేజీలు వస్తున్నాయి. దాన్ని చూసిన వారు ఆ మెసేజ్‌లో ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు లాగేస్తున్నారు. ఎనీ డెస్క్, టీం వ్యూయర్ వంటి రిమోట్ డెస్క్ యాప్స్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, బ్యాంక్ ఐడీ, పాస్‌వర్డ్స్ తెలుసుకుని విద్యుత్ వినియోగదారులకు గాలం వేస్తున్నట్లు విద్యుత్ విజిలెన్స్ అధికారుల దృష్టికి వచ్చింది. అదేవిధంగా వినియోగదారులకు 'డియర్ కన్స్యూమర్... మీ మునుపటి నెల బిల్లు అప్డేట్ కానందున ఈ రాత్రికి మీ విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుంది. దయచేసి బిల్లు చెల్లించడానికి కింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయండి..' అని వాట్సాప్, టెక్ట్స్ మెసేజీలు పంపిస్తున్నారు. దానిపై క్లిక్ చేయగానే ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాలోని డబ్బులు స్వాహా చేస్తున్నారు.


పోలీసులపై రాళ్లు విసిరి దాడికి పాల్పడుతున్న టీడీపీ శ్రేణులు


దగ్ధమవుతున్న వాహనాలు


పోలీసు వాహనానికి నిప్పు పెడుతున్న టీడీపీ కార్యకర్త


పోలీసులపైకి రాళ్లు విసురుతూ దూసుకొస్తున్న టీడీపీ శ్రేణులు

రాళ్లు, రాడ్లు, కర్రలతో పక్కా ప్రణాళిక..

టీడీపీ రాక్షస క్రీడ


నిప్పు పెడుతున్న టీడీపీ కార్యకర్త


టీడీపీ దాడిలో గాయపడ్డ పోలీసులు

సాక్షి, తిరుపతి/చిత్తూరు/ పుంగనూరు/బి కొత్తకోట: రాయలసీమలో రక్తపాతమే లక్ష్యంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పక్కా స్కెచ్‌తో అగ్గి రాజేశారు. టీడీపీ గూండాలను రెచ్చగొట్టి.. పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాళ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో దాడులు చేయించారు. అంతటితో ఆగక పోలీసు వాహనాలపై పెట్రోలు పోసి నిప్పంటించి విధ్వంసం సృష్టించారు. శాంతి భద్రతలకు తీవ్రంగా విఘాతం కలిగించారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర రక్త గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రాజెక్టుల సందర్శన పేరుతో శుక్రవారం ఆయన అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పర్యటించారు. ములకలచెరువు మండలం నాయనపల్లి చెరువు వద్ద ఉన్న హంద్రీ–నీవా, గాలేరు నగరి అనుసంధానం కాలువ పనులను పరిశీలించారు. ఆ తర్వాత బి కొత్తకోట మండలం చీతివారిపల్లి సమీపంలో ఉన్న హంద్రీ–నీవా పుంగనూరు ఉప కాలువ పనులను పరిశీలించాల్సి ఉండింది. అయితే పుంగనూరులో విధ్వంసం సృష్టించాలనే లక్ష్యంతో రూట్ మ్యాప్ మార్చుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండల పరిధిలోని ముదివేడు రిజర్వాయర్ పరిశీలనకు వెళ్తున్నారని తెలుసుకున్న స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు బాబు తీరుపై మార్గం మధ్యలోని అంగళ్లు సర్కిల్‌కు వద్ద నిరసన తెలిపి వెనుదిరిగారు. అంతలో అక్కడికి చేరుకున్న చంద్రబాబు బృందం వందలాది మందితో వచ్చీ రాగానే కేకలు వేస్తూ... తొడలు చరుస్తూ కర్రలు, బీరు బాటిళ్లు, రాళ్లు విసురుతూ దాడులకు తెగబడ్డారు. దూరంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టారు. డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు ఎంతగా వారించినా వినలేదు. స్థానికులు భయాందోళనతో ఇళ్లలోకి పరుగులు తీశారు. టీడీపీ గూండాల రాళ్ల దాడిలో ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కేశవ, అంగళ్లకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అర్జున్‌రెడ్డి (35) తీవ్రంగా గాయపడ్డారు. ములకలచెరువుకు చెందిన విశ్వనాథరెడ్డి సహా మరో పది మందికి గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్నా చంద్రబాబు వారించడం అటుంచి, చోద్యం చూశారు. పైగా జీపుపైకి ఎక్కి రెచ్చగొట్టేలా మాట్లాడారు.

పుంగనూరు పుడింగితో తేల్చుకుందాం రండి

అంగళ్ల వద్ద నుంచి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు బైపాస్, పలమనేరు మీదుగా చంద్రబాబు చిత్తూరుకు చేరుకోవాల్సి ఉంది. చంద్రబాబు రూట్ మ్యాప్‌లో పుంగనూరు ప్రస్తావన లేదు. అయితే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకున్న చంద్రబాబు.. పుంగనూరుకు వెళ్దాం.. రండి అంటూ టీడీపీ గూండాలకు మైక్ ద్వారా పిలుపునిచ్చారు. 'పుంగనూరులో పుడింగి ఉన్నాడు.. రండి తేల్చుకుందాం' అని గట్టిగా అరుస్తూ ముందుకు కదిలారు.

బాబు పిలుపుతో పుంగనూరు వద్ద విధ్వంసం

అంగళ్ల వద్ద చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు పుంగనూరు వద్ద టీడీపీ గూండాలు పెద్ద సంఖ్యలో అధినేత రాకముందే గుమిగూడారు. ఒక్కసారిగా బైపాస్ రోడ్డు వద్దకు చేరుకున్నారు. పుంగనూరు పర్యటనకు అనుమతి లేదని పోలీసులు చెబుతున్నా వినిపించుకోకుండా గొడవకు దిగారు. ఒక ఏఎస్పీ, డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలతోపాటు సుమారు 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతలో చంద్రబాబు అక్కడికి చేరుకున్నారు. వందల సంఖ్యలో వచ్చిన టీడీపీ గూండాలను వెనకేసుకుని బైపాస్ రోడ్డులోని భీమగానిపల్లె సర్కిల్ నుండి పుంగనూరులోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. 'పుంగనూరులో కాలుమోపుతా.. ఎవరు అడ్డుకుంటారో? చూస్తా?' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. పోలీసులు ఎంతగా వారించినా వినలేదు. పైగా పోలీసులను టార్గెట్‌గా చేసుకుని టీడీపీ శ్రేణులు తొలుత రాళ్ల వర్షం కురిపించాయి. ఆ తర్వాత కర్రలతో పోలీసులను తరిమికొట్టే ప్రయత్నం చేశారు. ముందస్తుగా సిద్ధం చేసుకున్న బీరు బాటిళ్లు, మద్యం సీసాలు పోలీసులపైకి విసిరి తీవ్రంగా గాయపరిచారు. పోలీసు గస్తీ కోసం ఏర్పాటు చేసిన వజ్ర వాహనాన్ని, మరో పోలీసు వాహనాన్ని కిందకు పడదోసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఎంతగా సంయమనం పాటించి, సర్దిచెప్పినప్పటికీ వారు వినకపోవడంతో పోలీసులు వారిపైకి బాష్పవాయువు ప్రయోగించి చెదరగొట్టాల్సి వచ్చింది. ఈ విధ్వంసం గంటన్నరకుపైగా సాగింది.

27 మందికి గాయాలు

టీడీపీ శ్రేణుల దాడిలో ఏఎస్పీ, డీఎస్పీతోపాటు ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలతోపాటు మొత్తం 27 మందికి రక్త గాయాలయ్యాయి. సాయంత్రం 4 నుండి 5.30 గంటల మధ్య పుంగనూరు బైపాస్‌రోడ్డు ప్రాంతం రణరంగాన్ని తలపించింది. చిత్తూరు ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, దిశ స్టేషన్ డీఎస్పీ బాబుప్రసాద్, క్రైమ్ సీఐ భాస్కర్, పాల సముద్రం ఎస్‌ఐ ప్రసాద్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారంతా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గాయపడ్డ పోలీసుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫొటోలు, వీడియోల్లో పోలీసు అధికారులు, సిబ్బంది రక్త గాయాలతో ఉండటం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేని పోలీసులపై టీడీపీ శ్రేణులు ఇలా దాడులు చేసి గాయ పరచడంపై ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శించారు. అనంతరం అనంతపురం రేంజి డీఐజీ అమ్మిరెడ్డితో కలిసి పుంగనూరులో ఘటన వివరాలను మీడియాకు వివరించారు. కాగా, గొడవ విషయం తెలిసి పుంగనూరు బైపాస్ రోడ్డు వద్దకు చేరుకున్న స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో 50 మందికి టీడీపీ నేతల రాళ్ల దాడిలో తీవ్ర గాయాలయ్యాయి.


నేడు చిత్తూరు జిల్లా బంద్

పుంగనూరులో చంద్రబాబు నాయుడు అనుచర గణం సృష్టించిన విధ్వంసాన్ని నిరసిస్తూ, పోలీసులపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ శనివారం చిత్తూరు జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కె.ఆర్.జే భరత్, ఎంపీ రెడ్డెప్ప ఓ ప్రకటన విడుదల చేశారు.

రక్తపాతం లక్ష్యంగా చంద్రబాబు స్కెచ్

రెచ్చగొట్టి, గొడవలతో లబ్ధి పొందాలనే వ్యూహం

ప్రాజెక్టుల పరిశీలన ముసుగులో భారీ కుట్ర



అంతా వ్యూహాత్మకం

చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్‌జీసీ కమాండోల రక్షణలో జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న టీడీపీ నేత చంద్రబాబు నాయుడు ఎక్కడైనా పర్యటించాలంటే 24 గంటల ముందుగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) నుంచి ఇంటలిజెన్స్ విభాగానికి రోడ్ మ్యాప్ ఇవ్వాలి. అప్పుడు జిల్లా పోలీసుశాఖ ముందుగా రూట్ మ్యాప్‌లో ఉన్న కల్వర్టులు, శివారు ప్రాంతాలు, అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతుంది. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), ఆర్మ్‌డ్ రిజర్వు దళాలు చంద్రబాబు కార్యక్రమం జరిగే రూట్ మ్యాప్‌లో భద్రతా చర్యలు, ముందస్తు తనిఖీలు చేపడతారు. కానీ చిత్తూరు జిల్లా పర్యటనకు సంబంధించి చంద్రబాబు నుంచి పోలీసులకు అందిన రూట్ మ్యాప్ ఒకలా ఉంటే.. దాన్ని కాదని పుంగనూరులోకి పర్యటనను మారుస్తూ మరో దారిని ఎంచుకోవడం రాజకీయంగా లబ్ధి పొందే వ్యూహమేనని స్పష్టమవుతోంది. మదనపల్లె నుంచి పుంగనూరు బైపాస్ మీదుగా చంద్రబాబు నాయుడు చిత్తూరు శివారుల్లోని బాస్స్ హోటల్‌కు వెళతారని బుధవారం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి నుంచి పోలీసులకు సమాచారం అందింది. గురువారం రాత్రి కూడా పర్యటనలో మార్పులు చేస్తూ.. పుంగనూరు బైపాస్ మీదుగానే వెళ్లిపోతారని చెప్పారు. తీరా శుక్రవారం సాయంత్రం పుంగనూరులోకి ప్రవేశించడానికి విఫలయత్నం చేస్తూ విధ్వంసం సృష్టించారు.

రాజంపేట టీడీపీ అభ్యర్థి నరహరి కారులో గన్

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గంటా నరహరి కారు డ్రైవర్ గుర్‌మిత్ సింగ్(38)పై ముదివేడు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు కథనం ప్రకారం.. చంద్రబాబు పర్యటన సమయంలో కడప వైపు నుంచి అంగళ్లుకు నరహరి కారు వేగంగా వచ్చింది. కడప రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన ఎంపీటీసీ మహేష్‌పైకి దూసుకొచ్చింది. మహేష్ హెచ్చరికతో కారు ఆగింది. అంత వేగమెందుకని మహేష్ నిలదీయగా.. ఆగ్రహించిన గురుమిత్‌సింగ్ కారులోంచి డబుల్ బ్యారల్ గన్ తీసి కాల్చుతానంటూ బెదిరించారు. దీంతో మహేష్ ముదివేడు పోలీసులకు చెప్పగా వారు కారును తనిఖీ చేశారు.పేకాట పెట్టెలు, వెనుకవైపు కింద డబుల్ బ్యారల్ గన్, సీటు కవర్‌లో ఎనిమిది తూటాలు కలిగిన ప్యాకెట్ లభించాయి. వీటితోపాటు కారును స్వాధీనం చేసుకుని ముదివేడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితుడు మహేష్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ గుర్‌మిత్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.


గంటా నరహరి కారులో డబుల్‌బ్యారల్ గన్


స్వాధీనం చేసుకున్న తూటాలు








టీడీపీ దాడిలో గాయపడ్డ పోలీసులు


తొడ కొడుతూ టీడీపీ నేత కవ్వింపు

రెచ్చగొట్టే ప్రసంగాలతోనే విధ్వంసం



రెచ్చగొట్టే ప్రసంగాలతో పథకం ప్రకారం విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులు జరగడం బాధాకరం. ఇలాంటి మాటలు సమాజానికి మంచిది కాదు. గాయపడిన పోలీసుల పరిస్థితి ఇది.. తెలుగుదేశం వారు ఉపయోగించిన రాళ్లివి (వీడియో చూపుతూ). అనుమతి పొందిన రూట్‌మ్యాప్‌ను కాదని తెలుగుదేశం పార్టీ శ్రేణులు పుంగనూరులోకి వచ్చే ప్రయత్నం చేయడంతోనే విధ్వంసం జరిగింది. పోలీస్ అధికారుల వద్ద పిస్టల్ ఉన్నప్పటికీ, ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని గ్రహించినా సంయమనంతో వ్యవహరించారు. ప్రజలు భయభ్రాంతులకు గురికాకూడదని కాల్పులు జరపలేదు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దాడులు చేసిన వారిని గుర్తిస్తాం. బాధ్యులందరిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తాం. విధ్వంసం సృష్టించిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

– అమ్మిరెడ్డి, అనంతపురం రేంజి డీఐజీ

ముందస్తు పథకం ప్రకారమే దాడులు



ముందస్తు పథకం ప్రకారం విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందిపై దాడి చేశారు. రాళ్లు, మద్యం బాటిళ్లు, కర్రలతో దాడులకు పాల్పడ్డారు. పోలీస్ వాహనాలను సైతం తగులబెట్టడం దారుణం. దీని వెనుక ఎవరున్నా వదిలేది లేదు. చట్ట ప్రకారం వారందరిపై కేసులు నమోదు చేస్తాం. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. రూట్ మ్యాప్‌లో లేకపోయినా.. టీడీపీ నాయకులు కొంత మంది కావాలనే నిబంధనలకు విరుద్ధంగా పుంగనూరులోనికి రావడానికి ప్రయత్నించారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నిలువరించినందుకే దాడి చేశారు. పోలీసులు ఎంతో సమయమనంతో వ్యవహరించి, దెబ్బలు తిన్నప్పటికీ కాల్పులు జరపలేదు. గొడవనంతటినీ వీడియో చిత్రీకరించాము. చట్టప్రకారం బాధ్యులందరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం.

– రిషాంత్‌రెడ్డి, చిత్తూరు ఎస్పీ

చూసుకుందాం రండి.. నా కొడకల్లారా..

- అంగళ్లు, పుంగనూరులో చంద్రబాబు



సాక్షి, తిరుపతి/ పూతలపట్టు: 'ఒళ్లు దగ్గర పెట్టుకోండి. నాతో పెట్టుకుంటే ఇలాగే జరుగుతుంది. తమాషాలు చేస్తున్నారా, చూసుకుందాం రండి రా.. నా కొడకల్లారా.. వాళ్లను తరమండిరా..' అంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు పోలీసులపైకి టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టారు. ప్రాజెక్టుల పర్యటన పేరుతో శుక్రవారం ఆయన అన్నమయ్య జిల్లా అంగళ్లు, చిత్తూరు జిల్లా పుంగనూరు, పూతలపట్టులో పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసులను ఇష్టానుసారం మాట్లాడారు. 'టైం చెప్పండి, ప్లేస్ చెప్పండి, ఎవరు గెలుస్తారో చూద్దాం. నేను చిత్తూరు జిల్లాలోనే పుట్టా. బాంబులకే భయపడలేదు. నన్ను బెదిరించడం మిమ్మల్ని పుట్టించిన దేవుడి వల్ల కూడా కాదు. కర్రలతో వస్తే కర్రలతో వస్తా. రౌడీలకు రౌడీగా ఉంటా. ఏయ్ పోలీస్.. వాళ్లను పంపించండి' అంటూ అంగళ్ల వద్ద అనుచిత వాఖ్యలు చేశారు. డీఎస్పీ కేశప్పను ఉద్దేశిస్తూ చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఆ బట్టలు తీసేయండయ్యా. అందరూ పెయిడ్ ఆర్టిస్టులే. గాడిదలు కాస్తున్నారా' అంటూ నోరుపారేసుకున్నారు. కాగా, టీడీపీని గెలిపిస్తే ప్రతి ఇంటికీ తాగు నీరు అందిస్తామని శుక్రవారం రాత్రి పూతలపట్టు సభలో ఆయన చెప్పారు.

ఈ దాడులు చంద్రబాబు చేయించినవే

- అంగళ్లు, పుంగనూరు విధ్వంసానికి చంద్రబాబే కారణం
- పుంగనూరు పర్యటన లేదని రాత్రి చెప్పారు
- టీడీపీ నేతల కార్లలో తుపాకులెందుకున్నాయి?
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, తిరుపతి: అంగళ్లు, పుంగనూరులో విధ్వంసానికి టీడీపీ అధినేత చంద్రబాబే కారణమని, పక్కా స్కెచ్‌తోనే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉసిగొల్పి దాడులు చేయించారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంత్రి శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. పుంగనూరు టౌన్‌కు వచ్చేదిలేదని, బైపాస్ మీదుగా వెళ్తున్నామని గురువారం రాత్రి 10.30 గంటలకు టీడీపీ నాయకులు పోలీసులకు చెప్పారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చంద్రబాబు పాలనలో జరిగిన అన్యాయంపై నిరసన కార్యక్రమం పెట్టుకుని.. ఆయన కోసం ఉదయం 10.30 వరకు ఎదురు చూశారని, కానీ, ఆయన ఇటువైపు రావడంలేదని తెలిసి వారంతా వెళ్లిపోయారని వెల్లడించారు. ఆ తర్వాత చంద్రబాబు పనిగట్టుకుని, కావాలని రెచ్చగొట్టడానికి పుంగనూరుకు వచ్చారని వివరించారు. శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకూడదని పోలీసులు చంద్రబాబు వాహనాన్ని అడ్డుకున్నారని తెలిపారు. కానీ, చంద్రబాబు కావాలనే ఆలస్యంగా పుంగనూరు వైపు వచ్చి ప్రజలను రెచ్చగొట్టారన్నారు. సమాచారం లేకుండా ఎలా వస్తారని అడిగిన పోలీసులను కూడా రాడ్లు, కర్రలతో రక్తాలు కారేటట్టు కొట్టారని, రాళ్లు విసిరి తలలు పగలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు జీపులు, వాహనాలను కూడా టీడీపీ వారు ధ్వంసం చేసి తగులబెట్టారని చెప్పారు. దాడులు చేయాలనే కుట్రతోనే చంద్రబాబు పుంగనూరుకు రౌడీలు, గుండాల్ని తెచ్చారని ఆరోపించారు. టీడీపీ నేతలు కార్లలో గన్‌లు పెట్టుకుని రావాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. అంగళ్లు, పుంగనూరులో ఏనాడూ శాంతిభద్రతల సమస్య తలెత్తలేదని తెలిపారు. ఇలా జరుగుతుందని తెలిసుంటే ప్రజలు అప్రమత్తంగా ఉండేవారని చెప్పారు.

దిగజారి మాట్లాడటం బాబుకు అలవాటే

దిగజారి వీధి రౌడీలా మాట్లాడడం చంద్రబాబుకు అలవాటేనని మంత్రి చెప్పారు. ఈరోజు ఆయన ప్రవర్తనను ప్రజలు ప్రత్యక్షంగా చూశారన్నారు. మతిస్థిమితం కోల్పోయిన బాబు తనను పుంగనూరు పుడింగివా.. నీ తాత జాగీరా.. అంటూ ఏ మాటంటే ఆ మాట అన్నారని చెప్పారు. ఆ మాటలకు తానేమీ స్పందించనని, బాబు విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. సీనియర్ రాజకీయవేత్తనని చెప్పుకుంటూ పలకరాని భాష మాట్లాడుతూ తమను బూతులు తిట్టాల్సిన పనేంటని నిలదీశారు. చంద్రబాబు ఇంత హింసాత్మక ఘటనలకు ఉసిగొల్పుతారని అనుకుంటే ఆయన్ని రాష్ట్రంలో తిరగనిచ్చేవారు కాదన్నారు. అంగళ్లు, పుంగనూరు దాడుల్లో ప్రధాన ముద్దాయి చంద్రబాబే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.

వచ్చే ఎన్నికల్లో గొడవలు తప్పవు

- అధికారం లాక్కుందాం..
- ఇందుకు చచ్చిపోయే వ్యక్తులు కావాలి : పవన్‌కళ్యాణ్
- డబ్బు ఖర్చు చేస్తేనే నాయకులవుతారు



సాక్షి, అమరావతి: 'ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో ఇప్పుడున్న పాలన పోవాలి. ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలంటే ఆంధ్రప్రదేశ్ కోసం చచ్చి పోయే వ్యక్తులు కావాలి. అంటే త్యాగం చేయాలన్నది నా ఉద్దేశం. రాష్ట్రంలో ఈసారి జరిగే ఎన్నికల్లో చాలా గొడవలు ఉంటాయి. వాటిని మనం గట్టిగా ఎదుర్కోవాలి. అధికారం మనకు కావాలని అడిగితే ఎవడూ ఇవ్వడు. అధికారాన్ని మనం లాక్కోవాల్సిందే' అంటూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు దగ్గర పడ్డామని, ముందుగానే ఎన్నికలు జరుగుతాయనే సంకేతాలు ఉన్నాయని చెప్పారు. జగన్ అనే వ్యక్తి గానీ, ఆ పార్టీ నాయకులు గానీ ఎట్టి పరిస్థితుల్లో రాజకీయ అధిపత్యం వదులుకోవడానికి సిద్ధంగా ఉండరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఇబ్బంది లేకుండా పార్టీ నడపగలుగుతున్నానని చెప్పారు. ఇక్కడ వీరిని ఎదుర్కోవాలంటే చాలా గుండె దమ్ము ఉండాలని అన్నారు.

పది వేల ఓట్లు తెచ్చుకుంటేనే నేత

కనీసం పది వేల ఓట్లు తెచ్చుకోలేని వాళ్లు కూడ పార్టీలో నాయకులు అయిపోదామని ఆశ పడుతున్నారంటూ పవన్ కళ్యాణ్ సొంత పార్టీ నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ తరుపున పోటీ చేయాలనుకునే వారు కనీసం పది వేల ఓట్లు తెచ్చుకొనే తీరాలి. సర్వేలు చేయిస్తా. దాని ప్రకారమే సీట్లు ఇస్తా' అని స్పష్టం చేశారు. పార్టీ అధికార ప్రతినిధులు ముందుగా సిద్ధం కాకుండా ఇకపై టీవీ చర్చల్లో చిల్లరగా మాట్లాడొద్దని సూచించారు. 'రూపాయి ఖర్చు పెట్టకుండా నాయకులు అవ్వరు. ఖర్చు పెట్టి తీరాలి. ఈ పార్టీ ఆఫీసు నిర్మాణం కోసం నా పిల్లల ఎఫ్‌డీల రద్దు చేశా. అది నా బాధ్యత అనుకున్నా. మీరు అలా బాధ్యత తీసుకోవాలి' అని స్పష్టం చేశారు.

అందరినీ కలవడం కుదరదు

తాను నిరంతరం పార్టీ నేతలందరినీ కలవడం కుదరదని పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. 'ఓ ప్రసంగం కోసం దాదాపు 30–40 పుస్తకాలు తిరగేయాల్సి వస్తుంది. మేధోమథనం జరగాలి. రీసెర్చ్ అసిస్టెంట్లతో మాట్లాడాలి. రూంలో ఖాళీగా కూర్చోను. చాలా అధ్యయనం చేస్తుంటా. పాదయాత్ర చేయలేను. మనలో మనం విమర్శించుకోవడం, పోస్టులు పెట్టుకోవడం ఆపేయాలి. నాపై కేసులు పెట్టి జైలుకు పంపాలని పాలకులు ప్లాన్ వేశారు. నాకు ఏదైనా జరిగితే ఆ తర్వాత మీరు ఏదైనా చేయండి. ఇక నుంచి మంగళగిరి పార్టీ కార్యాలయంలోనే ఉంటాను. ఇదే నా స్థిర నివాసం' అని అన్నారు. ఇదిలా ఉండగా పుంగనూరు ఘటనపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. 'రాష్ట్రంలో వైసీపీ సర్కార్ వైఖరి ప్రతిపక్షం గొంతు నొక్కేలా ఉంది. చంద్రబాబు పర్యటనలో వైఎస్సార్‌సీపీ వాళ్లు దాడులకు పాల్పడటం ఆ పార్టీ హింసా ప్రవృతిని తెలియజేస్తోంది' అని ఓ ప్రకటన విడుదల చేశారు.

టీడీపీ దాడిపై వైఎస్సార్‌సీపీ నిరసన

కురబలకోట/పుంగనూరు : చంద్రబాబు పర్యటన సందర్భంగా కురబలకోట మండలంలోని అంగళ్లలో టీడీపీ శ్రేణులు రెచ్చగొడుతూ కవ్వింపు చర్యలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడటాన్ని ఆ పార్టీ తీవ్ర స్థాయిలో నిరసించింది. అంగళ్లు కూడలిలో పార్టీ జిల్లా కార్యదర్శి బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి.దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్.ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బైఠాయించారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యూహాత్మకంగా దాడి చేయించారని నిరసన తెలిపారు. పోలీసులు సర్ది చెప్పి నిరసన విరమింపజేశారు. అంతకు ముందు ఉదయం పుంగనూరులో వైఎస్సార్‌సీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు.

కడపపై బాబు కపట ప్రేమ

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కడుపులో కత్తులు పెట్టుకుని వైఎస్సార్ జిల్లా బిడ్డలపై చంద్రబాబు కపట ప్రేమను ఒలకబోస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్ జిల్లా గాంధీ పార్కులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండ్రోజుల క్రితం ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన చంద్రబాబు రాజకీయ అవసరాల కోసం దొంగ ప్రేమను ప్రదర్శించారన్నారు. జిల్లా వాసులు రాక్షసులని, కడప గుండాలని, రౌడీలని చంద్రబాబు గతంలో మాట్లాడిన మాటలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేశారు. వైఎస్సార్ కుటుంబంలో చిచ్చుపెట్టేందుకు, సునీతారెడ్డిని రాజకీయంగా వాడుకునేందుకే ఇలా మాట్లాడుతున్నారని చెప్పారు.

బీటెక్ విద్యార్థినికి ప్రాణం పోసిన సీఎం జగన్

- క్యాన్సర్‌తో ప్రాణాపాయ స్థితిలో విద్యార్థిని
- నిధులు మంజూరు.. ఆపరేషన్ పూర్తి.. కోలుకుంటున్న విద్యార్థిని


జాన్వీకౌసిక్

కోడుమూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీటెక్ విద్యార్థిని ప్రాణం నిలిపారు. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన గుర్రం క్రిష్ణయ్య 108లో డ్రైవర్, ఆయన భార్య నాగలక్ష్మమ్మ అంగన్‌వాడీ టీచర్. వీరి కుమార్తె జాన్వీకౌసిక్ ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. కాలికి గడ్డ ఏర్పడి.. అది క్రమంగా క్యాన్సర్‌గా మారింది. తల్లిదండ్రులు కర్నూలు, తిరుపతి, విజయవాడలో చూపించగా.. వైద్యులు ఆరు నెలలకు మించి ఆమె బతకదని, హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆశతో అక్కడికి వెళ్లగా రూ.7 లక్షలు ఖర్చవుతుందని, ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేసేందుకు కూడా పరిమితి దాటిందని చెప్పారు. దీంతో ఆ తల్లిదండ్రులు అంత ఖర్చు పెట్టి చూపించే స్తోమత లేక వెనుదిరిగారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకోవడంతో ఆయన ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులతో, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చూశారు. దీంతో విద్యార్థినికి మార్చి నెలలో బసవతారకం ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగింది. ఆగస్టులో విద్యార్థిని క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకోనుండటంతో ఆ తల్లిదండ్రుల సంతోషం అంతా ఇంతా కాదు. ఎన్నో ఆస్పత్రులు తిరిగి పాప ప్రాణం దక్కదని ఆశలు వదులుకున్న దశలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రూపంలో సీఎం జగన్ తమ బిడ్డ ప్రాణాలు కాపాడారని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు రుణపడి ఉంటామని చెబుతున్నారు. జగనన్న వల్లే తాను కోలుకుంటున్నానని విద్యార్థిని జాన్వీకౌసిక్ చెప్పింది.

నాగార్జున యాదవ్ బాధ్యతల స్వీకరణ


నాగార్జున యాదవ్‌ను అభినందిస్తున్న మంత్రులు అంబటి, కారుమూరి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యా, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌గా వై.సాయి నాగార్జున యాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ స్థాయికి తగ్గట్టుగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

వైద్య కళాశాలల్లో ఎస్‌ఆర్‌ల నియామకానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీనియర్ రెసిడెంట్ (ఎస్ఆర్)ల నియామకానికి ఈ నెల 7, 20 తేదీల్లో వాక్ ఇన్ ఇంటర్వ్యూల నిర్వహణకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 7వ తేదీ బ్రాడ్, సూపర్ స్పెషాలిటీల్లో, 20వ తేదీ ఓబీజీ, అనస్థీషియా విభాగాల్లో ఎస్ఆర్‌ల నియామకం చేపట్టనున్నారు. షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు వారి ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కళాశాలల్లో హాజరు కావాల్సి ఉంటుంది.

మెడికల్ పీజీ యాజమాన్య సీట్ల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ నాన్ మైనారిటీ, మైనారిటీ వైద్య, డెంటల్ కళాశాలల్లో యాజమాన్య కోట పీజీ, ఎండీఎస్ సీట్ల భర్తీకి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీ మెడికల్ ప్రవేశాల కోసం https://pgmq.ysruhs.com/, ఎండీఎస్ ప్రవేశాల కోసం https://mdsmq.ysruhs.com/ ల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 5న ఉదయం 11 గంటల నుంచి ఈనెల 14 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ అప్లికేషన్ లు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు నిబంధనలపై స్పష్టత కోసం 8978780501, 7997710168, 9391805238, 9391805239, సాంకేతిక సమస్యలపై 7416563063, 7416253073, 9063400829 ఫోన్ నంబర్లను లేదా appgadmissions2021@gmail.comను సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి తెలిపారు.

మహిళాభివృద్ధితోనే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి

- యూఎస్ కౌన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్


లార్సన్‌ను సత్కరిస్తున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: మహిళల ఆర్థిక అభివృద్ధితోనే దేశ ఆర్థికవ్యవస్థ పురోగతి చెందుతుందని యూఎస్ కౌన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతిలోని మహిళా వర్సిటీలో జరిగిన 'అకాడమీ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్స్'కి ఆమె హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విశాఖ, భువనేశ్వర్, హైదరాబాద్ నగరాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరవడం హర్షణీయమన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ పురోగతిలో మహిళా పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యం ఉందన్నారు. మహిళా వర్సిటీ వీసీ డి.భారతి మాట్లాడుతూ మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆరు నెలలపాటు జరిగే ఈ కార్యక్రమం మహిళల ఉన్నతికి ఉపయోగపడే విధంగా అకాడమీ తోడ్పడుతుందని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, ప్రోగ్రామ్ ఫెసిలిటేటర్ నాయని శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలగా ఉన్న కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు కల్పించింది. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి ఎన్.సుగుణారెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయడం వల్ల ఈ గుర్తింపు వచ్చిందని తెలిపారు. నన్నయ్య యూనివర్సిటీ వీసీ డాక్టర్ కొప్పిరెడ్డి పద్మరాజు అభినందించారని చెప్పారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి పాల్గొన్నారు.

ఏబీడీఎం అమలులో ఫ్రంట్ రన్నర్ ఏపీ

- నేషనల్ హెల్త్ అథారిటీ ప్రశంస

సాక్షి, అమరావతి: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) కార్యక్రమం అమలులో దేశంలో ఆంధ్రప్రదేశ్ ఫ్రంట్ రన్నర్‌గా ఉందని నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) ప్రశంసించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఆభా) రిజిస్ట్రేషన్‌లు చేయడంలో ఏపీ విజయాన్ని ప్రత్యేక కేస్ స్టడీగా ఎన్‌హెచ్ఏ గుర్తించిందని తెలిపారు. ఏబీడీఎం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను కేస్ స్టడీ రూపంలో ప్రచురించిందని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి సీఎం జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 4.13 కోట్ల మంది ఆభా ఐడీలు రిజిస్టర్ చేశామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ వెల్లడించారు.

- జర్నలిస్ట్ రెహాన రచించిన టర్కీ @ 7.8 పుస్తకాన్ని సీఎం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆవిష్కరించారు. రెహానను సీఎం అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, సమాచార శాఖ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై కఠిన చర్యలు

- ఫేక్ పోస్టులు, నకిలీ వార్తలు, ట్రోలింగులను ఉపేక్షించం
- బాధ్యులు దేశంలో ఉన్నా విదేశాల్లో ఉన్నా ఆటకట్టిస్తాం
- ఇంటర్‌పోల్ సహకారంతో కార్యాచరణ
- సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు
- సీఐడీ ఎస్పీ హర్షవర్ధన్ రాజు



సాక్షి, అమరావతి: సైబర్ నేరాలు, సోషల్ మీడియాలో దుష్ప్రచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐడీ ఎస్పీ (సైబర్ నేరాలు) హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. సైబర్ నేరాలకు పాల్పడిన వారు, సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు, నకిలీ వార్తలు, కించపరిచే వీడియోలు, వ్యాఖ్యలకు బాధ్యులు రాష్ట్రంలో, దేశంలో, విదేశాల్లోనూ ఎక్కడ ఉన్నా వారి ఆటకట్టిస్తామని చెప్పారు. ఈ నేరగాళ్లను పట్టుకొనేందుకు సీఐడీ విభాగం పరస్పర న్యాయ సహాయ ఒప్పందం ద్వారా ఇంటర్ పోల్, ఇతర దేశాలతో కలసి పనిచేస్తోందని చెప్పారు. ఆయన శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు సైబర్ భద్రత కల్పించేందుకు సీఐడీ విభాగం పూర్తిస్థాయిలో సిద్ధమైందన్నారు. ఆన్‌లైన్ ద్వారా వేధింపులు, ఆర్థిక మోసాలు, జూదం/బెట్టింగులు, సైబర్ బెదిరింపులు, ఉద్యోగ మోసాలు, వైవాహిక మోసాలు, రాన్సమ్‌వేర్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ రుణ మోసాలు మొదలైన అన్ని సైబర్ నేరాలను నిరోధించేందుకు సీఐడీ పూర్తిస్థాయి కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. వ్యక్తులు, సంస్థలు లక్ష్యంగా ఫేక్ పోస్టులు, వార్తలు, ట్రోలింగ్‌లు, మార్ఫింగ్ వీడియోలు వంటివి పోస్టు చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని నిరోధించేందుకు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (సీపీపీఎస్) ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను, డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేకంగా 60 మంది సైబర్ వలంటీర్లను కూడా నియోగించామన్నారు. నకిలీ వార్తలు, దుష్ప్రచార పోస్టులను తొలగించేందుకు ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నంబర్ 9071666667ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సైబర్ నేరాలు, దుష్ప్రచారాలపై రెండేళ్లలో ఏకంగా 23 వేల కేసులు నమోదు చేశామని, రూ.30 లక్షల వరకు బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశామని, 3 వేల మందిని మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఇటువంటి నేరాలను అరికట్టడంపై గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసు విభాగం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సైబర్ నేరాలపై మరింత అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలో అక్టోబరు 7, 8 తేదీల్లో సైబర్ హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు హర్షవర్ధన్ రాజు చెప్పారు.

సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుష్ప్రచారంపై ఫిర్యాదుకు ఏర్పాటు చేసిన వ్యవస్థలు

- ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్: 1930
- సైబర్ మోసాలను ఆన్‌లైన్‌లో నివేదించడానికి: cybercrime.gov.in
- సైబర్ నేరాలపై ఇ-మెయిల్ ద్వారా ఫిర్యాదుకు: cybercrimes& cid@ap.gov.in
- ఆన్‌లైన్ మోసాలపై ఫిర్యాదుల కోసం సీఐడీ వెబ్‌సైట్: cid.appolice.gov.in
- ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఫిర్యాదు చేసేందుకు: itcore&cid@ap.gov.in
- ట్విట్టర్ ఖాతా ద్వారా ఫిర్యాదు చేసేందుకు: @apcidcyber
- యూట్యూబ్ చానెల్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు: APCID4S4U

పాత జోనల్ విధానంలో మార్పులు

- కొత్త జిల్లాలను కలిపి కొత్త జోన్లు, మల్టీజోన్ ఏర్పాటు
- రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ ప్రతిపాదనపై సీఎస్ సమీక్ష
- రహదారుల కోత నివారణకు ఎఫ్‌డీఆర్ సాంకేతికతతో రోడ్ల నిర్మాణం
- సాంకేతికత విధానంలో రోడ్ల నిర్మాణంపై సీఎస్ సమీక్ష



సాక్షి, అమరావతి: పాత జోనల్ విధానంలో మార్పులు చేసి కొత్త జిల్లాలతో కొత్త జోన్లు, మల్టీజోన్ ఏర్పాటుచేయాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో స్థానికత, జోనల్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ చేయాల్సి ఉన్నందున.. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ ప్రతిపాదనపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. కొత్త జోన్లు, మల్టీజోన్ ఏర్పాటుచేసేందుకు వీలుగా రాష్ట్రపతి ఉత్తర్వుల (1975)కు సవరణ చేసేందుకు ప్రతిపాదిత అంశంపై సీఎస్ సమీక్షించారు. స్థానికత, ప్రతిపాదిత నూతన జోనల్ విధానం తదితర అంశాలపై సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి. భాస్కర్ వివరించారు. ఈ సమావేశంలో.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల కోత నివారణ..

ఇక రాష్ట్రంలో నదీ పరీవాహక ప్రాంతాల్లో దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్ల కోత నివారణకు కూడా ప్రభుత్వం త్వరలో ముగింపు పలకనుంది. ఇందుకోసం ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డీఆర్) సాంకేతికతతో రోడ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ అంశంపైనా శుక్రవారం సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. ఈ విధానంలో రోడ్ల నిర్మాణానికి తీసుకుంటున్న చర్యలపై ఆయన చర్చించారు. మెత్తటి నేలల్లో రోడ్లు నిర్మిస్తున్నా, వర్షాలుపడినా, వరదలు వంటి విపత్తులు వచ్చినా నదీతీర ప్రాంతాల్లోని రోడ్లు తరచూ కోతకు గురవుతున్నాయి. ఈ సమస్య తీర ప్రాంత జిల్లాల్లో దశాబ్దాలుగా ఎదురవుతోంది. ఇలా రహదారుల విధ్వంసంతో ప్రభుత్వానికి రూ.వేలకోట్ల నష్టం జరుగుతోంది. ఇకపై రోడ్లను రీసైక్లింగ్ చేయడం ద్వారా వనరుల కొరతతో పాటు వాటి జీవితకాలాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో.. ఫుల్ డెప్త్ రిక్లమేషన్ పెర్ఫార్మెన్స్ అనే కొత్త విధానంలో రోడ్ల నిర్మాణం అందుబాటులోకి వచ్చింది. ఈ విధానంలో పాత రోడ్డును యంత్రాల సాయంతో రెండు నుంచి మూడు అడుగుల లోతు తవ్వుతారు. ఆ తర్వాత సిమెంట్, కెమికల్‌తో మిక్స్‌చేసి చదును చేస్తారు. ఆపై ఒకదానిపై మరొక లేయర్‌ను నిర్మిస్తారు. ఇవి సాధారణ రోడ్లు కంటే 15 నుంచి 20 ఏళ్ల చెక్కుచెదరకుండా ఉంటాయి. పైగా ఈ విధానంలో రోడ్లు నిర్మిస్తే పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల ఈఎన్‌సీలు తదితరులు పాల్గొన్నారు.

'చెవిచిల్లు పెట్టే నీ గురక...చిందరవందర అయింది నా పడక' అని నిద్రలో గురక పెట్టే వాళ్లపైన చుట్టుపక్కలవాళ్లు గింజుకుంటారు. అయితే నిద్రలో గురకపెట్టేవారికి అంతకు మించిన సమస్యలే ఎదురవుతాయని హెచ్చరిస్తున్నాయి అధ్యయనాలు. ఎవరైనా మంచం మీద ఇలా వాలి అలా గుర్రుపెట్టారంటే హాయిగా నిద్రపోతున్నారనుకుంటాం. అయితే గురకపెడుతూ నిద్రపోవడం హాయిగా భావించడం సరికాదని, దానిని తీవ్రమైన ఆరోగ్య సమస్యగా భావించాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. గురక తెచ్చిపెట్టే సమస్యలపై మన దేశంలో అవగాహన అత్యల్ప స్థాయిలో ఉందని వారంటున్నారు



గురక హాయి కాదు... హాని

(సాక్షి, హైదరాబాద్)



ఇటీవల చేసిన రెస్మెడ్–2023 గ్లోబల్ స్లీప్ సర్వేలో 58 శాతం మంది భారతీయులు గురకను మంచి నిద్రకు చిహ్నంగా భావిస్తున్నట్లు తేలడం నిద్ర ఆరోగ్యంపై వారి అవగాహన లేమిని తేల్చింది. 2022తో పోలిస్తే 2023లో మన వాళ్ల నిద్ర నాణ్యత 22 శాతం క్షీణించినా సర్వేలో పాల్గొన్నవారిలో 85 శాతం మంది తమ నిద్ర నాణ్యత బాగుందన్నారని సర్వే వెల్లడించింది. మూడ్ మార్పులు, పగటినిద్ర, ఏకాగ్రత లోపం ఉన్న 20 శాతం మంది మాత్రమే వైద్యుడ్ని సంప్రదించాలని నిర్ణయించుకున్నారని తేల్చింది.

గురక.. అనారోగ్య కారణమే...

అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ మెడికల్ జర్నల్ 'న్యూరాలజీ ఆన్‌లైన్' సంచికలో ప్రచురించిన అధ్యయనం ప్రకారం..గురక పెట్టే వారికి స్ట్రోక్ వచ్చే అవకాశం 91 శాతం ఎక్కువ. అంతేకాదు గురక పెట్టేవారిలో దాదాపు 20–25 శాతం మంది గురక.. తద్వారా అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ఒఎస్ఎ)తో బాధపడుతూ ఉండవచ్చునని మరో అధ్యయనం తేల్చింది. గురకపెట్టే వారిలో ప్రతి నాల్గవ వ్యక్తి స్లీప్ అప్నియా రోగి అని వైద్యులు అంటున్నారు.

పిల్లలకు మరింత చేటు...

తీవ్రమైన గురకతో బాధపడుతున్న పిల్లలలో పగలు నిద్రమత్తు కారణంగా తరగతి గదిలో చురుకుదనం, శ్రద్ధ లోపిస్తాయి. చిరుతిళ్లు అధికంగా తినడం, చిరాకు, తరచుగా అలసట ఉంటాయి. గురక, నోటితో శ్వాస తీసుకోవడం, రాత్రి పూట చెమట పట్టడం వంటివి పిల్లల్లో గమనిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించాలి. కొన్నిసార్లు జెనటిక్స్‌తో పాటు ఎలర్జీలు కూడా పిల్లల శ్వాస కోస మార్గాలకు అడ్డంకులు ఏర్పరుస్తాయి.

–ఆర్.దీప్తి, చీఫ్ పీడియాట్రిషియన్, అమోర్ హాస్పిటల్స్



బాల్యంలోనే...

నగరానికి చెందిన ఏఐజీ ఆసుపత్రి ఇటీవలి అధ్యయనం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 శాతం మంది పిల్లలు గురక, నిద్రలేమితో బాధపడుతున్నారు. చిన్నారుల్లో గురకకు చికిత్స చేయకపోతే మానసిక వికాసం, మేధో సామర్థ్యాలు దెబ్బతింటాయని, శారీరక చురుకుదనంపై కూడా ప్రభావం చూపుతుందని, దీర్ఘకాలిక అనారోగ్యానికి దారితీయవచ్చునని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గురక లక్షణాలున్న కేసుల్లో దాదాపు 70 శాతం మంది పిల్లలకు స్లీప్ అప్నియా ఉన్నట్టు, 15 నుంచి 20 శాతం మంది పాఠశాల పిల్లలు ఊబకాయంతో ఉన్నారని వీరిలో అత్యధికులు గురకతో బాధపడేవారేనని ఏఐజీ అధ్యయనంలో తేలింది. నిద్ర పోకుండా పిల్లలు ఎక్కువ గంటలు మేల్కొని ఉండటం అధిక చురుకుదనం (హైపర్ యాక్టివ్‌నెస్) లక్షణంగా తల్లిదండ్రుల భావిస్తే అది అపోహ మాత్రమేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.


బాధితులు పెరుగుతున్నారు...

గురక–స్లీప్ అప్నియాతో బాధపడుతున్న చాలా మందికి దాని తీవ్రమైన పరిణామాల గురించి తెలియదని ఛాతీ, శ్వాసకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ సందీప్ అంటున్నారు. '40 శాతం మంది వ్యక్తులు గురక పెట్టినట్లయితే, వారిలో 10 శాతం మందికి స్లీప్ అప్నియా ఉన్నట్టే' అని దేశంలో తొలి స్లీప్ ల్యాబ్ ప్రారంభించిన డాక్టర్ జేసీ సూరి అన్నారు. తాను స్లీప్ ల్యాబ్ ప్రారంభించినప్పుడు నెలకు నలుగురైదుగురు రోగులు మాత్రమే వచ్చేవారని, ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరిగిందని అందులో మధ్య వయస్కులు, వృద్ధుల సంఖ్య దాదాపు 15–20 శాతంగా ఉందన్నారు. 'స్లీప్ అప్నియా ద్వారా రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదం కూడా ఉందని అంటున్నారు.

స్లీప్ అప్నియా లక్షణాలివే..

నిద్రలో కండరాలు సడలించడం వల్ల శ్వాసనాళాలు కుంచించుకు పోతాయి. ఫలితంగా ఆక్సిజన్ అందక అది నాణ్యమైన శ్వాసక్రియకు, నిద్రకు తీవ్రమైన అంతరాయం కలిగించే పరిస్థితే స్లీప్ అప్నియా. గురక ముదిరి స్లీప్ అప్నియాకు దారి తీస్తుంది. సాధారణంగా ఊబకాయం ఉన్న వారిలో ఇది కనిపిస్తుంది. మెడ చుట్టుకొలత తగినంత లేకపోవడం, ఎగువవైపునకు గాలి వెళ్లే మార్గం ఇరుకుగా మారడం స్లీప్ అప్నియాకు దోహదం చేస్తుంది. ఉదాహరణకు, పిల్లలలో టాన్సిల్స్ లేదా అడినాయిడ్స్ కూడా స్లీప్ అప్నియాకు కారణం కావచ్చు. స్లీప్ అప్నియా ముదురుతున్న దశలో వ్యక్తి సురక్షితంగా డ్రైవింగ్ చేసే సామర్థ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. పగటిపూట అధికంగా నిద్రపోవడం ఏకాగ్రత లోపాలకు దారితీస్తుంది. 'స్లీప్ అప్నియా చికిత్సలో భాగంగా బరువు తగ్గడం, ధూమపానం మానేయడం, ఆల్కహాల్ బాగా తగ్గించడం, తీరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం తప్పనిసరి. ఈ వ్యాధి తీవ్రమైతే రోగులకు మాస్క్ ద్వారా గాలిని అందించే వైద్య పరికరం, కొన్ని సందర్భాల్లో, అడ్డంకిని సరిచేయడానికి శస్త్రచికిత్స కూడా అవసరం కావచ్చు.

ప్రభుత్వ సూచనల మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. మూడేళ్లుగా పీజీ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఆర్ట్స్, సైన్స్ కోర్సుల్లో సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అవుతున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా సైన్స్ కోర్సుల్లో సీట్లను సైతం పెంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. వర్సిటీలో పెద్దఎత్తున క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు దీటుగా ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు కూడా భారీ వేతనాలతో ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. దీంతో యూనివర్సిటీలో అడ్మిషన్లు గణనీయంగా పెరుగుతున్నాయి. ఏయూలో పీజీ చదివేందుకు విదేశీ విద్యార్థులు సైతం ఆసక్తి చూపుతున్నారు. - ఏయూ క్యాంపస్



పీజీ కోర్సులకు ఫుల్ డిమాండ్

- మూడేళ్లుగా ఏయూలో సీట్లన్నీ భర్తీ.. డిమాండ్ గల విభాగాల్లో సీట్ల పెంపు
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు
- ఆర్ట్స్ విద్యార్థులకు సైతం రూ.లక్షల్లో వేతనాలు
- ఏయూలో ఉన్నత విద్యకు విదేశీ విద్యార్థులు సైతం ఆసక్తి

సైన్స్ కోర్సుల్లో సీట్ల పెంపు...: ఏయూలో సైన్స్ కోర్సులకు భారీ డిమాండ్ ఉంది. సైన్స్ కళాశాల పరిధిలో 30 కోర్సులు నిర్వహిస్తున్నారు. వీటిలో ఉపాధి అవకాశాలు, డిమాండ్ అధికంగా ఉన్న స్టాటిస్టిక్స్ విభాగంలో 40, బోటనీలో 40, బయోటెక్నాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సుల్లో 20 చొప్పున, అనలిటికల్ కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ 15, జువాలజీ, ఫిజికల్ కెమిస్ట్రీ, మెరైన్ బయోటెక్నాలజీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఫుడ్–న్యూట్రీషన్–డైటిక్స్‌లో 10 సీట్లు చొప్పున పెంచారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా గత ఏడాది మల్టీ ఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ విధానంలో ఐదేళ్ల కాలవ్యవధి కలిగిన ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును ప్రారంభించారు. కొన్ని సబ్జెక్టుల సిలబస్‌లోనూ మార్పులు చేశారు. మేధోహక్కులు (ఐపీఆర్) వంటి సబ్జెక్టులు కూడా జోడించారు. అధునాతన ప్రయోగశాలలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫలితంగా సైన్స్ కళాశాలలో 82 శాతానికి పైగా విద్యార్థులు ఉపాధి అవకాశాలు సాధిస్తున్నారు. ముఖ్యంగా కెమిస్ట్రీ విద్యార్థులు నూరుశాతం ఉద్యోగాలు పొందుతున్నారు.

ఆర్ట్స్ కోర్సులకూ ఆదరణ: మూడేళ్లుగా ఆర్ట్స్ కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. చరిత్ర, అర్థశాస్త్రం, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వంటి కోర్సుల్లో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు సైతం మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఇటీవల ముగిసిన విద్యా సంవత్సరంలో యూనివర్సిటీలోని ఎంబీఏ విద్యార్థికి అత్యధికంగా రూ.16 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం లభించింది. లైబ్రరీ సైన్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఎడ్యుకేషన్ వంటి విభాగాల విద్యార్థులకు సైతం రూ.3 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు వార్షిక వేతనాలతో మంచి ఉపాధి అవకాశాలు లభించాయి.




డిమాండ్‌కు అనుగుణంగా సీట్ల పెంపు

సైన్స్ కోర్సుల్లో డిమాండ్‌కు అనుగుణంగా సీట్లు పెంచుతున్నాం. బోధనతోపాటు ఉపాధి కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ప్రతి విద్యార్థికి కెరీర్ గైడెన్స్ ఇస్తున్నాం. ఇండస్ట్రీ కనెక్టివిటీ, ఇంటర్న్‌షిప్‌లకు అవకాశం కల్పిస్తున్నాం. తద్వారా మంచి ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. నూతన కోర్సులను ప్రారంభించి విజయవంతంగా నిర్వహిస్తున్నాం. – ఆచార్య కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, ఏయూ

ఆదిరెడ్డి అప్పారావుకు సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: జగజ్జనని చిట్‌ఫండ్ కేసులో ఆ సంస్థ ఎండీ ఆదిరెడ్డి అప్పారావుకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అప్పారావుకు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం విచారించింది. బెయిల్ విషయాల్లో సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు రాదని, చిట్‌ఫండ్ విషయం కావడంతో వచ్చామని ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తెలిపారు. వివరాలు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నామని చెప్పారు. ప్రతివాది ఆదిరెడ్డి అప్పారావుకు నోటీసులు జారీ చేస్తూ 4 వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

బీసీ నేత అప్పలరాజు అదృశ్యం



గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): భారతీయ యాదవ మహాసభ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నమ్మి అప్పలరాజు యాదవ్ గురువారం సాయంత్రం నుంచి కనిపించడం లేదు. ఆయన సాయంత్రం 8 గంటల సమయంలో ఎన్ఏడీలో ఉన్న తన కార్యాలయానికి స్కూటీపై వచ్చారు. కార్యాలయం వద్ద స్కూటీని పార్క్ చేసి హెల్మెట్ లోపల ఉంచి తాళాలు వేసి నడుచుకుంటూ బయటకు వెళ్లిపోయారు. గురువారం రాత్రి సుమారు 11 గంటల వరకు ఫోన్ ఆన్‌లో ఉంది. ఆ తరువాత నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. సింహాద్రినగర్‌లో భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి ఉంటున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిగ్రహం లేనివాడికి వివేకం ఉండదు.
యుక్తుడు కానివానికి ధ్యానం కుదరదు.
ధ్యానం లేనివాడికి శాంతి లేదు. శాంతి లేనివాడికి సుఖమెక్కడ?
– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 5 ఆగస్టు 2023

ఈ చట్టంతో సాధించేదేమిటి?

ఎంతోకాలంగా అటు ఔషధ పరిశ్రమలవారూ, ఇటు ప్రజారోగ్యరంగ కార్యకర్తలూ ఎదురు చూస్తున్న జనవిశ్వాస్ బిల్లు గత నెల 27న లోక్‌సభలో, ఈ నెల 2న రాజ్యసభలో ఆమోదం పొందింది. మణిపూర్‌పై అట్టుడుకుతున్న కారణంగా పార్లమెంటులో తీవ్రగందరగోళం ఏర్పడిన నేపథ్యంలో ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో గట్టెక్కిన ముఖ్యమైన బిల్లుల్లో ఇది కూడా చేరిపోయింది. 19 మంత్రిత్వ శాఖలకు సంబంధించిన 42 చట్టాలకు ఈ బిల్లు సవరణలు ప్రతిపాదించింది. ఇప్పుడు అమల్లో ఉన్న 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని ఔషధ రంగ పరిశ్రమలు ఎప్పటినుంచో చెబుతున్నాయి. అయితే ఆ చట్టంలోని లొసుగుల వల్ల నాసిరకం ఔషధ తయారీదారులపై కఠిన చర్యలు సాధ్యం కావటం లేదన్నది ప్రజారోగ్యరంగ కార్యకర్తల విమర్శ. తాజా సవరణ బిల్లు దాన్ని మెరుగుపరచకపోగా మరింత నీరుగార్చిందని వారి వాదన. ఈ బిల్లు మొత్తం 180 స్వల్ప నేరాలకు జైలు శిక్ష బదులు జరిమానాతో సరిపెట్టింది. చిన్న చిన్న సమస్యలను సైతం భూతద్దంలో చూపి జైలుకు పంపుతున్న ధోరణి సరికాదనీ, ప్రతి చిన్న అంశంలోనూ అధికారులకు వివరణ ఇవ్వాల్సి రావటం, కేసుల్లో ఇరుక్కుంటే న్యాయస్థానాల చుట్టూ తిరగటం ఉత్పాదకతకు అవరోధమవుతున్నదనీ ఔషధరంగ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. వారి కోణంలో ఈ సవరణలు మంచివే కావొచ్చుగానీ, రోగుల కోణం నుంచి దీన్ని పరిశీలించారా అన్నది సందేహమే.

ఫార్మారంగంలో మన దేశం అంతర్జాతీయంగా ముందంజలో ఉంది. కానీ కొన్ని ఫార్మా సంస్థలు నాసిరకం మందులు ఎగుమతి చేసి దేశం పరువుప్రతిష్ఠలను దెబ్బతీస్తున్న ఉదంతాలు తక్కువేం కాదు. మన దేశంనుంచి ఎగుమతైన దగ్గుమందు సేవించి ఆఫ్రికా ఖండ దేశం గాంబియాలో నిరుడు 70 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఆమధ్య ఉజ్బెకిస్తాన్‌లో కూడా 19 మంది పిల్లలు చనిపోయారు. ఇక్కడి నుంచి అమెరికాకు ఎగుమతైన కంటికి సంబంధించిన మందు వికటించి నిరుడు మే నెల నుంచి ఈ ఏడాది జనవరి వరకూ 55 మందికి సమస్యలు తలెత్తాయి. అందులో ఒకరు మరణించారు కూడా. పాత చట్టం కఠినంగా ఉన్నదని ఫార్మారంగం మొత్తుకుంటున్న కాలంలోనే ఇలాంటి ఉదంతాలు జరిగితే దాన్ని నీరుగార్చటం సమస్యను మరింత పెంచదా అన్న సందేహం ఎవరికైనా వస్తుంది. ఇప్పుడు అమల్లో ఉన్న చట్టం కల్తీ మందులు, నకిలీ మందులు, తప్పుదోవ పట్టించే పేర్లతో మందుల చలామణీ, నాణ్యతా ప్రమాణం కొరవడిన మందులు అని నాలుగు రకాలుగా వర్గీకరించింది. ఆ మందులు వాడినవారికి ఎదురయ్యే సమస్య తీవ్రతను బట్టి ఆ నేరాలకు శిక్షలున్నాయి. కల్తీ, నకిలీ మందులవల్ల రోగి మరణం సంభవించిన పక్షంలో అందుకు కారకులని గుర్తించినవారికి పదేళ్ల నుంచి యావజ్జీవ శిక్ష వరకూ ఉన్నాయి. తప్పుడు అభిప్రాయం కలిగించే బ్రాండ్‌లతో మందులు చలామణి చేస్తే రెండేళ్ల వరకూ శిక్ష ఉంది. ప్రామాణిక నాణ్యత లేని మందుల (ఎన్ఎస్‌క్యూ) తయారీకి రెండేళ్ల వరకూ శిక్ష, రూ. 20,000 వరకూ జరిమానా విధించవచ్చు. వీటన్నిటికీ తాజా బిల్లు అయిదు లక్షల వరకూ జరిమానాలతో సరిపెట్టింది. జైలు శిక్షలు తొలగించింది. ఇతర నేరాల మాటెలావున్నా ఎన్ఎస్‌క్యూ కేటగిరీ కిందకొచ్చే కేసులకు జైలు శిక్ష బెడద లేకుండా చేయటాన్నే ప్రధానంగా ప్రజారోగ్య రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఆఖరి కేటగిరీ 27(డి) కిందే దేశంలో ఎక్కువ కేసులు నమోదవుతుంటాయి. ఔషధంలో వినియోగించిన పదార్థాలు అనుమతించిన మోతాదులో కాకుండా వేరేవిధంగా ఉంటే ఆ ఔషధం రోగికి నిరుపయోగమవుతుంది. కానీ కొన్నిసార్లు జబ్బు ముదిరి మరణానికి దారితీసే ప్రమాదం ఉంటుందన్నది నిపుణుల వాదన. అలాంటి కేటగిరీని సైతం చిన్న తప్పిదంగా పరిగణించి జరిమానాలతో సరిపెడితే ఔషధ నాణ్యత దెబ్బతినదా... ప్రజారోగ్యం ప్రమాదంలో పడదా అని వారు ప్రశ్నిస్తున్నారు. నిజానికి నిరుడు ఈ బిల్లు ముసాయిదాను ప్రకటించి అన్ని వర్గాల నుంచీ అభిప్రాయాలు కోరినప్పుడు ప్రజారోగ్య నిపుణులు ప్రధానంగా దీనిపైనే అభ్యంతరం తెలిపారు. అసలు ఫార్మా కంపెనీలు నిబంధన ప్రకారం రిజిస్టరయిన ఫార్మాసిస్టులను నియమించు కోవాల్సి వుండగా చాలా సంస్థలు దాన్ని ఉల్లంఘిస్తున్నాయి.

అకారణంగా వేధించటాన్ని ఎవరూ సమర్థించరు. కానీ రోగుల ప్రాణాలతో ఆడుకునే విధంగా, కేవలం లాభార్జనే ధ్యేయంగా ఉండే సంస్థల విషయంలో కఠినంగా ఉండొద్దా? అసలే తరచు బయటికొచ్చే ఉదంతాల వల్ల విదేశాల్లో మన ఫార్మా ఉత్పత్తులపై చిన్నచూపు పడుతోంది. మన చట్టాలు చాలా ఉదారంగా ఉండటంవల్లే, తగిన తనిఖీలు లేనందువల్లే ఇదంతా జరుగుతోందన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడు తీసుకొచ్చిన బిల్లు ఆ అభిప్రాయాన్ని పోగొట్టే విధంగా లేకపోగా మరింత సరళంగా మార్చిందని ప్రజారోగ్య కార్యకర్తల ఆరోపణ. కేవలం కఠిన శిక్షలు, తనిఖీలు మాత్రమే సమస్యకు పరిష్కారం కాకపోవచ్చు. కానీ కల్తీ, నకిలీ మందుల కారణంగా రోగి ప్రాణం కోల్పోయినా, తీవ్రమైన వైకల్యం సంభవించినా ఆ రోగి కుటుంబానికి భారీయెత్తున పరి హారం చెల్లించే నిబంధన ఉంటే ఔషధ తయారీ సంస్థ దారికి రాదా? దీనికి బదులు రూ. 5 లక్షల జరిమానాతో సాధించేదేమిటి? ఈమాత్రం జరిమానా చెల్లించలేని స్థితిలో ఏ సంస్థయినా ఉంటుందా? పటిష్ఠమైన పర్యవేక్షణ, పారదర్శకత, నేరం చేస్తే కఠిన శిక్ష, భారీ పరిహారం చెల్లింపు తప్పదన్న భయం ఉంటేనే పరిస్థితి చక్కబడుతుంది. ఇవేమీ లేకుండా చట్టం తెచ్చి ప్రయోజన మేమిటి?

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: బ.చవితి ప.3.13 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.10.42 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.7.44 నుండి 9.15 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.44 నుండి 7.26 వరకు, అమృతఘడియలు: తె.4.45 నుండి 6.14 వరకు (తెల్లవారితే ఆదివారం)

సూర్యోదయం : 5.43
సూర్యాస్తమయం: 6.29
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఇంకా రహస్య యుద్ధమే విధానమా?

విశ్లేషణ



శాలినీ చావ్లా

ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే పాకిస్తాన్‌లో దాదాపు 270 ఉగ్రదాడులు జరిగాయి. పాకిస్తాన్ భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) భయంకరమైన దాడులను చేస్తోంది. తన ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికీ, రాజకీయ సంక్షోభానికి పరిష్కారాలను కనుగొనడానికీ ఒకవైపు పాకిస్తాన్ పోరాడుతుండగా... మరోకవైపు దేశంలో భద్రతా పరిస్థితి దిగజారుతోంది. అయినా పాకిస్తాన్ తన విదేశాంగ విధాన సాధనంగా రహస్య యుద్ధానికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కానీ తన సొంత గడ్డపై తీవ్రవాదం నుండి నిరోధక శక్తిని కోరుకుంటోంది. ఉగ్రవాదం, టీటీపీ విస్తరణ ఆందోళనకరమైనవి. సమీప భవిష్యత్తులో పాకిస్తాన్‌కే కాకుండా ఇవి దక్షిణాసియాకు కూడా తీవ్రమైన భద్రతా సవాళ్లను విసరనున్నాయి.

పాకిస్తాన్ వాయవ్య ప్రాంతంలోని బజౌర్ జిల్లాలో జూలై 30న జమీయత్ ఉలేమా–ఎ–ఇస్లాం ఫజల్ (జేయూఎల్–ఎఫ్) సమావేశంపై జరిగిన ఉగ్ర దాడిలో 50 మందికి పైగా మరణించారు, దాదాపు 200 మంది గాయపడ్డారు. ఈ దాడికి తామే బాధ్యులమని ఇస్లామిక్ స్టేట్ ఖురాసాన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ) ప్రకటించింది. గతంలో కూడా జేయూఎల్–ఎఫ్‌కు వ్యతిరేకంగా ఇస్లామిక్ స్టేట్ అనేక దాడులు చేసింది. ఈ దాడులకు ప్రధాన కారణాలలో ఒకటి, అఫ్గానిస్తాన్ తాలిబన్లతో జేయూఎల్–ఎఫ్‌కు ఉన్న అనుబంధం; మరొక కారణం, పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యానికి జేయూఎల్–ఎఫ్ ఇస్తున్న మద్దతును ఇస్లామిక్ స్టేట్ వ్యతిరేకించడం అని చెప్పాలి. బలూచిస్థాన్‌లోని ఝోబ్ ఆయుధాగారంపై ఇటీవల జరిగిన దాడిలో తొమ్మిది మంది పాకిస్తాన్ సైనికులు మృతి చెందారు. పాకిస్తాన్ ఉగ్రవాద ముఖచిత్రంలో తాజా ప్లేయర్ అయిన తెహ్రీక్– ఎ–జిహాద్ పాకిస్తాన్ (టీజేపీ) ఆ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది. టీజేపీ, తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ)తో అనుబంధాన్ని కొనసాగిస్తోంది. టీటీపీ పాకిస్తాన్ భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని దాడులను కొనసాగిస్తున్న భయంకరమైన సంస్థ.

తన ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికీ, రాజకీయ సంక్షోభానికి పరిష్కారాలను కనుగొనడానికీ ఒకవైపు పాకిస్తాన్ పోరాడుతుండగా... మరొకవైపు దేశంలో భద్రతా పరిస్థితి మరింత దిగజారుతోంది. గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన తర్వాత ఖైబర్ పఖ్తున్ ఖ్వా, బలూచిస్తాన్‌లలో టీటీపీ దాడులు పెరిగాయి. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే పాకిస్తాన్‌లో దాదాపు 270 ఉగ్రదాడులు జరిగాయి.

తాలిబన్లతో చెడిన మైత్రి

అఫ్గానిస్తాన్‌తో పాకిస్తాన్ సంబంధాలు దెబ్బతిన్నాయి. 2021 ఆగస్టులో కాబూల్‌ను తాలిబన్ స్వాధీనం చేసుకున్న తర్వాత మాజీ పౌర, సైనిక నాయకత్వం వ్యూహాత్మక విజయంగా భావించిన దానికి ఇది విరుద్ధంగా నడుస్తోంది. అమెరికా నిష్క్రమణ తర్వాత పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ సంబంధాలలో రెండు సమస్యలు కీలకంగా ఉన్నాయి. మొదటిది, డ్యూరాండ్ రేఖను సరిహద్దుగా గుర్తించడానికి తాలిబన్లు విముఖత వ్యక్తం చేయడంతోపాటు, సరిహద్దుల్లో కంచె వేయడాన్ని వారు ప్రతిఘటించడం. రెండవది, మిలిటెంట్ గ్రూపునకు మద్దతు నిచ్చే స్థావరాన్ని విడిచిపెట్టమని పాకిస్తాన్ సైన్యం పదే పదే సందేశం పంపినప్పటికీ, టీటీపీని తాలిబన్ ప్రోత్సహిస్తోంది. పైగా కాబూల్‌లో ప్రాతినిధ్య పాలన ఓడిపోయిన తర్వాత టీటీపీ గణనీయంగా బలపడింది. తాలిబన్ తో టీటీపీ బలమైన సైద్ధాంతిక (వ్యూహాత్మక) కూటమిని పంచుకున్నందున ఇది ఊహించదగినదే. టీటీపీ అనేది అఫ్గాన్ తాలిబన్లకు సైద్ధాంతిక విస్తరణ. పైగా ఉగ్రవాదంపై అమెరికా



సాగించిన యుద్ధ సమయంలో తాలిబన్లకు ఇది మద్దతునిచ్చింది. కాబట్టి తిరిగి సహాయం చేయడం కోసం టీటీపీకి తోడ్పాటును అందించాల్సిన బాధ్యత అఫ్గాన్ తాలిబన్లపై ఉంది. అయితే తాలిబన్లు తమ భూభాగంలో టీటీపీ ఉందనడాన్ని ఖండించారు. అంతేకాకుండా అఫ్గాన్ గడ్డపై దాడులను చేయరాదని పాకిస్తాన్‌ను హెచ్చరించారు కూడా.

అయినప్పటికీ, టీటీపీకి అఫ్గాన్ తాలిబన్లు మద్దతు ఇస్తున్నట్లు పాకిస్తాన్ సైన్యం గుర్తించింది. పైగా ఈ విషయంలో తదుపరి చర్యపై బలమైన ప్రకటనలను జారీ చేస్తోంది. ఝోబ్ దాడి తరువాత, 'అఫ్గానిస్తాన్‌లో టీటీపీకి అందుబాటులో ఉన్న సురక్షిత స్వర్గ ధామాలు, కార్యాచరణకు చెందిన స్వేచ్ఛపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు' పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇటువంటి దాడులు సహించలేనివనీ, పాకిస్తాన్ భద్రతా దళాలు వీటిపై సమర్థవంతంగా ప్రతిస్పందిస్తాయనీ ప్రకటించింది.

ఉగ్ర సంస్థలు ఏకమయ్యే ప్రమాదం

ఐఎస్ఐఎల్ (దాయెష్), అల్–ఖైదా, అనుబంధ గ్రూపులు, వ్యక్తులకు సంబంధించి... ఐక్యరాజ్య సమితి భద్రతామండలికి 'ది ఎనలిటికల్ సపోర్ట్ అండ్ శాంక్షన్స్ మానిటరింగ్ టీమ్' సమర్పించిన 32వ నివేదిక టీటీపీ ఒక ప్రాంతీయ ముప్పుగా మారవచ్చని పేర్కొంది. 'తాలిబన్ నియంత్రణలో దాడి ప్రయత్నాలను తప్పించుకుంటూ, అనేక రకాల విదేశీ సమూహాలు ఏకఛత్రంగా పనిచేస్తాయి లేదా ఐక్యమవుతాయి' అని ఈ నివేదిక తెలిపింది.

అయితే టీటీపీ గురించిన సైన్యం ప్రతిస్పందనపై పుష్కలమైన ఊహాగానాలు ఉన్నాయి. గత సంవత్సరం, పౌర, సైనిక ప్రభుత్వం పరస్పర విరుద్ధమైన ప్రకటనలు జారీ చేసింది. ఈ సందర్భంలో మూడు ఎంపికలను విశ్లేషించవచ్చు:

ఒకటి: పాకిస్తాన్ ప్రభుత్వం టీటీపీని తిరిగి చర్చల బల్ల వద్దకు తీసుకువచ్చి కాల్పుల విరమణకు ప్రయత్నిస్తుంది. ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్న గత ప్రభుత్వం టీటీపీ గ్రూప్‌తో చర్చలు జరపడానికి ప్రయత్నించి 100 మందికి పైగా టీటీపీ ఖైదీలను విడుదల చేసింది. ఇది టీటీపీ గ్రూప్ బలాన్ని పెంచింది. ప్రభుత్వానికి ఆమోదయోగ్యం కాని డిమాండ్లపై రాజీ పడేందుకు టీటీపీ ఎలాంటి సంకేతాన్నీ చూపలేదు. తీవ్రవాద దాడుల పెరుగుదలకు ఇమ్రాన్ ఖాన్ పదే పదే బాధ్యత వహించారని చెప్పవచ్చు.

రెండు: అఫ్గాన్ తాలిబన్‌ను పాకిస్తాన్ విశ్వాసంలోకి తీసుకుంటుంది. తరువాత గ్రూపును నియంత్రించే బాధ్యత తీసుకుంటుంది. అయితే తాలిబన్, టీటీపీల మధ్య బలమైన సంబంధాలు, తాలిబన్ నుండి టీటీపీ ప్రేరణ పొందడం, పైగా వారిని రోల్ మోడల్‌గా చూడటం ఈ అవకాశ సాధ్యాసాధ్యాలపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. అయితే, పాకిస్తాన్‌లోని అస్థిర పరిస్థితులను బట్టి, ఇది అక్కడి పాలనా వ్యవస్థకు సాధ్యమైన ఎంపికగానే కనిపిస్తోంది.

మూడు: టీటీపీని లక్ష్యంగా చేసుకుని ప్రతి–తిరుగుబాటు చేయడం. పాక్ మిలిటరీ ఇంతకుముందు 2014లో జర్బ్–ఎ–అజ్బ్, 2017లో రద్–ఉల్–ఫసాద్ వంటి ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహించింది. ఇవి టీటీపీ సంఖ్యను, ఉగ్రవాద దాడులను నిర్వహించగల దాని సామర్థ్యాన్ని ప్రభావితం చేశాయి. అయినప్పటికీ ఈ గ్రూప్ తనను తాను నిలబెట్టుకుని తాలిబన్ మద్దతుతో వృద్ధి చెందింది. అయితే నాలుగు కారణాల వల్ల పాక్ సైనిక ప్రతిస్పందనకు అవరోధం ఏర్పడింది. గిరిజన ప్రాంతాల్లో గణనీయమైన స్థానభ్రంశాలు చోటు చేసుకోవడం; భయంకరమైన ఆర్థిక సంక్షోభం (దాంతో పాటు వరదల వల్ల కలిగిన దుఃస్థితి); ఏ సైనిక చర్య అయినా దేశంపై ఆర్థిక ఒత్తిడిని తీవ్రతర చేయడం; అఫ్గాన్ తాలిబన్ల నుండి ఎదురు దెబ్బ తగిలే అవకాశాలు అపారంగా ఉండటం.

కుట్రలో భాగమా?

అయితే టీటీపీ గ్రూప్ కార్యకలాపాలను నియంత్రించకపోవడం పాక్ సైన్య ఉద్దేశపూర్వక కుట్ర చర్యలో భాగమనీ, ఉగ్రవాద వ్యతిరేక సహాయాన్ని అమెరికా నుంచి ఆకర్షించడానికే ఇలా చేస్తున్నారనే ఊహాగానాలు కూడా ఉన్నాయి. ఏమైనా పాక్ సైన్యం తన ఎంపికలను అప్రమత్తంగా పరిశీలిస్తుండగా, పాకిస్తాన్ మాత్రం తన వ్యూహాత్మక ఎంపికల బురదలో చిక్కుకుందనేది వాస్తవం. పాకిస్తాన్ తన విదేశాంగ విధాన సాధనంగా రహస్య యుద్ధానికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కానీ తన సొంత గడ్డపై తీవ్రవాదం నుండి నిరోధక శక్తిని కోరుకుంటోంది. ఉగ్రవాదం, టీటీపీ విస్తరణ ఆందోళనకరమైనవి. సమీప భవిష్యత్తులో పాకిస్తాన్‌కే కాకుండా ఇవి దక్షిణాసియాకు కూడా తీవ్రమైన భద్రతా సవాళ్లను విసరనున్నాయి.

వ్యాసకర్త డిస్టింగ్విష్డ్ ఫెలో, సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కఠిన వాస్తవం



వందేళ్ల క్రితం పరిశ్రమల్లో మాత్రమే ఉపయోగించిన నూనెలను ఇప్పుడు వంటనూనెలుగా అమ్ముతున్నారు. అవి మిమ్మల్ని స్థూలకాయుల్ని చేస్తూ, మీ ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి.
– బ్రాండన్ పెట్కే, వైద్యుడు

క్షమించుకోండి



జీవిత పాఠాలు: ఇతరులు మీకు చేసిన, చేసినట్టు ఊహించుకున్న వారి చర్యలను క్షమించేముందు... మీరు చేసిన, చేశాననుకుంటున్న చర్యలకు ముందు మిమ్మల్ని మీరు క్షమించుకోండి.
– శేఖర్ కపూర్, దర్శకుడు

నమ్మకం పోయింది!



తమను వదిలి వెళ్లొద్దని సైన్యాన్ని బతిమాలుతున్నారు కుకి–జో మహిళలు (వీడియో షేర్ చేశారు). సైన్యానికి బదులుగా రాష్ట్ర బలగాలను వాడే ఆలోచన చేస్తున్నారు మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్. కానీ కుకి–జో జనానికి రాష్ట్ర బలగాల మీద నమ్మకం లేదు. అంటే ముఖ్యమంత్రి మీద నమ్మకం లేదు. ఇంకా ఆయన ఎందుకు రాజీనామా చేయలేదు?
– తన్మోయ్, కాంగ్రెస్‌వాది

మేధావితనం



ఒక ఉదారవాది పరస్పర విరుద్ధంగా మాట్లాడితే అది 'సందర్భం' అవుతుంది. అదే ఒక రైట్ వింగర్ నిలకడతనాన్ని డిమాండ్ చేస్తే, అది పాత విషయాలను ఎత్తడం అవుతుంది. అందుకే వామపక్షీయులు ఎప్పుడూ నిలకడతనాన్ని డిమాండ్ చేయరు. వారి మనుగడే దానిమీద ఆధారపడి ఉంది.
– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యంగ్య వ్యాఖ్యాత

ఆధిపత్యమే లక్ష్యం



భావజాలం పేరుమీద జరుగుతున్న హింస భారతదేశాన్ని వెనక్కి చీకటి యుగాలకు నెడుతోంది. మతం పేరుతో హింస, లింగం పేరుతో హింస, కులం పేరుతో హింస, భాష పేరుతో హింస, ప్రాంతం పేరుతో హింస... ఈ మొత్తం హింస కూడా రాజకీయ, సామాజిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసమే.
– టోనీ జోసెఫ్, జర్నలిస్ట్

ఎవరు కారకులు?



ఇండియాలోని మత హింసకు చాలామంది బీజేపీని నిందించడాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ ఇంగ్లండ్, ఇటలీ, ఫ్రాన్స్, స్వీడన్, ఇంకా ఇతర చోట్లలో జరుగుతున్న హింసకు కారణాలేమిటని అదే జనాలను అడగాలనుకుంటున్నాను. ఆ దేశాల్లో కూడా బీజేపీ ప్రభుత్వమే ఉందా?
– మీరా చోప్రా, నటి

ఇంత పేదరికమా?



నేను మొరాకోలోని ఫెజ్ నగరంలో ఉన్నాను. 'పాత నగరపు' బజారు, ఇబ్న్ రుష్ద్ (12వ శతాబ్దపు తత్వవేత్త), ఇబ్న్ ఖల్దూన్(14వ శతాబ్దపు సామాజిక శాస్త్రవేత్త) చదివిన మదరసాలు దర్శించాను. నా జీవితంలో ఇంత పేదజనాలను ఎక్కడా చూడలేదు. గంటల తరబడి ఎంత నడిచినా కనబడేది పేదరికమే. ఇప్పుడు ఫెజ్‌లో ఇబ్న్ రుష్ద్ ఉండివుంటే ఏం ఆలోచించే వారు?
– అహ్మెత్ టి. కురు, సోషియాలజీ ప్రొఫెసర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

పొంచి ఉన్న ఆర్థిక సంక్షోభం

విశ్లేషణ



డి. పాపారావు

గత కొద్ది నెలలుగా అటు అమెరికాలోనూ ఇటు అనేక అభివృద్ధి చెందుతోన్న దేశాలలోనూ షేర్ మార్కెట్లు భారీగా పుంజుకుంటున్నట్టుగా కనపడుతోంది. ఈ అంశాన్నీ దానితో పాటుగా నేడు అమెరికాలో నిరుద్యోగం అతి తక్కువ స్థాయిలో ఉండడం, ద్రవ్యోల్బణం కూడా కిందికి దిగిరావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అమెరికాలో ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశాలు లేవని అనేక మంది ఆర్థికవేత్తలు చెబుతున్నారు. వీరితో పాటుగా అమెరికా ఫెడరల్ బ్యాంక్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ కూడా తాము ఇక ఎంతమాత్రమూ ఆర్థిక మాంద్యాన్ని ఊహించను కూడా ఊహించడం లేదని సెలవిచ్చారు. అలాగే 'సిలికాన్ వ్యాలీ బ్యాంక్' పతనంతో తలెత్తిన ఫైనాన్స్ రంగంలోని తుపాను కూడా సమసి పోయినట్టేనంటూ ఆయన చెబుతున్నారు.

అయితే ఇదంతా వాస్తవమేనా? అటు నిజ ఆర్థిక వ్యవస్థలోనీ, ఇటు ఫైనాన్స్ ఆర్థిక వ్యవస్థలోనీ ఇతరేతర పరిస్థితులూ లేదా గణాంకాలూ అన్నీ ఏం చెబుతున్నాయి? నిజానికి, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ సంక్షోభ సమయంలో అమెరికా ప్రభుత్వం డిపాజిట్‌దారులకు, వారి వారి డిపాజిట్ల మొత్తాన్ని కూడా వారికి చెల్లించే విధంగా చట్టంలో మార్పులు చేయడం వల్లనే నాడు ఆ ఫైనాన్స్ తుపాను మొత్తంగా బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలే దిశగా పోలేదు.

కాగా, ప్రస్తుతం 5.25 – 5.50 శాతంగా ఉన్నటువంటి అమెరికా ఫెడరల్ బ్యాంక్ వడ్డీ రేటు గనక ఒకేసారిగా 6 శాతానికి పెరిగితే అది తిరిగి ఫైనాన్స్ సంక్షోభానికి దారితీసే అవకాశం ఉందనీ, అయితే వడ్డీ రేటు పెంపుదలను కేవలం పావు (0.25) శాతానికి పరిమితం చేస్తే అటువంటి సంక్షోభం తలెత్తక పోవచ్చుననేది జెరోమ్ పావెల్ అభిప్రాయంగా ఉంది. కాగా, గతంలో ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతున్నప్పుడు... అది కేవలం తాత్కాలికమైనదనీ, మెల్లగా సర్దుకుంటుంది అనే పొరపాటు అంచనాలను కూడా ఫెడరల్ బ్యాంక్ వేసింది. 2022 ఆరంభం నుంచీ అనేక దఫాలు వడ్డీరేట్లను పెంచినా... ఇప్పటికీ అమెరికాలో ద్రవ్యోల్బణం నిర్దేశించుకున్న దానికన్నా 1 శాతం మేర ఎక్కువగానే ఉంది. ఇప్పటికే ప్రస్తుత వడ్డీ రేట్ల స్థాయిలో రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రుణాలు మొండి బకాయిలుగా మారిపోతున్నాయి. ఈ క్రమంలోనే ఆస్తుల విలువలు పతనం అవుతున్నాయి.

దిగజారుతోన్న కష్టమర్లు లేదా వినియోగదారుల పరిస్థితిని గమనిస్తోన్న అమెరికా బ్యాంకులు ఇప్పటికే తామిచ్చిన రుణాలను నష్టానికి కూడా సిద్ధపడి వాటిని వసూలు చేసుకోగల ఇతరేతర సంస్థలకు అమ్మేసుకుంటున్నాయి. అంతేకాదు ఇంకా కిస్తీలు (ఇన్‌స్టాల్‌మెంట్‌లు) వసూలవుతున్నా ఆ రుణాలనూ అమ్మే సుకుంటున్నాయి. అంటే, ఈ బ్యాంకుల అంచనాలో అటువంటి రుణాలు ముందు ముందు మొండి బకాయిలు కావడం తథ్యమన్న మాట.

ఇక నేడు మొండి బకాయిలుగా మారే అవకాశం ఉన్న మరొక తరహా రుణాలు – ఎడ్యుకేషన్ లోన్స్. వాస్తవానికి నేటి అమెరికాలోని పూర్తిస్థాయి ఉద్యోగితలో తమ చదువుల కోసం రుణాలు తీసుకున్న విద్యార్థులకు, ఈ ఎడ్యుకేషన్ రుణాలను చెల్లించడం పెద్ద సమస్యగా ఉండరాదు. కానీ, మరి ఇవ్వాళ ఈ రుణాలు చెల్లించడం ఎందుచేత విద్యార్థులకు కష్టం అవుతోంది? 'టైమ్స్' పత్రి కలో వచ్చిన ఒక కథనం ప్రకారంగా – 2008 సంక్షోభ కాలంలో పోయినవి మధ్య స్థాయి ఉద్యోగాలు కాగా 'సంక్షోభ అనంతర' కాలంలో తిరిగి వచ్చినవి కేవలం పార్ట్‌టైమ్, చిన్న స్థాయి, తక్కువ వేతనాల ఉద్యోగాలే. ఈ కారణం చేతనే ఇప్పుడు అత్యధిక యువజనులు తమ కొద్దిపాటి వేతనాలతో తాము తీసుకున్న స్టూడెంట్ రుణాలను తీర్చలేక పోతున్నారు.

టెక్నాలజీ రంగ కంపెనీలలో ఉద్యోగాల కోతలు



ఈ పెరుగుదల తాత్కాలికమే!

మొదలుకుని అమెరికాకు భారీగా సరుకులు, సేవలను ఎగుమతి చేసే దేశాలైన – చైనా, భారతదేశం తాలూకు ఎగుమతులు నేడు భారీగా పడిపోతుండడం వంటివన్నీ నేడు ముంచుకొస్తోన్న సంక్షోభానికి తార్కాణాలే. దీనితో పాటుగా ప్రస్తుతం అమెరికాలో ట్రక్ రవాణా కంపెనీల నుంచి – డీజిల్ ఇంజన్ల కోసం ఆర్డర్లు 40 శాతం మేరకు పడిపోవడాన్ని కూడా మనం గమనించవచ్చు. అంటే, అమెరికా సరుకు ఉత్పత్తి రంగంలో మందగమనం ఇప్పటికే మొదలయ్యిందన్నమాట!

అలాగే ప్రస్తుతం పెరుగుతోన్న షేర్ మార్కెట్ సూచీల అంశంలో కూడా గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవచ్చు. 2001వ సంవత్సరంలో అమెరికా హైటెక్ షేర్ మార్కెట్ పతనం మనందరికీ తెలిసిందే. ఈ పతనం ముందర 1995 నుంచి 2000 సంవత్సరం వరకు అమెరికా నాస్‌డాక్స్ షేర్ సూచీ సుమారు 800 శాతం మేరకు పెరిగింది. కాగా, 2001 పతనం అనంతరం 2002 నాటికల్లా ఈ సూచీ దారుణంగా పతనమై, దాని విలువను 790 శాతం మేర కోల్పోయింది. కాబట్టి ప్రస్తుత షేర్ మార్కెట్ సూచీల పెరుగుదల మాంద్యం రాదనడానికి ఏమాత్రం భరోసా కాదు.

నేడు అమెరికాలో నిరుద్యోగం రికార్డ్ స్థాయిలో తక్కు వగానే ఉంది. అయితే ఉద్యోగుల పని గంటలు కొద్దిమేరకు తగ్గిపోయి ఉన్నాయి. నోమురా సెక్యూరిటీస్ సంస్థకు చెందిన సీనియర్ ఎకనామిస్ట్ ఒకరి ప్రకారంగా 'గతంలో, ఈ విధంగానే తగ్గిన పనిగంటలు ఆ తరువాతి కాలంలో ఉప్పెనలా రానున్న ఉపాధి కోతలకూ నమ్మకమైన ముందస్తు సూచిక'గా ఉన్నాయి. ఇక దీనంతటితో పాటుగా కృత్రిమ మేధ రూపంలో నేడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానం ధనిక దేశాలలో పావు భాగం పైగా ఉద్యోగాలను తొలగించి వేయగలదని గణాంకాలు చెబుతున్నాయి. ఈ మొత్తం పరిస్థితి యావత్తూ నేడు అనివార్యంగా ముంచుకొస్తోన్న ఆర్థిక మాంద్యం స్థితికి ముందస్తు సూచికలుగా ఉన్నాయి. గడ్డుకాలాన్ని తట్టుకొని నిలబడే మనో స్థైర్యాన్నీ, సాధ్యమైతే ఆర్థిక వనరులను కూడా సమకూర్చుకోడం, కూడదీసుకోవడం నేటి తప్పనిసరి అవసరం!

వ్యాసకర్త ఆర్థిక రంగ విశ్లేషకులు । 98661 79615

త్రికరణ శుద్ధి

'త్రికరణ శుద్ధిగా శివుడిని పూజిస్తే, సర్వమూ సాధించ గలవు!' అంటారు పెద్దలు. ధ్యాసంతా శివుడి మీద ఉంచాలనే భక్తుడి ఇచ్ఛ కూడా. కానీ ఆచరణలో అదంత తేలిక కాదు. తన మనసూ ఇంద్రియాలూ తన మాట వినవు. అవి, వాటి ఇచ్ఛ ప్రకారం కోతికొమ్మచ్చు లాడుతూ, ఏవేవో ఇతర విషయాలన్నిటి మీదా ప్రసరిస్తూ ఉంటాయి. అవును మరి, యజమాని తాను యజమానినన్న మాటే మరచి, తన సేవకులైన ఇంద్రియాలకు తగని స్వేచ్ఛ ఇచ్చి, వాళ్ళ ఇష్టప్రకారం తను నడుచుకొంటూ, వాళ్ళను తృప్తి పరిచేందుకే తన పుణ్య కాలమంతా గడుపుతుంటే, ఇక ఆయన మాటెందుకు నెగ్గుతుంది? గుర్రాన్ని తన ఇష్ట ప్రకారం పోనిస్తే, అది రౌతు చెప్పిన గమ్యానికి చేరదు. తనకు నచ్చిన గమ్యానికి రౌతును చేరుస్తుంది.



జ్యోతిర్మయం

'మనసూ, ఇంద్రియాలూ, వాక్కు మన వశంలో ఉండాలంటే, వాటికెప్పుడూ చేతినిండా పని ఉండాలి. ఇతర విషయాల మీదికి మళ్ళ గలిగే తీరికే వాటికి ఇవ్వగూడదు!' అనేది ఒక శివ భక్తుడు చెప్పే చిట్కా.

ఆ భక్తుడి ప్రార్థన ఇలా సాగుతుంది: 'ఓ మహాదేవా! నా మనసు అనవరతం నీ పద పంకజాల మీద లగ్నమై ఉండుగాక! నా వాక్కు నిరంతరం తదేక ధ్యానంతో నీ స్తోత్రాలే జపిస్తూ ఉండుగాక! నా చేతులు ఎప్పుడూ నీ పూజలో నిమగ్నమై ఉండుగాక! నా చెవులు ఎప్పుడూ నీ అద్భుతమైన లీలల గురించిన కథలే ఆకర్షిస్తూ ఉండుగాక! నా నయన యుగళం ఎల్లవేళలా నీ మూర్తినే చూస్తూ ఉండుగాక. ఇలా నా దగ్గర ఉన్న మనో వాక్కరణాలనే ఇంద్రియాలన్నీ శివోన్ముఖమై, శివకైంకర్యంలో మునిగి ఉంటే, ఇతర విషయాల మీదకు నా ధ్యాసను లాగేందుకు నాకు మరే ఇంద్రియాలూ మిగలవు. ఇంద్రియాల ప్రమేయం లేకపోతే విషయాలతో సంబంధమే ఏర్పడదు. ఇక అప్పుడు, పరగ్రంథాన్ కైర్వా, పరమశివ!, జానే పరం అతః? – నీకంటే వేరయిన ఇతర విషయాలను, ఇక నేను ఏ ఇంద్రియాల ద్వారా పట్టించుకోగలుగుతాను?' – (ఆది శంకరుల 'శివానంద లహరి').

– ఎం. మారుతి శాస్త్రి

విద్యుత్ ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లపై యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. ఉద్యోగులతో శుక్రవారం జరిగిన చర్చల్లో పలు డిమాండ్లను ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, మూడు డిస్కంల యాజమాన్యాలు సూత్రప్రాయంగా అంగీకరించాయి. వైద్యం విషయంలో అత్యవసరమైనప్పుడు ముందుగా డిపార్ట్‌మెంట్ ఇచ్చే డబ్బులు వాడుకుని, తర్వాత సెల్ఫ్ ఫండ్ స్కీమ్ డబ్బులు వాడుకునేలా అనుమతించాలని ఉద్యోగులు కోరారు. దీనికి యాజమాన్యాలు అంగీకరించాయి. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు, దీర్ఘకాలిక వ్యాధులకు ఇచ్చే మెడికల్ సదుపాయాన్ని రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచుతామని తెలిపాయి. అయితే మన్మోహన్ సింగ్ కమిటీ రిపోర్టులో మాస్టర్ స్కేల్ రూ.1,99,000 ఉందని, దానిమీద ఐదు స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్లు (దాదాపు రూ.2,27,000) ఇస్తామని ప్రతిపాదించాయి. మాస్టర్ స్కేల్, కేడర్ స్కేల్ మీద పర్సనల్ పే తప్పనిసరిగా ఉంటుందని స్పష్టం చేశాయి. పర్సనల్ పేకి పెన్షనరీ బెనిఫిట్స్ అన్నీ కల్పిస్తామన్నాయి. ఉద్యోగులందరికి 5 శాతం ఫిట్మెంట్ ఇస్తామని, రావాల్సిన మూడు డీఏలలో ఒకటి తక్షణమే విడుదల చేస్తామని తెలిపాయి. డీఏ ఎరియర్స్ 12 వాయిదాల్లో చెల్లిస్తామన్నాయి. కాంట్రాక్టు కార్మికులకు 2018 రెగ్యులర్ ఉద్యోగుల పే స్కేల్ వర్తింపజేస్తామన్నాయి. అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ అనేది జేఈ, జూనియర్ అసిస్టెంట్ టెస్టు పెట్టి, అందులో పాస్ అయిన వారికి కల్పిస్తామని చెప్పాయి. మరణించిన ఉద్యోగుల స్థానంలో వారి కుటుంబసభ్యులను నియమించేందుకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వయసు ప్రాతిపదికన సోమవారానికల్లా పరిష్కరిస్తామని యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ కె.వి.ఎస్.చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో జేఎండీ బి.మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు, జేఏసీ, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టు గేటు బిగింపు పూర్తి

రెండేళ్ల క్రితం వరద ఉధృతికి కొట్టుకుపోయిన 16వ గేటు



- 48 గంటల్లోనే స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- పూర్తి స్థాయిలో నీటి నిల్వ.. ఆయకట్టుకు నీరు
- నీటి నిల్వ తగ్గాక కొత్త గేటు పనులు ప్రారంభం
- 18.50 మీటర్ల ఎత్తు, 17 మీటర్ల వెడల్పు 250 టన్నుల బరువుతో గేటు తయారీ
- సెల్ఫ్ లూబ్రికెంట్ బుష్‌ల తయారీలో తీవ్ర జాప్యం చేసిన జపాన్ సంస్థ
- పది రోజుల క్రితం బుష్‌లు రాక
- వెంటనే యుద్ధప్రాతిపదికన గేటు బిగించిన అధికారులు

సాక్షి, అమరావతి: రెండేళ్ల క్రితం వరద ఉధృతికి కొట్టుకుపోయిన పులిచింతల ప్రాజెక్టు 16వ గేటు స్థానంలో కొత్త గేటును బిగించారు. జలవనరుల శాఖ అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టు సంస్థ బీకెమ్ ప్రతినిధులు శుక్రవారం ఈ ప్రక్రియ పూర్తి చేశారు. 18.50 మీటర్ల ఎత్తు, 17 మీటర్ల వెడల్పుతో 250 టన్నుల బరువున్న గేటును భారీ క్రేన్ల సహాయంతో అమర్చారు. స్పిల్ వే 16, 17 పియర్స్ (కాంక్రీట్ దిమ్మెలు) మధ్య గేటును దించి.. ఆర్మ్ గడ్డర్లను పియర్స్ ట్రూనియన్ బీమ్‌ల యాంకర్లను జపాన్ నుంచి దిగుమతి చేసుకున్న సెల్ఫ్ లూబ్రికెంట్ బుష్‌లతో అనుసంధానం చేశారు. ఆ తర్వాత గేటును పైకి ఎత్తుతూ.. కిందకు దించుతూ పలుమార్లు పరీక్షించారు. గేటు పనితీరు ప్రమాణాల మేరకు ఉన్నట్లు అధికారులు తేల్చారు.

జపాన్‌లో బుష్‌ల తయారీ, దిగుమతిలో జాప్యం వల్లే

నాగార్జున సాగర్ నిండిపోవడంతో 2021 ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 55,028 క్యూసెక్కులను తెలంగాణ అధికారులు దిగువకు విడుదల చేశారు. ఆ రాత్రికి 1.80 లక్షల క్యూసెక్కులకు పెంచారు. పులిచింతల ప్రాజెక్టులో అప్పటికే 44.54 టీఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి భారీ వరద రావడంతో అంతే స్థాయిలో దిగువకు విడుదల చేసేందుకు 2021 ఆగస్టు 5 తెల్లవారుఝామున ఏడు గేట్లను రెండడుగులు ఎత్తారు. ఈ క్రమంలోనే 16వ గేటు ఎడమ వైపు పియర్ ట్రూనియన్ బీమ్ విరిగిపోయి గేటు ఊడిపోయింది. వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి, 48 గంటల్లోనే దాని స్థానంలో స్టాప్‌లాగ్ గేటును ఏర్పాటు చేసింది. పూర్తి స్థాయిలో 45.77 టీఎంసీలు నిల్వ చేసి ఆయకట్టుకు నీరందించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జలాశయంలో నీటి నిల్వ తగ్గాక కొత్త గేటు బిగించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. 16, 17వ పియర్‌లకు ట్రూనియన్ బీమ్‌లను కొత్తగా నిర్మించారు. గేటును కూడా సిద్ధం చేశారు. గేటును పియర్స్ మధ్య బిగించడానికి, వాటి ఆర్మ్ గడ్డర్లను ట్రూనియన్ బీమ్‌లతో అనుసంధానం చేసే సెల్ఫ్ లూబ్రికెంట్ బుష్‌లను గతంలో జపాన్ సంస్థ నుంచి దిగుమతి చేసుకున్నారు. కొత్త బుష్‌ల తయారీలో జపాన్ సంస్థ తీవ్ర జాప్యం చేసింది. దీని వల్లే గేటు బిగింపు ఆలస్యమైంది. పది రోజుల క్రితం జపాన్ సంస్థ బుష్‌లను పంపడంతో అదే రోజు గేటు బిగింపు ప్రక్రియను ప్రారంభించిన అధికారులు శుక్రవారం పూర్తి చేశారు.

కృష్ణా డెల్టాకు వరం..

కృష్ణా డెల్టాలో ఖరీఫ్ పంటకు సకాలంలో నీటిని విడుదల చేసి.. తుపానులు వచ్చేలోగా పంట కోతలు పూర్తయ్యేలా చేయడం ద్వారా రైతుకు దన్నుగా నిలవాలనే లక్ష్యంతో వైఎస్ రాజశేఖరరెడ్డి 2005 నవంబర్ 18న పులిచింతల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 20,37,656 క్యూసెక్కుల వరద వచ్చినా దిగువకు సులభంగా విడుదల చేసేలా పులిచింతల ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 45.77 టీఎంసీలు. స్పిల్‌వేకు 18.50 మీటర్ల ఎత్తు, 17 మీటర్ల వెడల్పుతో 24 గేట్లను బిగించారు. చంద్రబాబు ప్రభుత్వం నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడంతో 2014 నుంచి 2019 వరకు ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయలేకపోయారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే యుద్ధప్రాతిపదికన నిర్వాసితులకు పునరావాసం కల్పించి, 2019 ఆగస్టులోనే పులిచింతలలో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. గత నాలుగేళ్లుగా ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తూ కృష్ణా డెల్టాలో రెండు పంటలకు సకాలంలో నీళ్లందిస్తూ రైతులకు దన్నుగా నిలుస్తున్నారు.

త్వరలో టీటీడీ వెబ్‌సైట్‌లో రిఫండ్ ట్రాకర్

- 3–5 పనిదినాల్లో కాషన్ డిపాజిట్ చెల్లింపు
- డయల్ యువర్ ఈవోలో ధర్మారెడ్డి వెల్లడి



తిరుమల: తిరుమలలో గదులు పొందిన భక్తులకు రీఫండ్ సమాచారాన్ని ఎస్ఎంఎస్ ద్వారా పంపుతున్నామని, త్వరలో స్పీడ్ పోస్ట్ తరహాలో రిఫండ్‌ను ట్రాక్ చేసేందుకు టీటీడీ వెబ్‌సైట్‌లో ట్రాకర్‌ను పొందుపరుస్తామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తులు అడిగిన ప్రశ్నలకు ఈవో సమాధానమిచ్చారు. తిరుమలలో యూపీఐ ద్వారా చెల్లింపులు చేసిన వారికి గదులు ఖాళీ చేసిన వెంటనే కాషన్ డిపాజిట్‌ను రిఫండ్ చేస్తున్నామని, క్రెడిట్/డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసి గదులు పొందిన వారికి 3–5 పని దినాల్లోపు వారి ఖాతాలకు కాషన్ డిపాజిట్ మొత్తాన్ని జమ చేస్తున్నామని చెప్పారు. తిరుమలలో ఆగస్టు 27–29 వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాను క్యాన్సర్ రహిత ప్రాంతంగా తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామూహిక క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి టీటీడీ సహకారం అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించడం కోసం ఓ పింక్ బస్సును ఆధునిక వైద్య పరికరాలతో జిల్లా యంత్రాంగానికి విరాళంగా ఇస్తామన్నారు. స్విమ్స్‌లో త్వరలో లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి టీటీడీ ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. టీటీడీ విద్యా విభాగం ఆధ్వర్యంలో తిరుమల ఘాట్ రోడ్లు, నడక మార్గాల్లో ఆగస్టు 12న శుద్ధ తిరుమల–సుందర తిరుమల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 25న తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తామన్నారు. జూలైలో 23.23 లక్షల మంది శ్రీవారిని దర్శించుకోగా..కానుకల రూపంలో హుండీలో రూ.129.08 కోట్లు వచ్చినట్లు చెప్పారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య

కడప కార్పొరేషన్ : నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో దూషించిన మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.యానాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఓ పచ్చ టీవీ చానల్ నిర్వహించిన కార్యక్రమంలో జేసీ ప్రభాకర్ రెడ్డి నాయీ బ్రాహ్మణులను కించపరుస్తూ, అవమానిస్తూ మాట్లాడటం దారుణమన్నారు. గతంలో అనంతపురం ఆర్టీవోగా పనిచేసిన గాంధీని అవమానించారని, ఇప్పుడు ఆయననుద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. టీడీపీలో చిన్నకులాలంటే చిన్నచూపని, గతంలో సాక్షాత్తు పార్టీ అధ్యక్షుడైన చంద్రబాబే నాయీ బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని, సచివాలయంలోకి మిమ్మల్ని ఎవడు రానిచ్చాడని మాట్లాడారని గుర్తు చేశారు. నాయీ బ్రాహ్మణులను మంగలి అని సంబోధిస్తే 1860 సెక్షన్ ప్రకారం శిక్షించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో ఇచ్చారని తెలిపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై అన్ని పోలీస్‌స్టేషన్లలో కేసులు పెడతామన్నారు. జేసీని మంగళవారంలోపు అరెస్ట్ చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు. చంద్రబాబు, లోకేశ్‌లకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే జేసీ ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆమంచిపై మూడు కేసులు కొట్టివేత

చీరాల: చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌పై టీడీపీ హయాంలో పెట్టిన మూడు అక్రమ కేసులను శుక్రవారం విజయవాడ స్పెషల్ కోర్టు కొట్టివేసింది. చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయనగర్ కాలనీకి సంబంధించిన కేసులు, ఒంగోలు రూరల్ పరిధిలోని నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన కేసులను శుక్రవారం విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యే స్పెషల్ కోర్టులో కొట్టివేశారు. టీడీపీ హయాంలో చీరాల విజయనగర్ కాలనీలో జన్మభూమి కమిటీలు, ప్రొటోకాల్ విషయంలో అప్పటి ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, 23 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అలానే వేటపాలెంలో ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లి శవంగా తీసుకొచ్చి బంధువులకు అప్పజెప్పినందుకు, లాకప్‌లో చనిపోయిన వ్యక్తిని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో పోస్టుమార్టం చేసి శవాన్ని బంధువులు స్వగ్రామానికి తీసుకొస్తున్న సందర్భంలో మార్గమధ్యంలో నాగులుప్పలపాడు పోలీసులు శవరాజకీయం చేయడాన్ని ప్రశ్నించినందుకు పోలీసులు ఆయనపై, ఆయన అనుచరులు 10 మందిపై కేసు నమోదు చేశారు. అలానే పోలీసులు, నాయుడు నాగార్జున కలిసి మరొక ఘటనలో ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పెట్టిన కేసును కూడా విజయవాడ స్పెషల్ కోర్టు ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులో కేసు కొట్టివేశారు.

మొబైల్ రక్తసేకరణ వ్యాన్‌లను ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకుల రక్త సేకరణ కోసం రెండు మొబైల్ వ్యాన్‌లను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విజయవాడలోని రాజ్‌భవన్ ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభించారు. ఒక్కొక్కటి రూ.కోటి విలువ చేసే ఈ వ్యాన్‌లను కెనడియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఢిల్లీలోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ సమకూర్చాయి. ఈ రెండు వ్యాన్‌లను చిత్తూరు, అనంతపురం రెడ్‌క్రాస్ బ్రాంచ్‌లకు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరిడా తదితరులు పాల్గొన్నారు.

‘జయలక్ష్మి’ బాధితులకు సర్కార్ అండ

- నిందితుల ఆస్తుల స్వాధీనానికి సీఐడీకి అనుమతి
- మాజీ చైర్మన్ ఖాతాలో ఉన్న రూ.25 లక్షలు స్వాధీనం చేయాలని కోరిన కొత్త పాలకవర్గం



బ్రాంచ్ తాళాలు స్వాధీనం చేయాలని రామచంద్రాపురం డీఎస్పీ ప్రసాద్‌ను కోరుతున్న పాలకవర్గ సభ్యులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధిక వడ్డీల ఆశ చూపి వేలాది మందితో రూ.520 కోట్ల మేర డిపాజిట్లు చేయించుకుని కాకినాడలోని సర్పవరంలో జయలక్ష్మి కోఆపరేటివ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ బోర్డు తిప్పేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి సొసైటీ గత పాలకవర్గ సభ్యులను జైలుకు పంపింది. అంతేకాకుండా వారి పేరుతో ఉన్న ఆస్తులను సీజ్ చేసుకునేందుకు సీఐడీకి పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. గత ఏప్రిల్‌లో జయలక్ష్మి సొసైటీ బోర్డు తిప్పేయడంతో ప్రభుత్వం ఆరు నెలలు తిరగకుండానే దాని చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ విశాలాక్షి సహా ఏడుగురు డైరెక్టర్లను, రుణాలు ఎగవేసిన మరో ఆరుగురిని అరెస్టు చేయించింది. గత అక్టోబర్‌లో ప్రభుత్వ చొరవతో కొత్తగా ఏర్పాటుచేసిన పాలకవర్గం బ్యాంక్ కార్యకలాపాలను పునఃప్రారంభించింది. 29 బ్రాంచ్‌ల్లో ప్రస్తుతం కొన్ని బ్రాంచ్‌లను మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసుల స్వాధీనంలో ఉన్న రామచంద్రాపురం, ద్రాక్షారామం బ్రాంచ్‌ల తాళాలను శుక్రవారం కొత్త పాలకవర్గానికి అప్పగించారు. ఇప్పటికే నిందితులకు సంబంధించిన రూ.150 కోట్ల విలువైన 64 ఆస్తులను సీఐడీ అటాచ్ చేసింది. మరో రూ.20 కోట్ల విలువైన 40 ఆస్తులను అటాచ్ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. సీతారామాంజనేయులు సొసైటీ నుంచి రుణాలుగా తీసుకుని రూ.70 కోట్లు ఎగవేసినట్టు తాజాగా గుర్తించారు. దీంతో ఆయన పేరుతో కాకినాడ సెజ్‌లో పొన్నాడ గ్రామం సర్వే నంబర్ 222, 223లలో సుమారు 14 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు కొత్త పాలకవర్గానికి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తోంది. అలాగే 17 ప్రాంతాల్లో పలు ఆస్తులను కూడా గుర్తించారు. కాగా సీతారామాంజనేయులు బ్యాంక్ ఖాతాలో కాకినాడ సెజ్ యాజమాన్యం పరిహారంగా రూ.25 లక్షలు జమ చేసింది. ఈ మొత్తాన్ని సొసైటీకి స్వాధీనం చేయాలని కొత్త పాలకవర్గం.. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమను కోరింది. దీనిపై వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా డిప్యూటీ కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కాకినాడ రామారావుపేట ఎస్‌డీసీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్‌లను ఎస్‌డీసీకి అందజేశారు. ఈ భూములను వేలం వేయగా వచ్చిన సొమ్మును డిపాజిటర్లకు అందజేయనున్నారు.

రూ. 270 కోట్లతో ఏపీలో 11 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి

- 6న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ వెల్లడి



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ)/సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్‌ల పునరాభివృద్ధి పనులకు ఈ నెల 6న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్)లో భాగంగా రూ.24,470 కోట్లతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను ప్రధాని వర్చువల్ పద్ధతిన ప్రారంభించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ చెప్పారు. శుక్రవారం విజయవాడలోని డీఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడారు. తొలిదశలో విజయవాడ డివిజన్‌లో రూ.270 కోట్లతో 11 రైల్వే స్టేషన్‌ల్లో పునరాభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రెండో దశలో మరో 9 స్టేషన్‌ల పునరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించనున్నట్లు వివరించారు. తొలి దశ పనుల్లో అనకాపల్లి, భీమవరం టౌన్, ఏలూరు, కాకినాడ టౌన్, నర్సాపూర్, నిడదవోలు, ఒంగోలు, సింగరాయకొండ, తాడేపల్లి గూడెం, తెనాలి, తుని స్టేషన్‌ల్లో స్థానిక సంస్కృతికి తగిన విధంగా రెండు వైపులా ముఖద్వార భవనాల రూపకల్పన, సర్క్యులేటింగ్ ఏరియా పెంచడం, మాడ్యులర్ టాయిలెట్స్, ప్లాట్‌ఫాంల పైకప్పులు.. పొడవు పెంచడం, ఎఫ్‌వోబీలు, లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయడం, స్టేషన్‌ల్లో వెయిటింగ్ హాల్స్ మెరుగుపర్చడం, విశాలవంతమైన పార్కింగ్, అప్రోచ్ రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఏబీఎస్ఎస్‌లో భాగంగా తెలంగాణలో తొలి దశలో 21 స్టేషన్లను పునరాభివృద్ధి చేయనున్నారు.

చిన్నయసూరి భాషా సేవలు వెలకట్టలేనివి

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



శోభనాద్రిని సత్కరిస్తున్న విజయబాబు, వెల్లంపల్లి, మల్లాది

విజయవాడ కల్చరల్: తెలుగు భాషకు పరవస్తు చిన్నయసూరి చేసిన సేవలు వెలకట్టలేనివని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. ఏపీ అధికార భాషా సంఘం, పరవస్తు చిన్నయసూరి సాహితీ పీఠం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం చిన్నయసూరి కాంశ్య విగ్రహం ఆవిష్కరణ, చిన్నయ సూరి సాహిత్యం–తెలుగు భాషా సదస్సు నిర్వహించారు. చిన్నయ సూరి జీవిత విశేషాలతో కూడిన సావనీర్‌ను విజయబాబు ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు ప్రసంగించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, చిన్నయ సూరి కళాపీఠం వ్యవస్థాపకుడు శోభనాద్రి, గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి దుర్గమ్మ పవిత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 29వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. 29వ తేదీ సాయంత్రం శ్రావణ శుద్ధ త్రయోదశిన ఉదకశాంతి, 30వ తేదీ తెల్లవారు జామున మూడు గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, అనంతరం పవిత్రమాల ధారణ, ఉదయం తొమ్మిది గంటలకు సర్వదర్శనం ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జన, ఆశీర్వచన కార్యక్రమాలు జరుగుతాయి. 30వ తేదీ నుంచి 1వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలను నిలిపివేశారు.

యువకుడి అవయవదానం.. నలుగురికి పునర్జన్మ

- ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జగదీశ్
- బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవ దానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు
- ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయం అందించిన వైనం

అనంతపురం క్రైం/ఓర్వకల్లు/ కర్నూలు(హాస్పిటల్): తాను చనిపోయినా నలుగురికి పునర్జన్మ ప్రసాదించాడో యువకుడు. అవయవ దానానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో యువకుడి ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయం సేకరించి..మరో నలుగురికి అమర్చారు. కుటుంబ సభ్యులు, కిమ్స్–సవీర ఆస్పత్రి నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలోని హైస్కూల్ కొట్టాలకు చెందిన కామారుపల్లి జగదీశ్ (30) తాపీ మేస్త్రిగా పని చేసేవాడు. ఇతనికి భార్య రోజా, రెండేళ్ల కూతురు, రెండు నెలల పాప ఉన్నారు. ఈ నెల ఒకటిన గార్లదిన్నె నుంచి అనంతపురం వైపునకు ద్విచక్ర వాహనంలో వస్తూ నగర శివారులోని తడకలేరు వద్ద బైక్ ప్రమాదానికి గురయ్యాడు. కింద పడిన జగదీష్ తలకు తీవ్ర గాయమైంది. నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీటీ స్కాన్, తదితర పరీక్షలు చేయించిన కుటుంబ సభ్యులు తర్వాత స్థానిక కిమ్స్–సవీర ఆస్పత్రిలో చేర్పించారు. వెంటిలేటర్‌పై చికిత్స చేసినా జగదీశ్ ఆరోగ్యం మెరుగుపడలేదు. దీంతో వైద్యులు శుక్రవారం బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. అవయవ దానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు.

గ్రీన్‌చానల్ ద్వారా అవయవాల తరలింపు

జీవన్‌దాన్ ట్రస్టు, జిల్లా పోలీస్ శాఖ, కిమ్స్–సవీర వైద్యులు, సర్వజనాస్పత్రి ఫొరెన్సిక్ విభాగం సహకారంతో అవయవాలను గ్రీన్ చానల్ ద్వారా వివిధ ఆస్పత్రులకు విజయవంతంగా తరలించారు. శుక్రవారం ఉదయం జగదీశ్ ఊపిరితిత్తులను ప్రత్యేక వాహనంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు పంపగా.. అక్కడి నుంచి చార్టెడ్ ఫ్లైట్‌లో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఒక మూత్రపిండాన్ని కర్నూలు, మరో మూత్రపిండాన్ని కిమ్స్–సవీర ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ రోగులకు అమర్చారు. కాలేయాన్ని బెంగళూరుకు పంపి, అక్కడి నుంచి విమానంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు, ఇక్కడి నుంచి ఇంకో విమానంలో విశాఖపట్టణానికి తరలించారు.

నారా కుట్రలో నాగరాజు

- టీడీపీకి చెందిన నాగరాజునాయుడుకు రూ.1.67 లక్షల లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇదే విషయాన్ని చెప్పిన ఎమ్మెల్యే
- ఎటువంటి లబ్ధీ కలగలేదని అతనితో చెప్పించిన టీడీపీ నేతలు
- అతని కుటుంబం పొందిన లబ్ధి వివరాలు వెల్లడించిన అధికారులు
- ఏ పథకం ద్వారా ఎంత అతని భార్య ఖాతాలో జమ అయ్యిందీ వెల్లడి
- కంగుతిన్న నాగరాజు, టీడీపీ నేతలు

యాదమరి/పూతలపట్టు (చిత్తూరు జిల్లా): అతని పేరు నాగరాజు. టీడీపీ సానుభూతిపరుడు. వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అతని కుటుంబానికీ పెద్ద మొత్తంలో అందాయి. కానీ, నారా ఉచ్చులో చిక్కుకొని అభాసుపాలయ్యాడు. టీడీపీ అధినేత చంద్రబాబు పూతలపట్టు వస్తుండటంతో టీడీపీ నాయకులు నాగరాజుతో ఎటువంటి లబ్ధీ కలగలేదని చెప్పించారు. అయితే, అధికారులు అతని కుటుంబానికి కలిగిన లబ్ధిని మీడియాకు వెల్లడించడంతో నాగరాజు అభాసుపాలయ్యాడు.

పూతలపట్టు మండలం కొత్తూరులో గురువారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు నాగరాజునాయుడు కుటుంబం కూడా రూ.1,67,474 లబ్ధి పొందిందని వివరించిన ఎమ్మెల్యే, ఆ మేరకు బుక్‌లెట్ అందజేశారు. అయితే, స్థానిక టీడీపీ నేతలు నాగరాజునాయుడుకు వలవేశారు. గురువారం మండల కేంద్రంలోనే ప్రెస్‌మీట్ పెట్టారు. నాగరాజునాయుడును ముందు నిలబెట్టి అతని కుటుంబానికి ఒక్క రూపాయి లబ్ధి చేకూరలేదని, అయితే రూ.1.67 లక్షలు అందినట్టు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బుక్‌లెట్ ఇచ్చారని చెప్పించారు. ప్రభుత్వంపై బురదజల్లబోయే ప్రయత్నం చేశారు.

వాస్తవాలు బయటపెట్టిన అధికారులు

టీడీపీ నేతలు నాగరాజుతో చెప్పించిన విషయాలను తీవ్రంగా పరిగణించిన పూతలపట్టు ఎంపీడీవో గౌరి అధికారుల ద్వారా నాగరాజు నాయుడు కుటుంబానికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరాలు మీడియాకు అందజేశారు. వాటి ప్రకారం ఇప్పటివరకు నాగరాజు నాయుడు కుటుంబం రూ.1,67,474 లబ్ధి పొందింది. ఇందులో వైఎస్సార్ ఆసరా కింద రూ.27,621, అమ్మ ఒడి రూ.55,000, సున్నా వడ్డీ రూ.6,933, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.64,420, రైతు భరోసా రూ.13,500 వచ్చింది. ఈ నగదు మొత్తం పూతలపట్టు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో నాగరాజునాయుడు భార్య పావని ఖాతాలో జమ అయింది. ఈ వివరాలను అధికారులు వెల్లడించడంతో నాగరాజునాయుడు, అతనితో ప్రెస్‌మీట్ పెట్టించి అబద్ధాలు చెప్పించిన టీడీపీ నేతలు కంగుతిన్నారు.

ధర్మాసనం ఆదేశాలుండగా.. అడ్జ్యుడికేటింగ్ అథారిటీకి ఎలా?

- ఈ విషయంలో స్పష్టతనివ్వండి
- అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తు వ్యవహారంపై ఈడీకి హైకోర్టు ఆదేశం
- విచారణ 7కి వాయిదా



సాక్షి, అమరావతి: అగ్రిగోల్డ్ డిపాజిట్ల ఎగవేత వ్యవహారానికి సంబంధించిన వివాదాలన్నింటిపై ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని హైకోర్టు ధర్మాసనం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చిందని, అలాంటప్పుడు అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తు వ్యవహారాన్ని అడ్జ్యుడికేటింగ్ అథారిటీకి ఎలా పంపగలమని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో స్పష్టతనివ్వాలని ఈడీ తరఫు న్యాయవాది జోస్యుల భాస్కరరావును ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం నుంచి కొనుగోలు చేసిన తమ ఆస్తులను జప్తుచేస్తూ ఈడీ జారీచేసిన తాత్కాలిక జప్తు ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆల్ ఇండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే బ్యాంకులు నిర్వహించిన వేలంలో తాము కొన్న అగ్రిగోల్డ్ ఆస్తులను కూడా ఈడీ జప్తుచేయడాన్ని సవాలు చేస్తూ మరికొన్ని కంపెనీలు, వ్యక్తులు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అంతేగాక అసలు అగ్రిగోల్డ్ కుంభకోణానికి ముందే అగ్రిగోల్డ్ కంపెనీ నుంచి తాము కొన్న భూముల్లో నిర్మించుకున్న అపార్ట్‌మెంట్లను సైతం జప్తుచేస్తూ సీఐడీ జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయా ప్లాట్ల యజమానులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే రుణం ఇచ్చాం కాబట్టి.. ఆస్తులను వేలం వేసే హక్కు తమకుందంటూ బ్యాంకులు కొన్ని పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యాలన్నింటిపై న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కొద్ది రోజులుగా విచారిస్తున్నారు. జప్తుచేసిన అగ్రిగోల్డ్ ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వానికే మొదటి హక్కు ఉందని రాష్ట్ర ప్రభుత్వం గత వారం హైకోర్టులో వాదనలు వినిపించిన సంగతి తెలిసిందే. తాజాగా శుక్రవారం కూడా న్యాయమూర్తి ఈ వ్యాజ్యాలపై మరోసారి విచారించారు. ఈ సందర్భంగా ఈడీ న్యాయవాది భాస్కరరావు వాదనలు వినిపిస్తూ.. తాము సుమారు రూ.2 వేలకోట్ల విలువైన ఆస్తులను జప్తు చేస్తూ ప్రాథమిక జప్తు ఉత్తర్వులు జారీచేశామన్నారు. తమ జప్తు ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే చట్ట ప్రకారం అడ్జ్యుడికేటింగ్ అథారిటీని ఆశ్రయించాలే తప్ప హైకోర్టును కాదన్నారు. ఏపీ సీఐడీ జారీచేసిన జప్తు ఉత్తర్వుల కంటే ఈడీ జారీచేసిన జప్తు ఉత్తర్వులకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ..అగ్రిగోల్డ్ ఆస్తులతో పాటు అన్ని వివాదాలపై ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని హైకోర్టు ధర్మాసనం గతంలోనే ఉత్తర్వులు జారీచేసిందని గుర్తుచేశారు. అలాంటప్పుడు ధర్మాసనం ఆదేశాలకు విరుద్ధంగా అడ్జ్యుడికేటింగ్ అథారిటీకి వెళ్లాలని తామెలా ఆదేశాలివ్వగలమని ప్రశ్నించారు. ఈ విషయంలో స్పష్టతనివ్వాలని భాస్కరరావును ఆదేశించారు. విచారణను ఈ నెల 7వ తేదీకి వాయిదా వేశారు.

బీసీలకు న్యాయం చేయాలి

ప్రధానికి విజ్ఞప్తి చేశామన్న మారేష్

సాక్షి, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 56 శాతం జనాభాగా ఉన్న బీసీలకు న్యాయం చేయాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేసినట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.మారేష్ తెలిపారు. శుక్రవారం మారేష్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. బీసీల న్యాయపరమైన డిమాండ్ల విషయంలో ప్రధాని జోక్యం చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా బీసీలకు జనాభా ప్రకారం వాటా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఇటీవల ప్రధాని మోదీని కలిసి బీసీల సమస్యలు విన్నవించామన్నారు. డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రధాని తెలిపారని మారేష్ పేర్కొన్నారు.

చట్టసభల్లో హుందాతనంగా చర్చలు జరగాలి

మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



రేణిగుంట(తిరుపతి జిల్లా): చట్టసభల్లో హుందాతనంగా చర్చలు జరగాలని, అప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షణ జరుగుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చట్టసభలను ఏర్పరచిందే ప్రజా సమస్యలను చర్చించి పరిష్కారం చూపేందుకని, అయితే ప్రస్తుతం రాజ్యసభ, లోక్‌సభల్లోనూ, శాసన సభల్లోనూ సభ్యులు సభా మర్యాదలను, ప్రవర్తనా నియమావళిని తుంగలో తొక్కి పరస్పర విమర్శలకు దిగుతున్నారని చెప్పారు.

పేదల ఇళ్లకు సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఖాయం



1,041వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాజధానిలో పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటూ కులవాదులు తెచ్చుకున్న స్టేను తొలగించి సుప్రీంకోర్టు పేదలకు అనుకూల తీర్పు ఇవ్వడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,041వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదనే దుర్మార్గ ఆలోచన చేసిన బాబు అండ్ కో తప్పుడు కేసులు వేసి స్టే తీసుకు రావడం పేదల హక్కులను అడ్డుకోవడమేనని ధ్వజమెత్తారు. 75 సంవత్సరాల పాలనలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని పేదలకు చేరువ చేస్తుంటే కుల వాదులు అక్కసుతో వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదల హక్కులను అడ్డుకుంటున్న కులవాదులను నిందితులుగా చేర్చి ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని న్యాయస్థానాలకు విజ్ఞప్తి చేశారు. రాజధాని ప్రాంతంలో సుప్రీంకోర్టు తీర్పుతో 52వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందాయని, బాబు అండ్ కో కుట్రను ఛేదించి త్వరలో ఇళ్లను కూడా నిర్మించేందుకు సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇస్తుందని చెప్పారు. నాయకులు కారుమూరి పుష్పరాజు, పెరికె వరప్రసాద్, పులిదాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'ఇండియా'పై అభ్యంతరం.. ఢిల్లీ హైకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: 26 విపక్ష పార్టీలు తమ కొత్త కూటమికి 'ఇండియా' అని నామకరణం చేసుకోవడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గిరీశ్ భరద్వాజ్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. విపక్ష కూటమికి మన దేశం పేరును పెట్టుకోవడం ఏమిటని అభ్యంతరం తెలిపారు. ఇండియా పేరును వాడుకోవద్దని సూచించారు. ఈ మేరకు ఆదేశాలివ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. గిరీశ్ భరద్వాజ్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి, 'ఇండియా' కూటమిలోని 26 పార్టీలకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దేశం పేరున వాడుకోవద్దంటూ ఇప్పటికిప్పుడు ఆర్డర్ ఇవ్వలేమని స్పష్టంచేశారు. ప్రతివాదుల వివరణ విన్నాక స్పందిస్తామని పేర్కొంది.

ఆగస్టు 31, సెప్టెంబర్ 1న 'ఇండియా' సమావేశం !

న్యూఢిల్లీ: ప్రతిపక్షాల కూటమి ఇండియా తదుపరి సమావేశం ఆగస్టు 31, సెప్టెంబర్ 1న తేదీల్లో రెండు రోజుల పాటు ముంబైలో జరిగే అవకాశాలున్నాయి. బెంగళూరు సమావేశం మాదిరిగానే మొదటి రోజు వివిధ పార్టీల నాయకులు సమావేశమై తమ అభిప్రాయాలను పంచుకుంటారు. రెండో రోజు అంటే సెప్టెంబర్ 1న ప్రధాన సమావేశం ఉంటుందని విపక్ష కూటమికి చెందిన వర్గాలు వెల్లడించాయి. సమావేశం తేదీలను 26 పార్టీలకు చెందిన అధినేతలు అంగీకరించారని ఆ వర్గాలు తెలిపాయి. హోటల్ పావాయ్‌లో సమావేశం ఉండే అవకాశం ఉంది. సెప్టెంబర్ 1 సాయంత్రం మీడియా సమావేశం ఉంటుంది. ముంబైలో జరిగే ఈ మూడో సమావేశం ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన, శరద్ పవార్‌కు చెందిన ఎన్సీపీ ఆధ్వర్యంలో జరగనుంది.

ఒకేసారి 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనుల ప్రారంభం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 506 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పథకం పనులకు ప్రధాని మోదీ ఈ నెల 6న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న ఈ రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం కేంద్రం రూ.24,470 కోట్లను వెచ్చించనుంది. స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా రైల్వే స్టేషన్లకు మెరుగులు దిద్దడం, కొత్త, మెరుగైన సూచికల ఏర్పాటు, ఆధునిక మౌలిక వసతుల కల్పన వంటి వాటికి ఈ మొత్తాన్ని వెచ్చిస్తారని పీఎంవో తెలిపింది. మొత్తం 508 స్టేషన్లలో తెలంగాణలోని 21, ఆంధ్రప్రదేశ్‌లోని18 రైల్వేస్టేషన్లు కూడా ఉన్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మొత్తం 1,309 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తాజాగా ఒకేసారి 506 స్టేషన్ల అభివృద్ధి పనులను ప్రధాని ప్రారంభించనున్నారు.

జనవరిలో అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట

అయోధ్య: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించడానికి శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సన్నాహాలు చేస్తోంది. జనవరి 21, 22, 23 తేదీల్లో ఒక రోజు రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుందని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ శుక్రవారం వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారు. ఇక ఈ కార్యక్రమానికి సాధువులు, హిందూ పీఠాధిపతులు కూడా హాజరుకానున్నారు. 136 పీఠాలకు చెందిన 25 వేల మందికి పైగా సభ్యుల్ని విగ్రహ ప్రతిష్టాపనకు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. జనవరి నెల అంతా అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

మళ్లీ ఎంపీగా రాహుల్ గాంధీ!

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేతకు భారీ ఊరట

రెండేళ్ల జైలు శిక్షపై స్టే విధించిన సుప్రీంకోర్టు

- మధ్యంతర ఉత్తర్వులు జారీ
- ఇక రాహుల్ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ!
- వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు తొలగిన అడ్డంకులు

న్యూఢిల్లీ: లోక్‌సభ సభ్యత్వం కోల్పోవడానికి కారణమైన 2019 నాటి పరువు నష్టం కేసులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు రెండేళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ గుజరాత్‌లోని సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా లోక్‌సభ సభ్యత్వం మళ్లీ పొందడానికి రాహుల్‌కు అవకాశం లభించింది. ఆయన సభ్యత్వాన్ని లోక్‌సభ స్పీకర్ స్వయంగా పునరుద్ధరించవచ్చు లేదా సుప్రీంకోర్టు ఉత్తర్వు ప్రకారం సభ్యత్వం తిరిగి పొందడానికి రాహుల్ గాంధీ న్యాయ పోరాటం చేయొచ్చు. ఈ తీర్పుతో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేయడానికి రాహుల్ గాంధీకి ఇక అడ్డంకులు తొలగిపోయినట్లే.

ప్రజాజీవితంలో ఉన్నవారు ఆచితూచి మాట్లాడాలి

పరువు నష్టం కేసులో తనకు రెండేళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాహుల్ తొలుత గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. కింది కోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని తిరస్కరిస్తూ గుజరాత్ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో రాహుల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గావై, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన త్రిసభ్య సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. ''పరువు నష్టం కేసులో రాహుల్‌కు గరిష్ట శిక్ష విధించడానికి ట్రయల్ కోర్టు న్యాయమూర్తి ఎలాంటి కారణం చూపలేదు. అందుకే దోషిగా నిర్ధారించే తీర్పును నిలిపివేయాలి. అలాగే ఈ తరహా(పరువుకు నష్టం కలిగించే) వ్యాఖ్యలు మంచివి కావు. అందులో ఏమాత్రం సందేహం లేదు. ప్రజాజీవితంలో ఉన్నవారు బహిరంగ సభల్లో ఆచితూచి మాట్లాడాలని ప్రజలంతా ఆశిస్తారు'' అని స్పష్టం చేసింది. రాహుల్‌ను దోషిగా నిర్ధారించడం అనేది కేవలం ఆయనపైనే కాకుండా ఆయనను తమ ప్రతినిధిగా ఎన్నుకున్న ఓటర్ల హక్కుపై కూడా ప్రభావం చూపుతుందని వెల్లడించింది. ఐపీసీ సెక్షన్ 499(పరువు నష్టం) కింద రాహుల్‌కు గరిష్ట శిక్ష విధించడంపైనా ధర్మాసనం సంశయం వ్యక్తం చేసింది. శిక్షాకాలం ఒక్కరోజు తగ్గినా ఆయనపై ఎంపీగా అనర్హత వేటు పడేది కాదని ఉద్ఘాటించింది.

సమాజ వ్యతిరేక వ్యాఖ్యలు కావవి

రాహుల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మనూ సింఘ్వీ వాదనలు వినిపించారు. తన క్లయింట్ కరడుగట్టిన నేరస్తుడు కాదని చెప్పారు. ఆయనపై బీజేపీ కార్యకర్తలు ఎన్నో కేసులు పెట్టారని, అయినా ఏ ఒక్క కేసులోనూ దోషిగా తేలలేదని గుర్తుచేశారు. రాహుల్‌పై ఫిర్యాదు చేసిన పూర్ణేష్ మోదీ ఇంటిపేరు అసలు మోదీయే కాదని పేర్కొన్నారు. ఈ విషయం ఆయనే చెప్పారని గుర్తుచేశారు. రాహుల్ వ్యాఖ్యలు సమాజానికి వ్యతిరేకంగా చేసినవి కావని వివరించారు. ఇది అపహరణ, హత్య, అత్యాచారం వంటి నేరం కాదని, అయినప్పటికీ రెండేళ్ల జైలు శిక్ష విధించారని ఆక్షేపించారు. రాహుల్ నిర్దోషిగా విడుదల కావడానికి, పార్లమెంట్‌కు హాజరు కావడానికి, వచ్చేసారి ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇదే చివరి అవకాశమని అన్నారు. ఫిర్యాదుదారు పూర్ణేష్ మోదీ తరఫున సీనియర్ అడ్వొకేట్ మహేష్ జెఠ్మలానీ వాదించారు. రాహుల్ తప్పు చేశారనడానికి చాలా ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం చివరకు రాహుల్‌కు విధించిన జైలు శిక్షపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



రాహుల్ గాంధీకి స్వీటు తినిపిస్తున్న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

ఏమిటీ కేసు?

2019 ఏప్రిల్ 13న కర్ణాటకలోని కోలార్ పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. ''దొంగలందరి ఇంటి పేరు మోదీ అని ఎందుకుంటుంది?'' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను తప్పుపడుతూ గుజరాత్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేష్ మోదీ సూరత్ కోర్టును ఆశ్రయించారు. రాహుల్‌పై క్రిమినల్, పరువు నష్టం దావా వేశారు. విచారణ జరిపిన సూరత్ కోర్టు 2023 మార్చి 23న రాహుల్ గాంధీని దోషిగా తేల్చింది. రెండేళ్లపాటు జైలు శిక్ష విధించింది. మరుసటి రోజే రాహుల్‌పై లోక్‌సభ స్పీకర్ అనర్హత వేటు వేశారు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యింది. మాజీ ఎంపీగా మారారు. అంతే కాకుండా ఢిల్లీలోని తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసి, బయటకు వెళ్లిపోవాల్సి వచ్చింది.

ఇప్పుడేం జరుగుతుంది?

పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టు ఊరట కలిగించడంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని ఎప్పటిలోగా పునరుద్ధరిస్తారన్న దానిపై చర్చ ప్రారంభమైంది. అధికారిక ప్రక్రియ ప్రకారం.. లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలంటే రాహుల్ తొలుత లోక్‌సభ సెక్రటేరియట్‌కు విజ్ఞాపన పత్రం సమర్పించాల్సి ఉంటుంది. రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని తెలియజేయాలి. సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని అభ్యర్థించాలి. సుప్రీంకోర్టు ఉత్తర్వు కాపీని కూడా సమర్పించాలి. అన్నీ సక్రమంగా ఉన్నట్లు భావిస్తే సభ్యత్వాన్ని పునరుద్ధరించినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ ఒక అధికారిక ప్రకటన జారీ చేస్తుంది. ఇటీవల నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) ఎంపీ మొహమ్మద్ ఫైజల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడానికి రెండు నెలలు పట్టడం గమనార్హం.

కోలార్ నుంచి కోర్టుల వరకు..

నాలుగేళ్ల క్రితం కర్ణాటక ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారమే సృష్టించి చివరికి ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోవలసి వచ్చింది. మోదీ ఇంటి పేరుపై రాహుల్ చేసిన వ్యాఖ్యల దగ్గర్నుంచి అత్యున్నత న్యాయస్థానం తీర్పు వరకు పరిణామ క్రమాన్ని చూద్దాం.

ఏప్రిల్ 12, 2019: కర్ణాటకలోని కోలార్‌లో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ దొంగలందరికీ ఇంటి పేరు మోదీయే ఎందుకు ఉంటుంది ? నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ అని వ్యాఖ్యానించారు.

ఏప్రిల్ 15, 2019: గుజరాత్ సూరత్ బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు.

జూలై 7, 2019: సూరత్ మెట్రోపాలిటన్ కోర్టు ఎదుట రాహుల్ గాంధీ మొదటిసారిగా హాజరయ్యారు.

మార్చి 23, 2023: పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీని దోషిగా తేల్చిన సూరత్ కోర్టు ఆయనకి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. రాహుల్ అప్పీలు చేసుకోవడానికి వీలుగా నెల రోజుల పాటు తీర్పుని సస్పెండ్ చేసింది.

మార్చి 24, 2023: ఒక క్రిమినల్ కేసులో రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో పార్లమెంటు సభ్యుడిగా ఆయనపై అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం ఒక నోటీసు జారీ చేసింది.

ఏప్రిల్ 3 2023: మెట్రోపాలిటన్ కోర్టు తీర్పుని సవాల్ చేస్తూ రాహుల్ సూరత్ సెషన్స్ కోర్టుని ఆశ్రయించారు. తీర్పుపై స్టే విధించాలని కోరారు

ఏప్రిల్ 20, 2023: తీర్పుపై స్టే ఇవ్వడానికి నిరాకరించిన సెషన్స్ కోర్టు రాహుల్ పిటిషన్‌ను కొట్టేసింది.

ఏప్రిల్ 25, 2023: రాహుల్ గాంధీ గుజరాత్ హైకోర్టుని ఆశ్రయించారు. తన శిక్షను నిలుపదల చేయాలని పిటిషన్ వేశారు.

జూలై 7, 2023: గుజరాత్ హైకోర్టులో రాహుల్‌కి ఎదురు దెబ్బ తగిలింది. శిక్షపై స్టే విధించడానికి నిరాకరించిన కోర్టు రాహుల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

జూలై 15, 2023: హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీం కోర్టుకెక్కారు.

జూలై 21, 2023: ఈ కేసులో గుజరాత్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీకి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది.

ఆగస్టు 4, 2023: రాహుల్‌కి విధించిన రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ కేసులో కింద కోర్టు గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్షని విధించడానికి కారణాలు కనిపించలేదని వ్యాఖ్యానించింది. సుప్రీం తీర్పుతో రాహుల్ పార్లమెంటు సభ్యత్వం తిరిగి పొందడానికి ఆస్కారం ఏర్పడింది.



ఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల ఆనందోత్సాహాలు

సత్యమే జయిస్తుంది

- సుప్రీం కోర్టు తీర్పుపై రాహుల్ గాంధీ
- విపక్ష కూటమి ఇండియాలో హర్షాతిరేకాలు
- సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

న్యూఢిల్లీ: మోదీ ఇంటిపేరుపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో సుప్రీం తీర్పుతో విపక్ష కూటమి ఇండియాలో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. రాహుల్ గాంధీ ఎంపీగా కొనసాగడానికి అవకాశం ఏర్పడడంతో కేరళలో ఆయన నియోజకవర్గం వయనాడ్‌లో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. సుప్రీం తీర్పును స్వాగతిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు మిఠాయిలు పంచిపెట్టారు. మా నాయకుడు తిరిగి వస్తున్నారంటూ ఆనందం వ్యక్తం చేశారు. విద్వేషంపై ప్రేమ సాధించిన విజయమని నాయకులు వ్యాఖ్యానించారు. సుప్రీం తీర్పు వెలువడిన కొద్దిసేపటికి రాహుల్ గాంధీ ఏఐసీసీ కార్యాలయానికి వచ్చారు. అప్పటికే అక్కడ పండగ వాతావరణం నెలకొంది. సత్యమేవ జయతే అంటూ పార్టీ శ్రేణులు రాహుల్‌కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాహుల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ''నిజమే ఎప్పుడూ గెలుస్తుంది. ఇవాళ కాకపోతే రేపు, లేదంటే ఆ మర్నాడు. నాకు మద్దతుగా ఉన్న ప్రజలందరికీ కృతజ్ఞతలు. నేను ఎలా ముందుకెళ్లాలో నాకు తెలుసు. నా కర్తవ్యం ఏమిటో నాకు స్పష్టంగా తెలుసు. నాకు సాయం చేసిన, ప్రేమ పంచిన వారందరికీ నా ధన్యవాదాలు'' అని రాహుల్ చెప్పారు. అంతకు ముందు ఒక ట్వీట్‌లో ఏది ఏమైనా తన కర్తవ్యాన్ని తాను వీడనని దేశ సిద్ధాంతాలు, ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడమే తన బాధ్యతని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఈ విజయం రాహుల్ గాంధీది మాత్రమే కాదని, ఈ దేశ ప్రజలది, ప్రజాస్వామ్యానిదని అన్నారు. సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించిన 24 గంటలు తిరగక ముందే రాహుల్‌పై అనర్హత వేటు వేశారని, ఇప్పుడు దానిని ఎత్తేయడానికి ఎంత సమయం తీసుకుంటారో చూడాలని వ్యాఖ్యానించారు.

ఆ మూడు ఎక్కువ కాలం దాగవు

రాహుల్ గాంధీ తిరిగి లోక్‌సభలో అడుగుపెట్టనుండడంతో సోదరి ప్రియాంక ఆనందానికి పట్టపగ్గాల్లేవు. ఆమె తన సంతోషాన్ని ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. గౌతమ బుద్ధుని కొటేషన్‌ను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సూర్యుడు, చంద్రుడు, నిజం.. ఈ మూడింటిని ఎక్కువ కాలం దాచలేరు అంటూ గౌతమ బుద్ధుడు చెప్పిన మాటల్ని ట్వీట్‌లో రాసిన ప్రియాంక సత్యమేవ జయతే అంటూ ముగించారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో రాజకీయ పార్టీలన్నీ సుప్రీం తీర్పుని స్వాగతించాయి. పార్లమెంటులోకి తిరిగి రాహుల్ అడుగు పెట్టే రోజు కోసం చూస్తున్నామని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు.

న్యాయపోరాటం కొనసాగిస్తా : పూర్ణేశ్ మోదీ

రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు దాఖలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సుప్రీం కోర్టు తీర్పుని స్వాగతించారు. సుప్రీం తీర్పుని తాము గౌరవిస్తామని, అయితే సెషన్స్ కోర్టులో న్యాయపోరాటం సాగిస్తామని ఆయన చెప్పారు.



సోదరుడు రాహుల్‌గాంధీ జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించడం హర్షణీయం. ఈ తీర్పుతో మన న్యాయ వ్యవస్థ మీద , ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ మీద మరింతగా విశ్వాసం పెరిగింది.

- ఎం.కె.స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి



సుప్రీం కోర్టు తీర్పుని స్వాగతిస్తున్నాను. ప్రజా స్వామ్యం, న్యాయ వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని ఈ తీర్పు బలపరుస్తోంది. రాహుల్‌కి, వయనాడ్ ప్రజలకి నా శుభాకాంక్షలు.

- ఎ.కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం



రాహుల్ గాంధీ మళ్లీ సభలోకి అడుగు పెట్టనుండడం ఎంతో శుభవార్త. దీంతో ఇండియా కూటమి మరింత బలోపేతమవుతుంది. మాతృభూమి కోసం విపక్షాల పోరాటం మరింత ఐక్యంగా సాగి విజయం సాధించి తీరుతాం.

- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించండి

స్పీకర్ ఓం బిర్లాకు అధిర్ రంజన్ చౌదరి వినతి

న్యూఢిల్లీ: సత్యమేవ జయతే అని చెప్పడానికి రాహుల్ గాంధీ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులే నిదర్శనమని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు చౌదరి విజ్ఞప్తి చేశారు. ఓం బిర్లాను ఆయన చాంబర్‌లో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అవిశ్వాస తీర్మానంపై జరిగే చర్చలో రాహుల్ మాట్లాడాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించకుండా బీజేపీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరామన్నారు. ఈ వర్షాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు రాహుల్‌ను అనుమతించాలని శుక్రవారం లోక్‌సభలో స్పీకర్ స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్‌ను అధిర్ రంజన్ కోరారు. ఈ విషయంలో స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకుంటారని రాజేంద్ర అగర్వాల్ బదులిచ్చారు.

102 ఎఫ్ఐఆర్‌లు...200 మంది అరెస్ట్

మత ఘర్షణలపై హరియాణా హోం మంత్రి వెల్లడి

చండీగఢ్: హరియాణాలో ఇటీవలి మత ఘర్షణలకు సంబంధించి మొత్తం 202 మందిని అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర హోం మంత్రి అనిల్ విజ్ శుక్రవారం తెలిపారు. ముందు జాగ్రత్తగా మరో 80 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. ఘర్షణలపై 102 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇందులో సగం వరకు నూహ్ జిల్లాలోని వన్నారు. మిగతావి గురుగ్రామ్, ఫరీదాబాద్, పల్వాల్ జిల్లాల్లో నమోదయ్యాయన్నారు. ఘర్షణలకు కారకులైన వారిని వదిలే ప్రసక్తే లేదని మంత్రి చెప్పారు. పోలీస్‌స్టేషన్లపై జరిగిన దాడులకు కారకులను గుర్తించే పని మొదలయ్యిందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం ప్రార్థనలను ఇళ్ల వద్దే చేసుకోవాలని యంత్రాంగం ప్రజలకు సూచించిందన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా కమిటీని వేశామని చెప్పారు.

250 గుడిసెలు కూల్చివేత

టౌరు పట్టణంలోని ప్రభుత్వ జాగాలో నిర్మించుకున్న 250కి పైగా గుడిసెలను నూహ్ జిల్లా యంత్రాంగం శుక్రవారం కూల్చివేసింది. హరియాణా షహరి వికాస్ ప్రాధికారణ్(హెచ్ఎస్‌వీపీ)కి చెందిన ఎకరం భూమిలో బంగ్లాదేశీ వలసదారులు అక్రమంగా వీటిని నిర్మించుకున్నారని నూహ్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ పన్వర్ చెప్పారు. వీరంతా గతంలో అస్సాంలో నివసించారని చెప్పారు. ఇటీవలి మత ఘర్షణలకు తాజాగా గుడిసెల కూల్చివేతకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆక్రమణల తొలగింపులో భాగంగానే ఈ గుడిసెలను కూల్చివేసినట్లు వివరించారు.

నూహ్ ఎస్పీపై బదిలీ వేటు

నూహ్ జిల్లా పోలీస్ ఎస్పీ, డిప్యూటీ కమిషనర్‌లపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఎస్పీ వరుణ్ సింగ్లాను భివానీకి మార్చింది. భివానీ ఎస్పీ, అదనపు డీజీపీ(శాంతి భద్రతలు) ఓఎస్డీగా కూడా ఉన్న నరేంద్ర బిజార్నియాకు నూహ్ ఎస్పీగా బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా, డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ పన్వర్‌ను మత్స్య శాఖ అదనపు కార్యదర్శిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో అటవీశాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్న ఖడ్గటాను నియమించింది. ఈ మేరకు ఈ నెల 3న అదనపు ప్రధాన కార్యదర్శి(హోం) టీవీఎస్ఎస్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. విశ్వ హిందూ పరిషత్ ర్యాలీని అడ్డగించేందుకు కొందరు ప్రయత్నించడం మత కలహాలకు దారి తీయడం తెలిసిందే. వివిధ హింసాత్మక ఘటనల్లో ఇద్దరు హోంగార్డులు, ఒక మత బోధకుడు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

పార్లమెంట్‌లో వాయిదాల పర్వం

- మణిపూర్ అంశంపై కొనసాగిన విపక్షాల ఆందోళన
- రాజస్తాన్‌లో మహిళలపట్ల నేరాలపై రాజ్యసభలో బీజేపీ ఆగ్రహం
- లోక్‌సభ, రాజ్యసభ సోమవారానికి వాయిదా



న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో యథావిధిగా రగడ కొనసాగింది. మణిపూర్ హింసాకాండపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ ప్రారంభించాలని, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభలో శుక్రవారం ఆందోళనకు దిగారు. నినాదాలతో హోరెత్తించారు. సభా కార్యకలాపాలకు పదే పదే అడ్డు తగిలారు. రాజస్తాన్‌లో మహిళలపై జరుగుతున్న నేరాలపై చర్చ జరపాలంటూ రాజ్యసభలో అధికార బీజేపీ సభ్యులు నినదించారు. గందరగోళం కారణంగా లోక్‌సభ, రాజ్యసభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. చివరకు రెండు సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి.

లోక్‌సభలో పట్టువీడని విపక్షాలు

లోక్‌సభ శుక్రవారం ఉదయం ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఇంతలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ జోక్యం చేసుకున్నారు. ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టాల్సి ఉందని, సభ్యులంతా సహకరించాలని కోరారు. సభా కార్యకలాపాల్లో పాల్గొనాలని కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు పట్టించుకోలేదు. నినాదాలు కొనసాగించారు. ప్రతిపక్షాల ఆందోళన మధ్య దాదాపు 20 నిమిషాలపాటు సభ జరిగింది. అనంతరం సభను స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా వేశారు. ఆ తర్వాత సభ ప్రారంభమయ్యాక కూడా విపక్షాలు శాంతించలేదు. దాంతో చేసేదిలేక సభను స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు. సైనిక దళాలను మరింత బలోపేతం చేయడానికి ఉద్దేశించిన 'ఇంటర్-సర్వీసెస్ ఆర్గనైజేషన్స్(కమాండ్, కంట్రోల్, డిసిప్లిన్) బిల్లు'ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. స్వల్ప చర్చ అనంతరం సభలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అలాగే 'ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(అమెండ్‌మెంట్) బిల్లు-2023' కూడా ఆమోదించారు.

రాజ్యసభలో అధికార బీజేపీ ఆందోళన

రాజస్తాన్‌లోని భిల్వారా జిల్లాలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య వ్యవహారాన్ని రాజ్యసభలో అధికార బీజేపీ సభ్యులు లేవనెత్తారు. కాంగ్రెస్ పార్టీ పాలిత రాజస్తాన్‌లో శాంతి భద్రతలు నానాటికీ దిగజారుతున్నాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. బీజేపీ సభ్యులు ఆయనకు మద్దతు పలికారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు 'మణిపూర్, మణిపూర్' అంటూ నినాదాలు చేశారు. దీంతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా ప్రతిష్టంభనకు తెరపడలేదు. దీంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ధన్‌ఖడ్ ప్రకటించారు.

మణిపూర్‌లో ఆయుధాల లూటీ

ఇంఫాల్: మణిపూర్‌లో తెగల పోరు, ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మరోసారి పోలీసు ఆయుధాగారంపై దుండగులు దాడి జరిపి ఆయుధాలను లూటీ చేశారు. ఎకే 47, ఘాతక్ వంటి అత్యాధునిక రైఫిల్స్, వివిధ రకాల తుపాకుల్లోని 19 వేలకు పైగా బుల్లెట్లు అపహరించారు. బిష్ణుపూర్ జిల్లా నారన్‌సైనా ప్రాంతంలో రెండవ ఇండియా రిజర్వ్ బెటాలియన్‌లో ఈ లూటీ జరిగింది. ''బెటాలియన్ కేంద్రంపై దాడులకు దిగిన అల్లరి మూకలు అత్యాధునిక ఆయుధాలను లూటీ చేశారు. ఏకే, ఘాతక్ రైఫిళ్లు, 195 సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్, అయిదు ఎంపీ-5 గన్స్, 16 9ఎంఎం పిస్టల్స్, 25 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, 21 కార్బైన్స్, 124 హ్యాండ్ గ్రెనేడ్స్‌ను దొంగిలించారు'' అని అధికారులు తెలిపారు. మరోవైపు మే 3వ తేదీన జరిగిన ఘర్షణల్లో మరణించిన వారి సామూహిక ఖననానికి ఆదివాసీలు చేస్తున్న ప్రయత్నాలు ఉద్రిక్తతలకి దారి తీస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్న మరికొందరు ప్రదర్శనగా ఆ ప్రాంతానికి వెళ్లడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో 25 మందికిపైగా గాయపడ్డారు. దీంతో, అంతిమ సంస్కార కార్యక్రమాలను కేంద్రం వినతి మేరకు వారం పాటు వాయిదా వేసుకున్నారు.

'జ్ఞానవాపి' సర్వేపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: వారణాసిలోని కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ(ఏఎస్ఐ) శాస్త్రీయ సర్వేకు అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన అనుమతిపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ సర్వే ప్రార్థనాస్థలాల చట్టాన్ని అతిక్రమించడం, చరిత్రలోకి వెళ్లి పాత గాయాలను మళ్లీ రేపడమేనన్న మసీదు కమిటీ వాదనతో అత్యున్నత న్యాయస్థానం విభేదించింది. సర్వే చేపట్టే సమయంలో ఎటువంటి తవ్వకాలు జరపరాదని, సదరు కట్టడానికి ఎలాంటి నష్టం వాటిల్లరాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఏఎస్ఐ అధికారులను ఆదేశించింది. ఏఎస్ఐ నివేదిక వివాదాస్పద అంశాల నిర్ధారణకు సంబంధించింది కాదని ధర్మాసనం మసీదు కమిటీకి స్పష్టం చేసింది. ఇలా ఉండగా, అలహాబాద్ హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో ఏఎస్ఐ అధికారులు శుక్రవారం జ్ఞానవాపి మసీదులో సర్వే చేపట్టారు. ఆ సర్వేను అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ బహిష్కరించింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల తారుమారు కేసు

కోర్టుకు హాజరైన ట్రంప్..



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించారని అభియోగాలను ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. ఈ విషయంలో తాను నిర్దోషినని తనకే పాపం తెలీదని చెప్పారు. ఇండియన్ అమెరికన్ మహిళా న్యాయమూర్తి మోక్సిలా ఎ ఉపాధ్యాయ ఎదుట ట్రంప్ హాజరయ్యారు. రాజకీయ ప్రత్యర్థులే ఈ కేసులో ఇరికించారని ట్రంప్ పేర్కొన్నారు. 2020లో జరిగిన ఎన్నికల్లో బైడెన్ విజయం సాధించినప్పటికీ దానిని అధికారికంగా వెల్లడించకుండా 2021 జనవరిలో ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ భవనంపై దాడికి పాల్పడ్డారంటూ అభియోగాలు నమోదయ్యాయి. ట్రంప్ అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కోర్టు హాలు వెనుక తలుపులోంచి లోపలికి ప్రవేశించారు.

ఎవరీ ఉపాధ్యాయ ?: న్యాయమూర్తి మోక్సిలా ఎ ఉపాధ్యాయ గుజరాత్‌లో జన్మించారు. ఆమె చిన్నతనంలో తల్లిదండ్రులు అమెరికా వెళ్లిపోవడంతో కన్సస్‌లో పెరిగారు.

4 కిమీ భారీ వంతెన

సాక్షి, చెన్నై: చెన్నైలో భారీ వంతెన నిర్మించబోతున్నారు. అన్నాసాలై నుంచి టీ నగర్ మీదుగా కోడంబాక్కంను కలిపే విధంగా ఈ వంతెన రూపుదిద్దుకోనుంది. చెన్నైలో టీ.నగర్ పరిసరాలు ట్రాఫిక్ పద్మవ్యూహంలో నిత్యం చిక్కుకుంటాయి. ఇక్కడ 2008లో ఓ వంతెన నిర్మించారు. అలాగే, కోడంబాక్కం మహాలింగపురం సమీపంలో మరో వంతెన నిర్మించారు. అయినా ట్రాఫిక్ ఏమాత్రం తగ్గడం లేదు. ఈ పరిస్థితుల్లో గతంలో నిర్మించిన రెండు వంతెనలకు మధ్యలో ఉన్న ప్రాంతాలను కలిపే విధంగా భారీ వంతెనకు అధికారులు సిద్ధమయ్యారు. అన్నాసాలై నుంచి టీ నగర్ మీదుగా కోడంబాక్కం వరకు 4 కిమీ ఈ భారీ వంతెన నిర్మాణం జరగబోతోంది. ఇందుకోసం రూ.130 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం తేనాంపేట–సైదాపేట మధ్య 3 కిమీ భారీ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టిన నేపథ్యంలో మరో వంతెనకు అధికారులు సిద్ధం కావడం విశేషం.

న్యూస్‌రీల్

హుక్కా బార్లపై నిషేధం

- ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలు



సాక్షి, చెన్నై: రాష్ట్ర వ్యాప్తంగా హుక్కాబార్లపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధం ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలు శిక్ష తప్పదన్న హెచ్చరికలు జారీ అయ్యాయి. రాష్ట్రంలో పొగాకు పదార్థాల నిషేధం అమల్లో ఉన్న విషయం తెలిసిందే. అయితే, అనేక హోటళ్లు, లాడ్జీలు, రిసార్టులు, ప్రైవేట్ బార్లు వినియోగదారులను ఆకర్షించే విధంగా ప్రత్యేకంగా పొగ తాగేందుకు గదులను లేదా, ప్రత్యేక ప్రాంతాలను కేటాయిస్తున్నాయి. అనేక చోట్ల ఇదే అదనుగా హుక్కా సెంటర్లు వెలిశాయి. దీంతో హుక్కా మత్తులో జోగే వారు అధికం అయ్యారు. ఈ కారణంగా అనారోగ్యం బారిన పడే వాళ్లు పెరిగారు. ఈ సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పొగాకు వస్తువుల నిషేధంలో హుక్కా కూడా ఉందని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడైనా హోటళ్లు, రిసార్టుల ప్రాంతాలలో హుక్కా సెంటర్లు, బార్లు ఏర్పాటు చేసిన పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు అధికారులతో కూడిన బృందాలు తనిఖీలకు అధికారాలు అప్పగించామని, వారికి సహకరించాలని ఆయా హోటళ్లు, రిసార్టులను ఆదేశించారు. నిషేధం ఉల్లంగించిన హుక్కాబార్ల, సెంటర్లు ఎవరైనా నడిపిన పక్షంలో ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలుశిక్ష తప్పదన్న హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

డిజిటల్ శిక్షణకు చెన్నై విద్యార్థులు

సాక్షి, చెన్నై: విజువల్ కమ్యూనికేషన్, డిజిటల్ శిక్షణ నిమిత్తం చెన్నై సీమాట్స్ ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం వీరంతా హైదరాబాద్‌కు వెళ్లారు. విజువల్ కమ్యూనికేషన్స్ విద్యార్థులకు గ్రీన్ మ్యాట్ షూటింగ్, ఎడిటింగ్‌తో పాటు ఫిల్మ్ మేకింగ్‌లోని వివిధ అంశాలను ఈ వర్క్‌షాప్ ద్వారా తెలియజేయనున్నారు. బాహుబలి, మహాభారతం, విమానాశ్రయం, రైల్వేస్టేషన్లు వంటి సెట్‌లను స్వయంగా వీక్షించడం, తెలియజేయడానికి ఈ విద్యార్థులను తీసుకెళ్లారు. అలాగే ఓటీటీ గురించి, 3డీ మోడల్, వీఎఫెక్స్ మేళవింపుతో సన్నివేశాల రూపకల్పన గురించి తెలియజేయనున్నారు.

పోలీస్‌కు సత్కారం

సాక్షి, చెన్నై: ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్న కానిస్టేబుల్ శివరాజ్‌ను పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సత్కరించారు. చెన్నై ఆవడి పోలీసు బెటాలియన్‌లో గ్రేడ్-2 కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ధర్మపురికి చెందిన శివరాజ్ పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి ఎంబీబీఎస్ సీటును దక్కించుకున్న విషయం తెలిసిందే. నీట్ మార్కుల ఆధారంగా ప్రభుత్వం పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు అమలు చేస్తున్న 7.5 శాతం రిజర్వేషన్ రూపంలో ఈసారి వైద్య సీటును శివరాజ్ దక్కించుకున్నాడు. అతడి ప్రతిభ, ప్రయత్నాన్ని గుర్తించి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సత్కరించేందుకు నిర్ణయించారు. చెన్నైలో పోలీసు యూనిఫాంలో వచ్చిన శివరాజ్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఈసందర్భంగా శివరాజ్‌ను సత్కరించిన తమిళిసై అతడికి వైద్యులకు ఉపయోగపడే కిట్టును అందజేశారు.

ఎన్ఎల్‌సీ కార్మికుల నిరసన

కొరుక్కుపేట: కడలూర్ జిల్లా నైవేలి ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు 26వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు. ఆరు అంశాల డిమాండ్ల కోసం నైవేలి సెంట్రల్ బస్టాండ్ సమీపంలోని అన్నాథీల్ వద్ద శుక్రవారం 10వ రోజు కూడా నిరసన కార్యక్రమం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఎన్ఎల్‌సీ ముఖద్వారాన్ని అడ్డుకున్న కాంట్రాక్టు కార్మికులు మొదటి షిఫ్ట్‌లో విధులకు వెళ్లిన కార్మికులను తమ సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు.

అసిస్టెంట్ కమిషనర్‌కు జరిమానా

కొరుక్కుపేట: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనంలో వచ్చిన తిరునల్వేలి టౌన్ అసిస్టెంట్ కమిషనర్‌కు రూ.500 జరిమానా విధించారు. తిరునల్వేలి టౌన్ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బయ్య. ఇతను నెల్లై టౌన్ నుంచి నెల్లై జంక్షన్ ప్రాంతానికి నెల్లై కోయిల్ గేట్ నుంచి టౌన్ ఆర్చర్ వరకు వన్‌వేలో ప్రయాణించారు. ద్రిండా మెట్రోపాలిటన్ పోలీస్ కమిషనర్ రాజేంద్రన్ దీనిని గమనించారు. ఆ ప్రాంతంలో నిలబడి ఉన్న ట్రాఫిక్ సీఐకి ఫోన్ చేసి వెంటనే పోలీసు వాహనానికి జరిమానా విధించాలని చెప్పారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా వన్ వేలో వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ సుబ్బయ్యకు రూ.500 జరిమానా విధించారు. ఈ ఘటన పట్టణ పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. రాజేంద్రన్ నెల్లై పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి వివిధ రకాల హైస్పీడ్ ఆపరేషన్లు చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

కావేరి డెల్టాను ఆదుకోండి

- కురువై రక్షణకు నీళ్లు ఇప్పించండి
- కర్ణాటకపై ఒత్తిడికి సీఎం స్టాలిన్ విజ్ఞప్తి
- ప్రధాని నరేంద్రమోదీకి లేఖ
- 30 టీఎంసీలకు పట్టు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: కర్ణాటకపై ఒత్తిడి తెచ్చి కావేరి జలాలను విడుదల చేయించుకునే ప్రయత్నాలపై రాష్ట్ర ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. కావేరి డెల్టా రైతులను ఆదుకునేందుకు, కురువై సాగును రక్షించుకునేందుకు నీళ్ల ఇప్పించాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం లేఖ రాశారు.

కావేరి ఒప్పందం మేరకు ప్రతిఏటా తమిళనాడుకు కర్ణాటకు 177 టీఎంసీల మేరకు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఆ మేరకు జూన్‌లో 9.8 టీఎంసీ, జూలైలో 31.25 టీఎంసీల నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. ఆగస్టు నుంచి నిరివ్రామంగా నీటిని పంపిణీ చేయాలి. అయితే, ఇంతవరకు కర్ణాటక నుంచి నీటి జాడ కానరావడం లేదు. గతవారం కర్ణాటకలో వర్షాలు ఊరించినట్టు ఊరించి కనుమరుగయ్యాయి. దీంతో డెల్టా రైతుల వరప్రదాయిని మేట్టూరు జలాశయంలో నీళ్లు అడుగంటుతోంది. ఈ జలాశయం నుంచి ప్రస్తుతం కురువై సాగు నిమిత్తం డెల్టా జిల్లాలకు కావేరి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో గత 55 రోజుల్లో రిజర్వాయర్ నీటి మట్టం 43 అడుగులు తగ్గింది. ప్రస్తుతం జలాశయంలో 60 అడుగులే నీళ్లు ఉన్నాయి. ఈ నీటి ఆధారంగా కావేరి డెల్టా జిల్లాల్లోని లక్షలాది ఎకరాల్లో కురువై సాగు ప్రశ్నార్థకంగా మారింది. మేట్టూరు నుంచి నిర్ణీత సమయంలో నీటిని విడుదలచేయడంతో అన్నదాతలు ఆనందంతో పొలం బాటపట్టారు. నాట్లు వేశారు. పంట ఏపుగా ఎదిగే సమయంలో నీళ్ల కొరత రైతుల్ని కంటతడి పెట్టిస్తున్నది. మేట్టూరు నుంచి నీటి విడుదల శాతం పెంచాలని ఓ వైపు డిమాండ్ చేస్తున్నా, మరోవైపు రిజర్వాయర్‌లో ఉన్న నీళ్లు పూర్తిగా సాగుకు చేయూతనిచ్చేనా అనే ప్రశ్న తప్పడం లేదు. ప్రస్తుతం జలాశయంలోకి నీళ్లు వచ్చి చేరినప్పుడే, రైతులకు పూర్తిస్థాయిలో నీళ్లు అందించే అవకాశం ఉంది. లేనిపక్షంలో రైతుల కంట కన్నీళ్లు తప్పదు. ఇప్పటికే కావేరి జలాల కోసం డెల్టా జిల్లాల్లో ఆందోళనలు మొదలయ్యాయి. దీంతో కేంద్రంపై ఒత్తిడి పెంచి కావేరి జలాలను విడుదల చేయించుకునే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విస్తృతం చేసింది. ఈ పరిస్థితుల్లో శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీకి సీఎం లేఖ రాశారు.

అధికారులతో సీఎం సమీక్ష..

సచివాలయంలో ఐకానిక్ ప్రాజెక్టులు, పథకాల తీరుతెన్నులు, పురోగతిపై అధికారులతో సీఎం సమీక్షించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో సీఎంతో పాటు మంత్రులు నెహ్రూ, ఐ పెరియస్వామి, ఉదయ నిధి స్టాలిన్, ముత్తుస్వామి, కేఆర్ పెరియకరుప్పన్, కయల్ వెలి సెల్వరాజ్, అన్బరసన్, సీఎస్ శివదాస్ మీనాతోపాటు ఆయాశాఖ అధికారులు పాల్గొన్నారు. అనేక ప్రాజెక్టుల పనులలో జాప్యాన్ని గుర్తు చేస్తూ, పనుల వేగాన్ని పెంచాలని, త్వరితగతిన ముగించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈశాన్య రుతు పవనాల సీజన్ కాలం నాటికి వర్షపు నీటి కాలువల నిర్మాణాలు ముగించాలన్నారు. ముందుగా సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ అడ్మిన్ విభాగం, నీటి పారుదల విభాగంలో కారుణ్య నియామకాల కింద ఎంపిక చేసిన 451 మందికి సీఎం ఉద్యోగ నియామక ఉత్వర్వులను అందజేశారు. అలాగే, బడులలో అల్పాహార పథకం విస్తృతంతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, ఆహార పదార్థాలను తరలించేందుకు సిద్ధం చేసిన ప్రచారవాహనాలను సీఎం స్టాలిన్ పరిశీలించారు. కాగా గ్రాండ్ మాస్టర్స్ జాబితాలో తమినాడుకు చెందిన క్రీడాకారుడు డి.గుకేష్‌కు టాప్ 10లో చోటు దక్కడంతో అతడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ సీఎం స్టాలిన్ ట్వీట్ చేశారు. పుదుచ్చేరి సీఎం రంగస్వామికి బర్త్ డే శుభాకాంక్షలు తెలుపుతూ మరో ట్వీట్ చేశారు.




కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేస్తున్న సీఎం స్టాలిన్

పీఎంకు లేఖ..

మోదీకి సీఎం రాసిన లేఖలో ప్రస్తుతం కురువై సాగుబడి, వర్షా బావ పరిస్థితులను గుర్తు చేశారు. నైరుతి రుతుపవనాల ప్రభావం కావేరి డెల్టా జిల్లాల్లో తక్కువగానే ఉందని, ప్రస్తుతం కర్ణాటక నుంచి వచ్చే నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ప్రస్తుతం కర్ణాటకలోని నాలుగు జలాశయాలలో ఆశాజనకంగానే నీళ్లు ఉన్నా, తమిళనాడుకు వాటాగా పంపిణీ చేయాల్సిన నీటిని విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని, తమ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి కలిసి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. కోర్టు తీర్పు మేరకు కావేరి యాజమాన్య సంస్థ ద్వారా నీటిని విడుదల చేయించాల్సిన అవశ్యం ఉందని గుర్తు చేస్తూ, డెల్టా జిల్లాలో కురువై పంటను రక్షించుకునేందుకు తోడ్పాటును అందించాలని కోరారు. సంబంధిత అధికారుల ద్వారా కర్ణాటకపై ఒత్తిడి తెచ్చి నీటిని విడుదల చేయించాలని కోరారు. కాగా, కావేరి యాజమాన్య సంస్థ నాలుగైదు రోజుల్లో సమావేశం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత అవసరాల దృష్ట్యా, 30 టీఎంసీల నీటిని విడుదల చేయించుకునే ప్రయత్నాలలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

తీర్పు కోసం ఎదురుచూపు



సెంథిల్ బాలాజి

సాక్షి, చెన్నై: మంత్రి సెంథిల్ బాలాజి ఇలాకా లేని మంత్రిగా కొనసాగడంపై దాఖలైన పిటిషన్ విచారణను హైకోర్టు ముగించింది. తీర్పు తేదీ ప్రకటించకుండా హైకోర్టు బెంచ్ వాయిదా వేసింది.

క్యాష్ ఫర్ జాబ్స్ వ్యవహారంలో మనీలాండరింగ్ కేసులో మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం పుళల్ జైల్లో ఉన్నారు. అయితే, సెంథిల్ బాలాజీని మంత్రిగా కొనసాగించడంపై గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యతిరేకతను వ్యక్తం చేశారు. దీనిని అస్త్రంగా చేసుకుని సెంథిల్ ఇలాకా లేని మంత్రిగా కొనసాగడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో పలువురు పిటిషన్లు వేశారు. ఇవన్నీ హైకోర్టు బెంచ్‌లో విచారణలో ఉన్నాయి. గత వారం పిటిషనర్లు, సెంథిల్ తరఫు న్యాయవాదులు, ప్రభుత్వం తరఫున వాదనలు కోర్టుకు చేరాయి. శుక్రవారం పిటిషన్ విచారణకు రాగా, అందరి తరఫున లిఖిత పూర్వక వాదనలు కోర్టుకు చేరాయి. ఈ వాదనలు పరిశీలించినానంతరం విచారణను ముగించినట్టు కోర్టు ప్రకటించింది. అయితే, తీర్పును న్యాయమూర్తులు పెండింగ్‌లో పెట్టారు. తేదీ ప్రకటించకుండా వాయిదా వేశారు. దీంతో ఇలాకా లేని మంత్రి వ్యవహారంలో తీర్పు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి సర్వత్రా నెలకొంది. ఇదిలా ఉండగా కరూర్, నామక్కల్‌లలోని సెంథిల్ బాలాజి సన్నిహితుల నివాసాలు, కార్యాలయాలలో రెండో రోజుగా శనివారం కూడా ఈడీ సోదాలు జరిగాయి.

పళని గూటికి అన్వర్ రాజా

- బీజేపీ పోటీ చేస్తే ప్రచారం చేస్తా



పళనిస్వామితో అన్వర్ రాజా

సాక్షి, చెన్నై: మాజీ ఎంపీ, రామనాథపురం మైనారిటీ నేత అన్వర్‌రాజా శుక్రవారం మళ్లీ అన్నాడీఎంకేలో చేరారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామితో భేటీతో సొంతగూటికి చేరారు. అన్నాడీఎంకేలో మైనారిటీ నేతగా అన్వర్‌రాజా కీలకంగా వ్యవహరించే వారు. గతంలో ఆయన ఎంపీగా కూడా ఉన్నారు. అయితే, అన్నాడీఎంకేలో విబేధం నేపథ్యంలో ఆయన శశికళకు అనుకూలంగా స్పందించి పళనిస్వామి ఆగ్రహానికి గురయ్యారు. శశికళను అన్నాడీఎంకేలోకి ఆహ్వానించాలని ఆయన చేసిన వ్యాఖ్యలతో పార్టీలో పదవి ఊడింది. దీంతో రెండేళ్లుగా పార్టీకి, రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన మళ్లీ అన్నాడీఎంకే వర్గాల ద్వారా పళనిస్వామికి దగ్గరయ్యే ప్రయత్నం చేసి సఫలీకృతులయ్యారు. శుక్రవారం గ్రీన్‌వేస్ రోడ్డులోని నివాసంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామితో పాటుగా ముఖ్యనేతలను కలిశారు. పళనిస్వామి సమక్షంలో మళ్లీ అన్నాడీఎంకేలో చేరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీలో విబేధాలు సర్వసాధారణం అని వ్యాఖ్యానించారు. తాను ప్రస్తుతం అన్నాడీఎంకేలోకి వచ్చేశాని, పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. రామనాథపురంలో కూటమి నేతృత్వంలోని బీజేపీ పోటీ చేస్తే, ఆ పార్టీ జెండాతో అభ్యర్థికి మద్దతుగా ఓట్ల కోసం ప్రజల వద్దకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్టు మైనారిటీ నేత అన్వర్ రాజా వ్యాఖ్యానించారు.

73 వేల మందితో మారథాన్

- నిర్వహణ రేపు



టీషర్టును పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణియన్

సాక్షి, చెన్నై : దివంగత డీఎంకే అధినేత కరుణానిధి శతజయంతి స్మారక మారథాన్ 73 వేల మందితో జరగనుంది. నందనం వైఎంసీఏ మైదానంలో ఈ ఏర్పాట్లను శుక్రవారం ఆరోగ్యమంత్రి ఎం సుబ్రమణియన్ పరిశీలించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ కరుణానిధి శత జయంతి స్మారక మారథాన్‌లో పాల్గొనేందుకు 73, 206 మంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వీరందరి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఆదివారం ఉదయాన్నే మారథాన్ కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే వారి కోసం వివిధ రూట్ల నుంచి బస్సులతో పాటు వేకువజామున మూడున్నర గంటలకే మెట్రోరైలు సేవలకు చర్యలు తీసుకున్నామన్నారు. గట్టి భద్రత నడుమ ఈ మారథాన్‌ను విజయవంతం చేస్తామన్నారు.

చపాతిలో కలైంజ్ఞర్

శత జయంతి స్మారకంగా చపాతిలో కలైంజ్ఞర్ కరుణానిధి బొమ్మను ఓ కళాకారుడు తీర్చిదిద్దాడు. కోయంబత్తూరు నగరం కునియా ముత్తూరు ప్రాంతానికి చెందిన ఎంపీ రాజా(48) కళాకారుడు వినూత్నంగా కరుణకు నివాళులర్పించేందుకు నిర్ణయించాడు. స్టౌపై ఓ పాత్రను ఉంచి దానిపై చపాతి కాల్చుతూ కరుణానిధి బొమ్మను రూపొందించాడు. దీనిని సిద్ధం చేయడానికి అతడికి 3 గంటలు సమయం పట్టింది.

పేదరికంలో ఎన్ఎస్.కృష్ణన్ కుటుంబం

తమిళసినిమా: నటుడిగా, గాయకుడిగా సినీ కళామతల్లికి విశేష సేవలు అందించిన దివంగత నటుడు ఎన్ఎస్.కృష్ణన్. నాటక రంగం నుంచి సినీ రంగప్రవేశం చేసిన ఈయన ప్రఖ్యాత హాలీవుడ్ నటుడు చార్లీ చాప్లిన్ తరహాలో ప్రేక్షకులకు వినోదంతో పాటు సందేశాన్ని అందించి ఆనందపరిచారు. ఈ సేవలకుగాను ఎన్ఎస్.కృష్ణన్ కలైవానర్‌గా వాసికెక్కారు. ఈయన ఇల్లు నాగర్‌కోవిల్‌లోని చినిగినచేరి అనే ప్రాంతంలో ఉంది. అక్కడ ఆయన కుటుంబసభ్యులు నివసిస్తున్నారు. అయితే ఆ కుటుంబం కడు పేదరికంలో ఉన్న విషయాన్ని ఆ నగర మేయర్ మహేష్ తెలిపారు. ఆయన ఆ ప్రాంతానికి శుక్రవారం వెళ్లి పరిశీలించారు. అప్పుడు ఎన్ఎస్ కృష్ణన్ ఇల్లు శిథిలావస్థలో ఉన్న విషయాన్ని గుర్తించారు. గోడలపై చెట్లు కూడా పెరిగాయి. దీంతో మేయర్ మహేష్ ఎన్ఎస్ కృష్ణన్ కుటుంబసభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అప్పుడు వారు చాలా పేదరికం అనుభవిస్తున్నట్లు దీంతో మేయర్ మహేష్ తాను వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి సాయం చేస్తానని ఇంటి గోడలపై పెరిగిన చెట్లను తొలగిస్తానని హామీ ఇచ్చినట్లు అనంతరం మీడియాకు వెల్లడించారు. అదేవిధంగా కలైంజర్ కరుణానిధికి సన్నిహితుడైన ఎన్ఎస్ కృష్ణన్ కుటుంబ సభ్యుల పరిస్థితిని ముఖ్యమంత్రి స్టాలిన్ దృష్టికి తీసుకెళ్లి తగిన సాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి



గ్రూప్-4 కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అభ్యర్థులు

కొరుక్కుపేట: యూపీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న యువత ముఖ్యమంత్రి పథకం కింద అందజేస్తున్న ప్రోత్సాహకాలను పూర్తిగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ట్విట్టర్ ద్వారా కోరారు. తమిళనాడు యువత భారత ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడానికి మా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. పరీక్షకు సిద్ధమవుతున్న యువత పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. తమిళనాడు యువత ప్రపంచాన్ని జయించే స్థాయికి చేరుకోవాలి అంటూ పోస్ట్ చేశారు. శుక్రవారం చెన్నైలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో గ్రూప్–4 అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరిగింది.

పరిశోధనపై శిబిరం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రసాయనశాస్త్ర పరిశోధనలపై ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రామాపురం క్యాంపస్‌లో శుక్రవారం శిబిరం జరిగింది. మూడు రోజుల పాటు జరిగే శిబిరాన్ని విద్యార్థులతో కలిసి ఎస్ఆర్ఎం గ్రూప్ డైరెక్టర్ వి.సుబ్బయ్య, రాయల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెలిస్సా మెండోంజా ప్రారంభించారు. 28 పాఠశాలలకు చెందిన 67 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరిశోధన శిబిరానికి హాజరయ్యారు. – సాక్షి, చెన్నై

మేలూరులో అన్నామలై యాత్ర

సాక్షి, చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాదయాత్ర శుక్రవారం మదురై జిల్లా మేలూరుకు చేరుకుంది. ఆయనకు పార్టీ వర్గాలు బ్రహ్మరథం పట్టాయి. జల్లికట్టు ఎద్దులతో వచ్చి మరీ ఆహ్వానం పలికారు. ఈ సమయంలో ఓ ఎద్దు బెదరడంతో కార్యకర్తలు, నాయకలు హడలెత్తిపోయారు. నా మట్టి..నాప్రజలు నినాదంతో అన్నామలై పాదయాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 29వ తేదీ రామేశ్వరంలో బయలుదేరిన అన్నామలై శుక్రవారం మదురై జిల్లా మేలూరుకు చేరుకున్నారు. ఇక్కడి బీజేపీ నేతలు తమ బలాన్ని చాటే విధంగా అధ్యక్షుడికి ఆహ్వానం పలికారు.

భక్తుల వినూత్న మొక్కులు

- తలపై కొబ్బరికాయలు కొట్టుకున్న 500 మంది భక్తులు



తలపై కొబ్బరికాయలు కొట్టించుకుంటున్న భక్తులు

కొరుక్కుపేట: కరూర్ సమీపంలోని మెట్టుమాకళాణాపురంలోని మహాలక్ష్మి అమ్మన్ ఆలయంలో భక్తులు వినూత్న రీతిలో మొక్కులు తీర్చుకున్నారు. తలపై కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం శుక్రవారం జరిగింది. 500 మందికి పైగా భక్తులు తలపై కొబ్బరికాయలు పగులగొట్టించుకుని పూజలు చేశారు. కరూర్ జిల్లాలోని కృష్ణరాయపురం సమీపంలోని మెట్టు మహాతనపురంలో మహాలక్ష్మి అమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో భక్తులు ప్రతి సంవత్సరం ఆడి పెరుక్కు తర్వాత తలపై కొబ్బరికాయలు పగలకొట్టడం ఆనవాయితీ. పూజను చేస్తూ తలపై కొబ్బరికాయ పగలకొడితే కోరిన కోర్కె నెరవేరుతుందని భక్తుల విశ్వాసం. పూజారి భక్తుల తలపై కొబ్బరికాయలు పగలగొట్టాడు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని దీప పూజలు చేశారు. ఇందుకోసం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి రావడం ప్రారంభించారు. ఆలయం ముందు తలపై కొబ్బరికాయలు పగలగొట్టుకునే భక్తులు క్యూకట్టారు.

చెన్నైలో డబుల్ డెక్కర్ బస్సులు

- ట్రయల్ రన్‌పై దృష్టి



డబుల్ డెక్కర్ బస్సు (ఫైల్)

సాక్షి, చెన్నై: చెన్నైలో మళ్లీ డబుల్ డెక్కర్ బస్సుల సేవలు రోడ్లపైకి రానున్నాయి. ఇందుకు సంబంధించిన ట్రయల్ రన్ కొన్ని మార్గాల్లో జరుగుతోంది. చెన్నైలో ఒకప్పుడు డబుల్ డెక్కర్ బస్సులకు స్పందన ఉండేది. చెట్లు, విద్యుత్ స్తంభాలు లేని మార్గాల్లో ఈ బస్సుల సేవలు ఉండేవి. కాలక్రమేనా చెన్నై నగరం విస్తరణ, ప్రగతి పథంలో భాగంగా వంతెనల నిర్మాణాలు వేగవంతం అయ్యాయి. ఈ బస్సులు 40-50 కి.మీ వేగంతో మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. వంతెనలపై రవాణా కష్టతరం కావడం వంటి పరిణామాలతో డబుల్ డెక్కర్ బస్సుల సేవకు మంగళం పాడారు. అదే సమయంలో ఒకే డ్రైవర్ రెండు బస్సులు అన్నట్టుగా కొంతకాలం రైలు బోగీల తరహాలో బస్సుల సేవలు జరిగాయి. అయితే, మలుపుల వద్ద ఈ బస్సుల రవాణా కష్టతరంగా మారింది. దీంతో వీటికి కూడా మంగళం పాడారు. ప్రస్తుతం సాధారణ బస్సుల సేవలు నగరంలో జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం నగరంలో విద్యుత్ తీగలు భూగర్భ మార్గంలో వెళ్లే విధంగా అనేక చోట్ల చర్యలు తీసుకున్నారు. కొన్ని మార్గాల్లో చెట్లు, వంతెనలు లేవు. దీంతో మళ్లీ డబుల్ డెక్కర్ బస్సుల సేవలపై దృష్టిపెట్టారు.

ఎలక్ట్రిక్ బస్సుగా..

చెన్నైలో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్ సేవలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ బస్సు సేవల గురించి రవాణా మంత్రి శివశంకర్ స్పష్టమైన సమాచారం ఇచ్చారు. ఈ పరిస్థితులలో ఈ బస్సు సేవలను పర్యాటక ప్రాంతాలను కలిపే విధంగా తొలివిడత సేవలకు సిద్ధమవుతున్నారు. అలాగే, అన్నాసాలై, కామరాజర్ సాలై, ఈసీఆర్ మార్గంలో ఈ బస్సు సేవకు సంబంధించిన పరిశీలన జరుగుతోంది. ఈ మార్గంలో ట్రయల్ రన్ రాత్రుల్లో జరుగుతున్నట్టు తెలిసింది. ఈ మార్గాల్లో పూర్తిస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి బస్సును రోడ్డెక్కించనున్నారు.

క్లుప్తంగా

నిరుపేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి



చీరలు అందజేస్తున్న సెవన్‌జీ మురళీధరన్

వేలూరు: నిరుపేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ముత్తురాయర్ సంఘం ఉత్తర ప్రాంత అధ్యక్షుడు రాజమాణిక్యం అన్నారు. వేలూరు వీఐటీ యూనివర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ సతీమణి రాజేశ్వరి అమ్మాల్ వర్ధంతి దినోత్సవంతో పాటు తమిళ ఆడిమాసం మూడవ శుక్రవారాన్ని పురష్కరించుకుని తమిళనాడు నాయుడు సంఘం గౌరవాధ్యక్షుడు సెవన్‌జీ మురళీధరన్ అధ్యక్షతన వేలూరు సోలాపురి అమ్మన్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పాలంకరణలు నిర్వహించారు. అనంతరం నిరుపేద మహిళలకు అన్నదానం చేసి చీరలను అందజేశారు. అఖిల భారత నాయుడు మహాజన సంఘం సడగోపన్ రామానుజం, యాదవ్ మహాసభ వేలూరు జిల్లా అధ్యక్షుడు లోగు యాదవ్, నమదు మక్కల్ పార్టీ జిల్లా కోశాధికారి సంపత్, నాయుడు పాల్గొన్నారు.

తిరుత్తణిలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ఆలయ సిబ్బంది

తిరుత్తణి: తిరుత్తణి ఆలయ కొండ మెట్ల మార్గంలో ఆక్రమణలను తొలగించారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 7 నుంచి ఆడికృత్తిక తెప్పోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సన్నిధి వీధి నుంచి శరవణ పుష్కరిణి, మెట్ల మార్గం ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగింపునకు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ ఆదేశించారు. దీంతో శుక్రవారం ఆలయ అధికారులు, రెవెన్యూ, పోలీసులు సమక్షంలో ఆక్రమణ దుకాణాలు తొలగించారు. భక్తులు సులభంగా మెట్లమార్గంలో కొండకు చేరుకునేందుకు వీలుగా దుకాణాలను తొలగించారు. ఆక్రమణల తొలగింపులో సీఐ మార్టిన్ ప్రేమ్‌రాజ్, డిప్యూటీ తహసీల్దార్ రీటా, ఆర్ఐ కమల్ సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనీమియా రహిత దేశాన్ని స్థాపిద్దాం

• అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి



సీనియర్ వైద్యులను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి

కొరుక్కుపేట: అనీమియా రహిత దేశాన్ని స్థాపిద్దామని తమిళనాడు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ జి.పిచ్చాండి పిలుపునిచ్చారు. ఈ మేరకు సౌత్ ఇండియన్ ఒబెస్ట్రీషియన్స్ అసోసియేషన్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రియన్స్ అండ్ గైనకాలజిస్ట్ సహకారంతో అనీమియా రహిత భారత్‌ను సృష్టిద్దాం అనే అవగాహన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. చెన్నైలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ జి.పిచ్చాండి ప్రసూతి వైద్యులు, గైనకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ రిషికేష్ బాయ్ సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసూతి, గైనకాలజీ విభాగంలో విజయాలు సాధించిన వైద్యులను పిచ్చాండి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఒబెస్ట్రీషియన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మాధురి పటేల్, సౌత్ ఇండియా ప్రసూతి వైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ జయరాణి కామరాజ్, కార్యదర్శి కుందవి శంకర్ పాల్గొన్నారు.

పోలీస్ వాహనాల తనిఖీ



పోలీస్ వాహనాలను తనఖీ చేస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు: వేలూరు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలకు తనిఖీల కోసం 127 వాహనాలను పోలీసులకు అందజేశారు. అయితే పోలీస్ వాహనాల వినియోగంపై ప్రతినెలా జిల్లా కేంద్రంలోని నేతాజీ స్టేడియానికి తీసుకొచ్చి వాహనాలను ప్రతినెలా తనఖీ చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం 86 వాహనాలను స్టేడియానికి తీసుకొచ్చారు. ఎస్పీ మణివన్నన్ పోలీసుల వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో వాహనాలను సక్రమంగా ఉపయోగించని ఎనిమిది మంది డ్రైవర్‌లకు మెమో ఇచ్చారు. అదే విధంగా వాహనాలను సక్రమంగా పెట్టుకున్న నలుగురు డ్రైవర్‌లకు రివార్డును అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ వేలూరు జిల్లాలో 127 వాహనాలున్నాయని, ప్రస్తుతం 86 వాహనాలు మాత్రమే తనిఖీలకు వచ్చాయని, మిగిలిన 46 వాహనాలను మరొక రోజు తనిఖీ చేస్తామన్నారు. వాహనాలను సక్రమంగా చూసుకోని డ్రైవర్‌లకు పాత వాహనాలను అందజేసి సక్రమంగా చూసుకుంటున్న వారికి కొత్త వాహనాలను అందజేస్తామన్నారు. ఆయనతో పాటు అదనపు పోలీస్ సూపరింటిండెంట్ భాస్కరన్, డీఎస్పీలు మనోహరన్, తిరునావక్కరసు, రామమూర్తి పోలీసులు ఉన్నారు.

శ్మశానం ఆక్రమణపై రెవెన్యూ అధికారుల సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుత్తణి: శ్మశానం ఆక్రమణపై ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే చేశారు. ఆర్కేపేట మండలం వెల్లాత్తూరు గ్రామ పంచాయతీలోని దళితవాడలో 200 కుటుంబీకులు నివాశముంటున్నారు. గ్రామ శ్మశాన్ని కొందరు ఆక్రమించి పంటసాగు చేస్తున్నట్లు గ్రామీణులు చాలాకాలంగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ క్రమంలో పంచాయతీ ద్వారా తీర్మానం చేసి తహసీల్దారుకు సమర్పించారు. స్పందించిన తహసీల్దారు విజయకుమార్ శ్మశానాన్ని సర్వే చేపట్టాలని ఆదేశించారు. దీంతో సర్వేయర్ లోకేష్, ఆర్ఐ భాస్కరన్, వీఆర్వో కల్లీస్ తదితరుల బృందం శ్మశానం ఆక్రమణకు సంబందించి సర్వే చేపట్టి ఆక్రమణను గుర్తించారు. ప్రస్తుతం పంట సాగు చేసి వున్నందున పంట దిగుబడి చేసిన తరువాత శ్మశానం స్థలంలో పంచాయతీ ద్వారా కంచె ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఎయిరిండియా విమానాల రాకపోకలు ఆలస్యం

కొరుక్కుపేట: న్యూఢిల్లీ నుంచి చెన్నై విమానాశ్రయానికి ఎయిరిండియా విమానం ఆలస్యం అయింది. దీంతో శ్రీలంక, అండమాన్‌కు ఎయిరిండియా విమానాలు ఉదయం 3 గంటలు ఆలస్యంగా బయలుదేరాయి. సరైన సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. న్యూఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానం గురువారం రాత్రి 11.30 గంటలకు చెన్నై విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉంది. ఈ విమానం 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు చెన్నై విమానాశ్రయానికి చేరుకుంది. అంతకుముందు న్యూఢిల్లీ నుంచి చెన్నైకి చేరుకున్న తర్వాత విమానం అర్ధరాత్రి 12.25 గంటలకు శ్రీలంక రాజధాని కొలంబోకు అంతర్జాతీయ విమానంగా బయలుదేరుతుంది. తర్వాత తెల్లవారుజామున 4.25 గంటలకు తిరిగి చెన్నై చేరుకుంటుంది. అదే విమానం తెల్లవారుజామున 5.05 గంటలకు దేశీయ విమానంగా మారి చెన్నై నుంచి అండమాన్‌కు బయలుదేరింది. ఈ సందర్భంలో అది గురువారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో న్యూఢిల్లీ నుంచి బయలుదేరింది. చెన్నై చేరుకోవాల్సిన ఎయిరిండియా విమానం 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు చెన్నై విమానాశ్రయానికి చేరుకుంది. దీంతో విమానం 4 గంటలు ఆలస్యమై తెల్లవారుజామున 4.20 గంటలకు శ్రీలంకకు బయలుదేరింది. అనంతరం శుక్రవారం ఉదయం 7.20 గంటలకు తిరిగి చెన్నై చేరుకున్నారు. చెన్నై నుంచి ఉదయం 5.05 గంటలకు టేకాఫ్ అయ్యి అండమాన్ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం మూడున్నర గంటలు ఆలస్యంగా 8.45 గంటలకు అండమాన్‌కు బయలుదేరింది. అదే విధంగా శుక్రవారం చెన్నై విమానాశ్రయంలో, ఢిల్లీలో జాప్యం కారణంగా చైన్ సిరీస్‌లో ఎయిరిండియా విమానాల రాక, నిష్క్రమణ తెలియక శ్రీలంక, అండమాన్‌కు వెళ్లే ప్రయాణికులు చెన్నై విమానాశ్రయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఉత్కంఠ నెలకొంది.

వేడుకగా అన్న కూట మహోత్సవం



పాలబిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, నిర్వాహకులు

కొరుక్కుపేట: ఆడిమాసం సందర్భంగా చెన్నై జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆడి శుక్రవార అన్నకూట మహోత్సవం–2023 వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో వాసవీ అమ్మవారిని వజ్ర వైడుర్యాలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం ఎస్‌కేపీసీ కళాశాల ప్రాంగణంలో కలశపూజ, 102 బిందెలకు ఆలయ అర్చకుల బృందం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుంచి ఆలయం వరకు మహిళలు పాలబిందెలతో ఊరేగింపుగా వెళ్లారు. ఆలయ మహామండపంలో మూలవిరాట్, ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకాన్ని చేశారు. అనంతరం అన్నకూట మహోత్సవం నిర్వహించారు. రాసిగా పోసిన అన్నాన్ని అమ్మవారి ప్రసాదంగా భక్తులకు వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్, ఎస్‌కేపీడీ ట్రస్టీలు శరత్‌కుమార్, శ్రీకాంత్, డాక్టర్ జి.విజయ కుమార్, లక్ష్మీనారాయణ, సుదర్శనం, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి



అవయవదానంపై ప్రతిజ్ఞ చేస్తున్న నరువి సిబ్బంది

వేలూరు: అవయవాలు దానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని వేలూరు నరువి ఆస్పత్రి చైర్మన్ జీవీ సంపత్ అన్నారు. వేలూరులోని ఆస్పత్రి ఆవరణలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ 75వ స్వాతంత్ర్య దినోత్సవం పురష్కరించుకుని కేంద్ర ప్రభుత్వం అవయవాల దానంపై ఈనెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఇండియా అవయవాల దానం మాసంగా ప్రకటించింది. అందులో భాగంగానే ఆస్పత్రి సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రి వైస్ చైర్మన్ అనిత, కార్యనిర్వహణ డైరెక్టర్ పాల్ హెండ్రీ, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ జాకబ్ జోస్, జనరల్ మేనేజర్ నితిన్, మణిమారన్ పాల్గొన్నారు.

తిరుత్తణి హుండీ ఆదాయం రూ. 1.8 కోట్లు

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు ఎనిమిది రోజుల్లో చెల్లించిన కానుకలను గురువారం కొండ ఆలయ దేవర మండపంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ సమక్షంలో లెక్కించారు. ఇందులో నగదు రూ.1,08, 40,908, బంగారు 339 గ్రాములు, వెండి 6,842 గ్రాములు వచ్చింది.



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పుగళ్ కథానాయకుడిగా తుడిక్కరదు మీసై



తుడిక్కరదు మీసై చిత్ర యూనిట్

తమిళసినిమా: కథానాయకులుగా అవతారమెత్తిన హాస్యనటుల సరసన ఇప్పుడు నటుడు పుగళ్ చేరారు. కుక్ విత్ కోమాలి బుల్లితెర కార్యక్రమంతో పాపులర్ అయిన ఈయన ఆ తరువాత సినీ రంగ ప్రవేశం చేసి హాస్యనటుడిగా అనతి కాలంలోనే పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు తుడిక్కరదు మీసై చిత్రం ద్వారా హీరోగా పరిచయం అవుతున్నారు. యోగి వీరన్ పిక్చర్ పతాకంపై రాము నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా ఎంజే ఇళన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన ఎస్‌డీ సభ వద్ద పలు చిత్రాలకు సహాయదర్శకుడిగా పనిచేశారు. అదేవిధంగా నిర్మాత కలైపులి.ఎస్.థాను వద్ద పనిచేసి అనుభవం గడించారు. తుడిక్కరదు మీసై చిత్రం గురువారం చెన్నైలో పూజాకార్యక్రమాలతో ప్రారంభమైంది. పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ప్రేమించడం తప్పు కాదు, ప్రేమ కోసం జీవితాన్ని నాశనం చేసుకునే ఈతరం యువత గురించి చెప్పే కథా చిత్రంగా ఉంటుందన్నారు. చిత్రాన్ని వినోదాన్ని జోడించి జనరంజకంగా రూపొందిస్తున్నట్లు చెప్పారు. చిత్ర కథ మదురై నుంచి చెన్నై వరకూ సాగుతుందని చెప్పారు. సినిమాపై ఆసక్తి, ప్రతిభ కలిగిన యూనిట్‌తో షూటింగ్‌కు సిద్ధమైనట్లు చెప్పారు. కాగా దీనికి అశోక్‌కుమార్ ఛాయాగ్రహణం, శ్రీకాంత్ దేవా సంగీతాన్ని అందిస్తున్నారు.



దుషారా

అందాలారబోతలో
హద్దులు తెలుసు

తమిళసినిమా: రాజకీయ కుటుంబం నుంచి సినీ రంగప్రవేశం చేసిన నటి దుషారా. పా.రంజిత్ దర్శకత్వంలో రూపొందిన సార్పట్టా పరంపరై చిత్రంలో అయ్యకు జంటగా కథానాయికిగా నటించి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ ఆ తరువాత నక్షత్రం నగర్గిరదు చిత్రంలో మరోసారి నటిగా తానేమిటో నిరూపించుకున్నారు. కాగా తాజాగా వసంత బాలన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన అనిత చిత్రంలో నటుడు అర్జున్‌దాస్‌తో పోటీ పడి నటించి ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం బాలాజి మోహన్ దర్శకత్వంలో నటిస్తున్న దుషారా ఈ చిత్రంతో పాటు మరో రెండు నూతన చిత్రాల్లో నటించనున్నట్లు చెప్పారు. దుషారా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ నటన అంటే తనకు చాలా ఇష్టమని చెప్పారు. అందుకే ఎలాంటి పాత్రలో నటించడానికైనా సిద్ధం అన్నారు. అయితే చిత్రంలో తన పాత్ర ఐదు నిమిషాలు ఉన్నా దానికి ప్రాధాన్యత ఉండాలన్నారు. కుటుంబకథా చిత్రాల నాయకి ఇమేజ్ తెచ్చుకున్న తనను గ్లామర్ పాత్రల్లో నటిస్తారా అని చాలామంది అడుగుతున్నారని, అందానికి, అశ్లీలతకు చాలా తేడా ఉందని, అలా ప్రేక్షకులు ముఖం తిప్పుకునేది ఏది గ్లామర్ కాదని అన్నారు. అందాలారబోతలో హద్దులు తనకు తెలుసని, అలాంటి పరిమితులు తో కూడిన గ్లామర్ పాత్రల్లో నటించడానికి తాను సిద్ధమేనని అన్నారు. బాలుమహేంద్ర, మణిరత్నం దర్శకులు అంటే ఇష్టం అని చెప్పారు.

కోలీవుడ్ టాక్స్

రసవాది ఫస్ట్‌లుక్ విడుదల

తమిళసినిమా: మౌనగురు, మహాముని వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు శాంతకుమార్. కథలను నమ్మి చిత్రాలు చేసే ఈయన పాత్రలకు తగ్గ నటీనటులను ఎంపిక చేసుకుంటారు. అలా శాంతకుమార్ తెరకెక్కిస్తున్న మూడవ చిత్రం రసవాది. డీఎస్‌పీ మెకానిక్ కంపెనీ సరస్వతి సినీ క్రియేషన్స్ సంస్థతో కలిసి నిర్మిస్తున్న ఇందులో నటుడు అర్జున్‌దాస్, తాన్యా రవిచంద్రన్ హీరోయిన్లుగా నటిస్తున్న ఇందులో నటి రమ్య సుబ్రమణియన్, జీఎం సుందర్, సుజిత్ శంకర్, రేష్మ, సుజాత, రిషీకాంత్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎస్. తమన్ సంగీతాన్ని, వరవణన్ ఇళవరసు, శివకుమార్‌ల ద్వయం ఛాయాగ్రహణం అందిస్తున్నారు. కాగా చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. దర్శకుడు శాంతకుమార్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో క్రైమ్, రొమాంటిక్, యాక్షన్, థ్రిల్లర్ కథా చిత్రంగా ఇది ఉంటుందని చెప్పారు. తాను గత చిత్రాల తరహాలోనే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందన్నారు. చిత్ర షూటింగ్‌ను కొడైకనాల్, మదురై, కడలూర్, పళని ప్రాంతాల్లో చిత్రీకరించినట్లు చెప్పారు. చిత్ర ఆడియో, విడుదల తేదీ వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు. చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్ సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



రసవాది చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్

గుడ్‌నైట్ టీమ్ మరో చిత్రం

తమిళసినిమా: చిన్న చిత్రంగా విడుదలై సంచలనం విజయాన్ని సాధించిన చిత్రం గుడ్‌నైట్. ఈ చిత్రం కథానాయకుడు మణికంఠన్, మిలియన్ డాలర్స్, ఎంఆర్పీ సంస్థలు మరో చిత్రానికి సిద్ధమయ్యారు. శ్రీగౌరిప్రియ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్యాన్ రోల్డన్ సంగీతాన్ని, శ్రేయాకృష్ణ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. కాగా ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్ర షూటింగ్ శుక్రవారం ఉదయం చెన్నైలో పూజాకార్యక్రమాలతో ప్రారంభమైంది. కార్యక్రమానికి నటుడు విజయ్ సేతుపతి విచ్చేసి ముహూర్తం షాట్‌కు క్లాప్ కొట్టి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు వివరాలను తెలుపుతూ యువతీ యువకులు సమకాలీన ప్రేమ, తద్వారా ఏర్పడే సమస్యలను ఆవిష్కరించే కథా చిత్రంగా ఇది ఉంటుందన్నారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై, గోవా సమీపంలోని గోకర్ణం ప్రాంతాల్లో చిత్రీకరించనున్నట్లు చెప్పారు. చిత్ర కథ జనరంజక అంశాలతోపాటు మంచి సందేశంతో కూడి ఉంటుందన్నారు.



నూతన చిత్రంలో చిత్ర యూనిట్

శ్రీరామ్ కార్తీక్ హీరోగా కొత్త చిత్రం

తమిళసినిమా: కన్ని మేడమ్ చిత్రం ఫేమ్ శ్రీరామ్ కార్తీక్ హీరోగా నటిస్తున్న నూతన చిత్రం గురువారం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. అజయ్ అర్జున్ ప్రొడక్షన్స్ పతాకంపై డాక్టర్ అర్జున్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయన్ బాలా కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈయన 20 ఏళ్లుగా కథకుడిగా, స్క్రీన్ ప్లే రచయితగా పలు చిత్రాలకు పని చేశారన్నది గమనార్హం. అదేవిధంగా 2017లో విడుదలైన ఆరు అధ్యాయం చిత్రంలో ఒక భాగానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో నటి క్రిష్‌గురూప్ నాయకిగా నటిస్తుండగా నటుడు యోగిబాబు, మునీష్ కాంత్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. దీనికి సిద్ధం కుమార్ సంగీతాన్ని, చెళియన్ ఛాయాగ్రహణం అందించారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది కొండ ప్రాంతంలో సాగే హృదయాన్ని హత్తుకునే అందమైన ప్రేమ కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. తమిళసినిమాపై ఆసక్తి, ప్రతిభ కలిగిన యూనిట్‌తో కలిసి చేస్తున్న చిత్రం ఇది అన్నారు. కథను మాత్రమే నమ్మి రూపొందిస్తున్న ఈ చిత్రం టైటిల్, ఇతర వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు చెప్పారు. తనకీ అవకాశాన్ని కల్పించిన నిర్మాత అర్జున్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.



అజిత్ అర్జున్ ప్రొడక్షన్స్ చిత్ర యూనిట్

క్లుప్తంగా

అన్నదాతల కోసం కొత్త ఆవిష్కరణలు

సాక్షి, చెన్నై: అన్నదాతల కోసం అధునాతన వ్యవసాయ సాంకేతికతలతో కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలపై దృష్టి పెట్టనున్నామని ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ తెలిపారు. స్థానికంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌వై 24లో భాగంగా జూలైలో జరిగిన 10,683 సొనాలికా ట్రాక్టర్ల అమ్మకాలను, 14 శాతం దేశీయ వృద్ధి , 6.4 శాతం పరిశ్రమ వృద్ధిని వివరించారు. రైతుల ప్రగతి భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా 2023–24 సంవత్సరంలో ముందడుగు వేశామన్నారు. రైతులకు మద్దతుగా నిలబడేందుకు ఆధునిక సాంకేతికతలతో కొత్త ఉత్పత్తులు, ఆవిష్కరణలపై విస్తృత చర్యలు చేపట్టామని తెలిపారు.

మహిళా కౌన్సిలర్‌కు బెదిరింపులు

తిరువొత్తియూరు: నాగర్‌కోవిల్‌లో డీఎంకే మహిళా కౌన్సిలర్ హత్యా బెదిరింపులకు గురైంది. బెదిరింపు ఇచ్చిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నాగర్‌కోవిల్ కార్పొరేషన్‌లోని 28వ వార్డు పరిధిలోని కొట్టార్ ఆసారిమార్ నార్త్ స్ట్రీట్‌లో కాంక్రీట్ వర్క్ జరిగింది. ఆ సమయంలో కొట్టార్ పరాయి కల్మడంకు చెందిన గుణశీలన్(27) అక్కడ కాంక్రీట్ నేలపై నడిచాడు . ఇది చూసిన వార్డు డీఎంకే మహిళా కౌన్సిలర్ ఆనందలక్ష్మి, గుణశీలన్‌ను మందలించింది. అప్పుడు గుణశీలన్ అసభ్యకరంగా మాట్లాడి ఆనందలక్ష్మిని చంపేస్తానని బెదిరించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు గుణశీలన్ కోసం గాలిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఉద్యోగి మృతి

తిరువొత్తియూరు: చెన్నై, ఆవడి సమీపంలో విద్యుత్ షాక్ తగిలి మెట్రో వాటర్‌లో పనిచేస్తున్న యువకుడు మృతిచెందాడు. చెన్నై కొడుంగయూరుకు చెందిన దినేష్ (29). ఇతని భార్య సౌమ్య (26). ఈమె 8 నెలల గర్భిణి. దినేష్ ఆవిడి సమీపం అయ్యపాక్కం లోని తమిళనాడు హౌసింగ్ బోర్డు కాలనీలో తాగునీటి శుద్ధీకరణ మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తాగునీటి శుద్ధీకరణ కార్యాలయంలో ఆపరేటర్ గదిలో కింద పడిన విద్యుత్ తీగను తీయడానికి ప్రయత్నించిన సమయంలో విద్యుత్ షాక్‌కు గురై దినేశ్ మృతిచెందాడు. విషయం తెలిసి తిరుముల్లవాయిల్ పోలీసులు అక్కడి చేరుకుని మృతదేహాన్ని కీల్‌పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దినేష్, సౌమ్యకు వివాహమై 11 నెలలు అవుతుండడం గమనార్హం.

యువకుడి దుర్మరణం

తిరువొత్తియూరు: చెన్నై తిరువొత్తియూరు సమీపంలోని సాత్తాంగాడు వద్ద లారీ చక్రం ఎక్కి దిగడంతో యువకుడు దుర్మరణం చెందాడు. చెన్నై మాధవరం పాల్ డిపో ప్రాంతానికి చెందిన వారు సతీష్ కుమార్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను సాతాంగాడు మెయిన్ రోడ్డులో ఉన్న కుప్పైమేడులో రోడ్డు పక్కన నిద్రపోతున్నాడు. ఆ సమయంలో అక్కడ నిలిచి వున్న లారీని డ్రైవరు హఠాత్తుగా ముందుకు నడపడంతో చక్రం సతీష్ కుమార్ తలపై ఎక్కిదిగింది. అతను అదే చోట మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొఫెసర్ ఆత్మహత్య

అన్నానగర్: ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సేలం సమీపం కరూరులో జరిగింది. కరూరులో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఉంది. ఇక్కడి సివిల్ విభాగంలో జయప్రభాకరన్ (34), అతని భార్య సోబాన(31) ఇద్దరూ పనిచేస్తున్నారు. వీరు తిరుచ్చిలో కలిసి చదువుతున్నప్పుడు ప్రేమించుకుని 2017లో వివాహం చేసుకున్నారు. వీరికి మకరన్(4), ఏడాదిన్నర వయస్సు గల రావెన్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. సోబాన తన పిల్లలతో కలిసి ఆడి పండుగ సందర్భంగా ఈరోడ్‌లోని తన తల్లి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో జయప్రభాకరన్‌కు ఫోన్ చేసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం జయప్రభాకరన్ తన భార్య దుపట్టాతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న కరుప్పూర్ పోలీసులు అక్కడికి చేరుకుని జయప్రభాకరన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విచారణలో సోబాన ఎక్కువ జీతం పొందగా, జయప్రభాకరన్ ఆమె కంటే తక్కువ జీతం పొందినట్లు తేలింది. దీంతో అతడికి ఆత్మన్యూనత ఏర్పడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని ఆత్మహత్యకు గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ ఉద్యోగి హత్య

అన్నానగర్: పుదుగై సమీపంలో గురువారం ఉదయం ఆలయ ఉద్యోగిని గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో కొట్టి చంపారు. పుదుకోట్టై జిల్లా ఇలుప్పూర్ సమీపంలోని పంచాయతీ పరిధిలోని తిరువన్నా కోయిల్‌పట్టికి చెందిన గణేశన్(59). ఇతను కరోనా కాలంలో చెన్నైలో పనిచేశాడు. తన స్వస్థలమైన తిరువన్నాకోయిల్‌పట్టికి వచ్చి దేవాలయాలలో పనిచేసేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు. ఈ క్రమంలో గురువారం గణేశన్ చెన్నైలోని ఇంట్లో ఉండగా వాహనంలో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు గణేశన్‌ను రాళ్లు, కర్రలతో కొట్టి హతమార్చారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న ఇలుపూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆడి శుక్రవార పూజలు



అమ్మవారికి కరగాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

వేలూరు: వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో తమిళ ఆడిమాస మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వాలాజలోని ధన్వంతరి ఆరోగ్య పీఠంలో పీఠాధిపతి డాక్టర్ మురళీధరస్వామిజీ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి కోసం, మహిళల మాంగల్య బలం కోసం వరమహాలక్ష్మి యాగం, శాంతి దుర్గహోమ పూజలను నిర్వహించారు. ముందుగా గోపూజ, గణపతి పూజలను నిర్వహించారు. అనంతరం పిల్లలు విద్యాభివృద్ధి పెరగాలని, వివాహ భాగ్యం, సంతానం, మాంగల్య బలం కలగాలని కోరుతూ మహిళలు యాగగుండంలో వేసే పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకొచ్చి యాగగుండంలో వేసి పూజలు చేశారు. అదేవిధంగా పీఠంలోని నవదుర్గ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పుష్పాలంకరణలు చేపట్టి భక్తుల దర్శనార్థం ఉంచారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని ఉన్నామలై అమ్మవారికి శివాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపారాధన చేసి పుష్పాలంకరణలు చేశారు. న వెట్టువనం పడవేటమ్మన్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలు చేశారు.

చదురగిరి ఆలయానికి ఆరు రోజులు అనుమతి

తిరువొత్తియూరు: ఆడి నెల రెండో అమావాస్య సందర్భంగా చదరగిరి ఆలయానికి వెళ్లేందుకు భక్తులకు ఆరు రోజులు అనుమతి ఇచ్చారు. చదిరగిరి మదురై జిల్లా సాప్టూర్ సమీపంలోని పశ్చిమ కనుమల కొండల్లో సుందర మగాలింగం స్వామి ఆలయం వుంది. ఇక్కడ పౌర్ణమికి మూడు రోజులు అమావాస్యకు మూడు రోజులు ప్రదోషంనకు రెండు రోజులని మొత్తం 8 రోజులు ఆలయమునకు వెళ్ళుటకు భక్తులకు అనుమతి ఇస్తున్నారు. ఈ క్రమంలో పౌర్ణమి అమావాస్య, ప్రదోషం రోజుల్లో విరుదునగర్, మదురై, తేని, శివగంగై, చెన్నై, కోవై తదితర పలువేరు జిల్లాలకు చెందిన వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి వెళ్లి స్వామిని దర్శనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఆడి, తై నెలల్లో అమావాస్య రోజులకు ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం ఆడి నెలలో రెండు అమావాస్యలు వస్తుండడంతో ఆగస్టు 12వ తేదీ నుంచి 17 వరకు 6 రోజులు భక్తులకు అనుమతి ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

తిరువొత్తియూరు: కుంద్రత్తూరు సమీపంలో విల్లుపురానికి చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుంద్రత్తూరు సమీపంలోని కొలచేరి చెరువుగట్టుకు వెళ్లే రోడ్డులో ఉన్న జయనగర్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని క్రోమ్‌పేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని తల, ముఖంపై కత్తి వేట్లు ఉన్నట్టు తెలిసింది. దీని గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో మృతి చెందిన వ్యక్తి విల్లుపురం జిల్లాకు చెందిన కాళిదాసన్ (39) అని తెలిసింది. ఎవరైనా హత్య చేసి మృతదేహాన్ని పడేశారా లేదా అతను మద్యం మత్తులో కిందపడి మృతిచెందాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

స్త్రీలు సమాజంలో ఏదైనా సాధిస్తారు



అన్నపూర్ణాదేవిని సత్కరిస్తున్న అధ్యాపకులు

కొరుక్కుపేట: స్త్రీలు సంకల్పిస్తే సమాజంలో ఏదైనా సాధించగలరని కుప్పుస్వామి శాస్త్రి రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఎస్ అన్నపూర్ణాదేవి అన్నారు. ఈ మేరకు ఎస్‌కేపీసీలోని ఐక్యూఏసీ, ల్యాంగ్వేజీ విభాగాలు సంయుక్త ఆధ్వర్యంలో స్త్రీ ప్రపంచానికి రక్షకురాలు అనే అంశంపై కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుక ప్రత్యేక ఉపన్యాసానికి డాక్టర్ ఎస్. అన్నపూర్ణాదేవి హాజరై ప్రసంగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.మోహనశ్రీ, డీన్ డాక్టర్ పీబీ వనిత, వైస్ ప్రిన్సిపల్ ఎస్ వినప్రియై విద్యార్థినిలను ఆశీర్వదించారు.

మనవడిని రక్షించబోయి అమ్మమ్మ మృతి

అన్నానగర్: తిరుక్కల్‌కుంద్రం సమీపంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురైన మనవడిని రక్షించబోయి అమ్మమ్మ మృతి చెందింది. తిరుక్కల్‌కుంద్రం అంబేద్కర్ నగర్‌కు చెందిన సులోచన (50). ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం కూడా నీళ్ల కోసం బిందెతో అక్కడి వీధి కొళాయి వద్దకు వెళ్లింది. ఆమెతో పాటు మనవడు శబరీషన్(13) కూడా వెళ్లాడు. సులోచన నీళ్లు పట్టుకుంటుండగా హైవోల్టేజీ వైరు తెగి శబరీషన్‌పై పడింది. ఇది చూసిన సులోచనా వెంటనే మనవడిని కాపాడే ప్రయత్నం చేసింది. మనవడిని పట్టుకుని రక్షించింది. అయితే అదే సమయంలో ఆమె కాలికి విద్యుత్ వైరు చుట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన శబరీషన్‌ను చెంగల్‌పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 27 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 59,898 మంది స్వామివారిని దర్శించుకోగా.. 26,936 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది.



ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆధ్యాత్మికం.. శ్రీమహాలక్ష్మి యజ్ఞం



హోమ కుండలాల వద్ద పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

తిరుపతి కల్చరల్: సామవాయి రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ సమీపంలోని యాగ మండపంలో రెండో రోజు శుక్రవారం చేపట్టిన శ్రీమహాలక్ష్మి యజ్ఞం ఆధ్యాత్మికతను పులకింపజేసింది. ఝులారియా పీఠాధిపతి ఘనశ్యామాచార్యజీ మహరాజ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యాగ మండపంలోని 225 కుండలాల యజ్ఞ మండపాలలో యజ్ఞం సాగింది. యజ్ఞ ప్రధాన ఆచార్య కైలాస్ చంద్రస్వామిజీ వేద పండితులచేత వేదపారాయణం చేపట్టారు. వందలాది మంది భక్తులు శ్రీమహాలక్ష్మి మహాయాగ యజ్ఞంలో పాల్గొని ఆధ్యాత్మికతతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. నిర్వాహకులు నవీన్ మహేశ్వరి, అనురాగ్‌తాజ్, కౌస్తభ్ ఝుకోడియా, సంజయ్‌శారద, మహాయాగ యజ్ఞం కో–ఆర్డినేటర్ కె.గిరిధర్ కుమార్ పాల్గొన్నారు.

బావిలో దూకి దంపతుల ఆత్మహత్య

అన్నానగర్: సూరమంగలం సమీపంలో కుటుంబకలహాలతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సేలం సూరమంగళం సమీపంలోని బోధినాయకన్ పట్టి మూలకాడు ప్రాంతానికి చెందిన పళనిస్వామి (35). ఇతని భార్య సీత (33). వీరికి 14 ఏళ్ల కుమార్తె, 11 ఏళ్ల కుమారుడు ఉన్నారు. దంపతులు అక్కడి సిమెంట్ స్టోన్ తయారీ కంపెనీలో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరి మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఎప్పటిలాగే పనికి వెళ్లిన ఇద్దరూ గురువారం సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లారు. అప్పుడు వారి మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపం చెందిన సీత వెంటనే పరుగులు తీస్తూ రైల్వే పరిధిలో శిథిలావస్థలో ఉన్న బావిలో దూకింది. ఆమె వెనుకే వచ్చిన పళనిస్వామి భార్య దూకడం చూసి వెంటనే అతనూ బావిలోకి దూకాడు. వారి వెంటే పరుగులు తీసిన కుమార్తె గమనించి ఇరుగుపొరుగున ఉన్నవారికి చెప్పింది. వారు అక్కడికి వెళ్లి చూసే సరికి ఇద్దరూ బావిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల సేపు శ్రమించి దంపతుల మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 23.10 లక్షల మోసం – వ్యాపారి అరెస్ట్

కొరుక్కుపేట: చెన్నై డీలర్ నుంచి ఆన్‌లైన్‌లో మిరపకాయలు కొనుగోలు చేసి రూ.23.10 లక్షలు మోసం చేసిన కోయంబత్తూరుకు చెందిన వ్యాపారి సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మోసానికి సహకరించిన మహిళ సహా ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విజయపాండియన్ చెన్నైకి చెందిన వ్యక్తి. ఇతని భార్య భువనేశ్వరి (45). నాయనమ్మ పేరుతో ఎగుమతి కంపెనీని నడుపుతున్నారు. ఆన్‌లైన్‌లో హోల్‌సేల్‌గా మిరపకాయలను విక్రయిస్తున్నారు. భువనేశ్వరి నడిపిస్తున్న కంపెనీని ఫోన్‌లో సంప్రదించిన వ్యక్తి కోయంబత్తూర్‌లో ప్రైవేట్ కంపెనీ నడుపుతున్న గౌతమిగా పరిచయం చేసుకున్నారు. ఇంకా 4 టన్నుల మిరపకాయలు పంపితే వెంటనే నగదు చెల్లిస్తానని తెలియజేశారు. నమ్మిన భువనేశ్వరి గతేడాది సెప్టెంబర్‌లో ఏజెంట్‌కు రూ. 23.10 లక్షల విలువైన 1.4 టన్నుల మిరపకాయలు పంపించాడు. మిర్చి కొనుగోలుకు డబ్బులు పంపడంలో జాప్యం చేస్తున్నారు. భువనేశ్వరి సంప్రదించగా, గౌతమి అస్పష్టంగా సమాధానం ఇచ్చింది. భువనేశ్వరి కోయంబత్తూరులోని దిహాల్ రోడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పారిశ్రామికవేత్త అజ్మల్ ఖాన్, హోటల్ యజమాని కల్లాయి రాజజాలను అరెస్ట్ చేశారు. మోసానికి సహకరించిన గౌతమి, మీరన్, దావూద్‌పై కేసు నమోదు చేసి ముగ్గురిని విచారిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో పంచాయతీ అధ్యక్షురాలు మృతి

తిరువొత్తియూరు: అనుమానాస్పద స్థితిలో ఓ పంచాయతీ అధ్యక్షురాలు బావిలో మృతదేహమై తేలింది. రాణిపేట జిల్లా నెమిలి సమీపం కీల్‌వెన్నంబాక్కంకు చెందిన మాలతి (42) పంచాయతీ అధ్యక్షురాలు. ఈమె శుక్రవారం ఉదయం ఇంటి వెనుక ఉన్న బావిలో శవంగా తేలింది. సమాచారం అందుకున్న నెమిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలికి భర్త మురుగవేలు, ఒక కుమారుడు ఉన్నారు.

నగలు అప్పగించి నిజాయితీ చాటుకున్న మహిళ

తిరువొత్తియూరు: టీనగర్ కార్ పార్కింగ్‌లో పోగొట్టుకున్న ఏడు సవర్ల నగలను సొంతవాళ్లకు అప్పగించారు. చెన్నై మడిపాక్కం ప్రాంతానికి చెందిన కుమరన్ (64). ఇతను తన కుటుంబంతో సహా గత 3వ తేదీ ఇంటికి కావలసిన వస్తువులు కొనడానికి టీనగర్ వెళ్లారు. ఆ సమయంలో రోడ్డు పక్కన కారును నిలిపిన సమయంలో ప్లాస్టిక్ కవర్లో ఉంచిన 7 సవర్ల నగలు వున్న బ్యాగును పోగొట్టుకున్నారు. ఇది గమనించిన మహిళ ఒకరు ప్లాస్టిక్ కవర్లో ఉన్న సంచిని సమీపంలో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు. అందులో ఏడు సవర్ల నగలు ఉన్నాయని గుర్తించారు. దీనిపై ఉన్న కారు రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా పోలీసులు కారు యజమానికి సెల్‌ఫోన్‌లో సమాచారం అందించారు. ఆధారాలతో నిర్ధారించుకుని వారికి నగలు అందజేశారు. నిజాయితీగా నగలు అప్పగించిన మహిళను పోలీసులు అభినందించారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సన్‌భీమ్ పాఠశాల చైర్మన్ హరిగోపాలన్

వేలూరు: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని సన్‌భీమ్ పాఠశాల చైర్మన్ హరి గోపాలన్ తెలిపారు. వేలూరు సత్‌వచ్చారిలోని యతిరాజ్ మెట్రిక్ పాఠశాలలో శుక్రవారం 30వ వార్షికోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాల ట్రస్ట్ సభ్యులు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు క్రమశిక్షణ అలవాటు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంతో పాటు తల్లి దండ్రులపైనా ఉందన్నారు. తాము చదివే రోజుల్లో ప్రత్యేక తరగతులు, ట్యూషన్‌లు లేవని, పాఠశాలలో ఉపాధ్యాయులు తెలిపే పాఠ్యాంశాలను శ్రద్ధతో చదువుకునే వారమని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారని తెలిపారు. వాటి నుంచి పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. పాఠశాలలోను, ఇంటి వద్ద కూడా ప్రశాంతమైన వాతావరణం ఉంటేనే పిల్లలు క్రమశిక్షణ గల విద్యార్థులుగా ఎదుగుతారని వివరించారు. చిన్న వయస్సు నుంచే ప్రతి ఒక్కరికీ పట్టుదల, క్రమశిక్షణ అవసరమని, అప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని వెల్లడించారు. పారిశ్రామికవేత్త టీఎస్ ఉదయశంకర్, ప్రజా సేవకురాలు సంగమేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం షరిమ్మల, టీచర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువళ్లూరు జిల్లా కలెక్టర్‌పై కోర్టు ధిక్కార కేసు

పళ్లిపట్టు: తిరువళ్లూరు జిల్లా కలెక్టర్‌పై కోర్టు ధిక్కారం కేసు నమోదు చేశారు. పళ్లిపట్టు సమీపంలోని నొచ్చిలి పంచాయతీ విజయమాంబాపురం గ్రామానికి చెందిన నరసింహులు నాయుడు ఏప్రిల్ 1న అనారోగ్యంతో మృతి చెందాడు. శవాన్ని గ్రామ సమీపంలోని పట్టా భూమిలో పూడ్చారు. ఈ సంఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన బాబునాయుడు ప్రజా వ్యాజ్యం దాఖలు చేశారు. పట్టా భూమిలో పూడ్చిన శవాన్ని వెలికితీసి గ్రామానికి చెందిన శ్మశానంలో పూడ్చాలని కోరారు. అదే సమయంలో మృతి చెందిన నరసింహులు నాయుడు భార్య తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. హైకోర్టులో ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పులో శ్మశానం వున్నప్పుడు పట్టా భూమిలో శవాన్ని పూడ్చేందుకు అనుమతి లేదని, తీర్పు వెలువరించిన రోజు నుంచి ఏడు రోజుల్లో శవాన్ని తీసి శ్మశానంలో పాతిపెట్టాలని, లేని పక్షంలో తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి ఆర్డీఓ, తహసీల్దారు, సీఐ సమక్షంలో శవం వెలికి తీసి శ్మశానంలో పూడ్చాలని తమ తీర్పులో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఇచ్చిన సమయం దాటిపోవడంతో శవం వెలికి తీసి శ్మశానంలో పూడ్చడంలో చర్యలు చేపట్టకపోవడంతో జిల్లా కలెక్టర్, డీఆర్‌ఓ, ఆర్డీఓ, తహసీల్దారు, సీఐపై బాబునాయుడు కోర్టు ధిక్కార కేసు నమోదు చేశారు. ఈ కేసు త్వరలో విచారణకు రానుంది.

భార్య ఆత్మహత్యను జీర్ణించుకోలేక భర్త మృతి

అన్నానగర్: భార్య ఆత్మహత్య చేసుకోవడంతో మనస్తాపం చెందిన భర్త కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రెడ్ హిల్స్ సమీపంలో జరిగింది. తండల్ కాలనీ వడివుడయన్ అమ్మన్ పట్టుకోట్టై, మాన్ నగర్, అళగిరి వీధికి చెందిన అమృతకుమార్ ఇతను ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతను నివేదా (19)ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె మొదటి పెళ్లి రోజుకు భర్తను ఇంట్లోనే ఉండాలని కోరింది. అతను పనికి వెళ్లడంతో మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తీవ్ర మనస్తాపానికి గురైన అమృతకుమార్ గురువారం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెడ్ హిల్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నై ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు.

బావను కడతేర్చిన యువకుడి అరెస్ట్

అన్నానగర్: కల్పాక్కం సమీపంలో గురువారం రాత్రి ఆమ్లెట్ కోసం బావను హత్య చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. కల్పాక్కం సమీప ఉయ్యాలికుప్పం ఇరులార్ ప్రాంతానికి చెందిన చెల్లప్పన్ (30), మురుగన్ (32) బావా బామ్మర్దులు. వీరు పుదుపట్నం గురువారం రాత్రి ఈసీఆర్ రోడ్డులోని కార్ షోరూం సమీపంలో మద్యం తాగారు. ఆ సమయంలో చెల్లప్పన్ రెండు ఆమ్లెట్లను తీసుకొని వచ్చాడు. వాటిని మురుగన్ తినేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం మత్తులో ఉన్న మురుగన్ కోపోద్రిక్తుడై చెల్లప్పన్‌పై కర్రతో దాడి చేశాడు. తలకు బలమైన గాయం కావడంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మద్యం మత్తులో పడి ఉన్న మురుగన్‌ను అరెస్టు చేసి విచారిస్తున్నారు.

డీఎంకే వ్యాపార జిల్లా ఆర్గనైజర్ల నియామకం

కొరుక్కుపేట: డీఎంకే వ్యాపార బృందం తరపున జిల్లా ఆర్గనైజింగ్ డైరెక్టర్, డిప్యూటీ ఆర్గనైజర్లను నియమించినట్లు ఆ విభాగం కార్యదర్శి కాశి ముత్తు మాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై తూర్పు జిల్లా అధ్యక్షుడిగా మారి, ఉపాధ్యక్షుడిగా శాంతిలాల్, ఉప నిర్వాహకులుగా సెంథమిల్ సెల్వన్, గజేంద్రన్, జియాఉద్దీన్. సురేష్, మనో కరణ్, జగన్నాథన్, అల్లిరాజన్. తమిళమణి, బాలాజీ, దినేష్, అశోక్ జైన్, కృపాకరన్, సురేష్. వెంకటేశ్వరన్, వసంత్ గోకుల్, సూర్యకుమార్, యోగేష్ బాలాజీ, అయ్యదురై, మోహన్, సురేష్, ధనరాజ్, రూపకాంతి, గంగా ఆర్. సురేష్, కృష్ణన్ నియమితులయ్యారు. అదేవిధంగా చెన్నై సౌత్ వెస్ట్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడుగా మదియాళగన్ నియమితులయ్యారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం



వ్రతం ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేపట్టారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులను ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చకులు ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. అనంతరం గణపతి వ్రతం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి సూపరింటెండెంట్ రంగ స్వామి, ఇన్‌స్పెక్టర్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి శుక్రవారం రాత్రి స్వర్ణ రథంపై విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం పూర్తయిన తర్వాత ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ రథంపై కొలువుదీర్చారు. అనంతరం ఉభయదేవేరీ సమేతంగా స్వామివారు స్వర్ణరథంపై ఊరేగుతూ దర్శనమిచ్చారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

శ్రీశైలానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల నుంచి శుక్రవారం సాయంత్రం సమయానికి 48,510 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. గురువారం నుంచి శుక్రవారం వరకు జలాశయంలోకి 3.7728 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. దీంతో డ్యాం నీటిమట్టం 859 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలో 102.8910 టిఎంసీల నీరు నిల్వగా ఉంది.

కౌంటరు వేయకపోతే జరిమానా తప్పదు

ఉమ్మడి ఆస్తుల విభజన కేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి ఆస్తుల విభజన కేసులో కౌంటరు దాఖలు చేయకపోతే జరిమానా తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. రెండు రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజనలో జాప్యంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీ భట్టీతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఉమ్మడి ఆస్తుల విభజనకు జస్టిస్ రామసుబ్రమణియన్‌ను మధ్యవర్తిగా నియమించాలని ఏపీ తరఫు ఏవోఆర్ మెహఫూజ్ నజ్కీ కోరారు. దీనికి తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సమయంలో కేంద్రం కౌంటరు దాఖలు చేయని విషయం ధర్మాసనం దృష్టికి రాగా... గతంలో నాలుగు వారాలు గడువు ఇచ్చినా ఇప్పటికీ దాఖలు చేయలేదా... అని ప్రశ్నించింది. మూడు వారాల్లోపు కౌంటరు దాఖలు చేయాలని, లేకుంటే జరిమానా విధిస్తామని కేంద్రం తరఫు న్యాయవాదికి తెలిపింది. కేంద్రం కౌంటరుపై రిజాయిండర్ దాఖలుకు మరో మూడు వారాలు గడువిస్తూ... తదుపరి విచారణను అక్టోబరుకు వాయిదా వేసింది.

బీఈ ఇంటిగ్రేటెడ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియా సంస్థ తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ సహకారంతో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఈఈఈ)లో బీఈ (ట్రైనింగ్ ఇంటిగ్రేటెడ్) డిగ్రీ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 11వ తేదీ వరకు పొడిగించామని పేర్కొన్నారు. ఇండస్ట్రీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఈ కోర్సును రూపొందించినట్లు వివరించారు. కాంచీపురంలోని విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో బీఈ (ట్రైనింగ్ ఇంటిగ్రేటెడ్) కోర్సు అందుబాటులో ఉందని వివరించారు. అర్హతలు, రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు https://cfa.annauniv.edu/cfa/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పాఠశాలల్లో సైన్స్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

సాక్షి, అమరావతి: విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేసే కేంద్రాలుగా సైన్స్ ల్యాబ్‌లను తీర్చిదిద్దాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. ఇటీవల పుణేలోని విజ్ఞాన ఆశ్రమం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్లను సందర్శించిన రాష్ట్ర, జిల్లా సైన్స్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పాఠశాలల్లోని స్టెమ్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌ల ద్వారా వినూత్న ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 30లోగా అన్ని యాజమాన్యాల్లోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 3 ప్రాజెక్టులను ఇన్‌స్పైర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

బాబును నమ్మితే సర్వనాశనమే: పోసాని



సాక్షి, అమరావతి : అమరావతి రైతులు చంద్రబాబును నమ్మితే సర్వనాశనం అయిపోతారని ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి హెచ్చరించారు. ప్రభుత్వం పేదలకు సెంటు భూమి ఇస్తే ఇళ్లు నిర్మించుకుండా కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకురావడం సిగ్గుచేటన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'పేదలకు సెంటు భూమిస్తే ఎవరి సొమ్ము ఎవరికిస్తారంటూ అమరావతి రైతులు ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు రైతులకు రూ.11వేల కోట్లకు పైగా రుణమాఫీ చేశారు. ఉచితంగా వ్యవసాయ కరెంట్ ఇచ్చారు. ఇందులో అమరావతి రైతులు కూడా లబ్ధిపొందారు. అప్పుడేమో బ్యాంకుల్లో పెట్టిన నగలను ఆనందంగా ఉచితంగా విడిపించి తెచ్చుకున్నారు.. అప్పుడెందుకు బాబు రుణమాఫీ వద్దని స్టే తీసుకురాలేదు. తన వర్గానికి మేలు జరుగుతుంటే ఒక న్యాయం. ఇతరులకు మేలు చేస్తుంటే మరొక న్యాయమా' అంటూ పోసాని మండిపడ్డారు.

సాగుకు 'సహకారం'

రైతన్నలకు చేరువలో బ్యాంకింగ్ వ్యవస్థతో తక్కువ వడ్డీకే రుణాలు: సీఎం జగన్

- వైఎస్సార్ హయాంలో సహకార రంగానికి రూ.1,850 కోట్లతో ఆర్థిక చేయూత..
- మహానేత మరణం తర్వాత మళ్లీ ఒడిదుడుకులు మొదలు.. గత నాలుగేళ్లలో సహకార రంగంలో పలు కీలక సంస్కరణలు
- రైతుల కోసం 1964 సహకార చట్టం సవరణ..
- పారదర్శకతకు పెద్దపీట.. డీసీసీబీల్లో ప్రొఫెషనల్స్
- కంప్యూటరైజేషన్, డిజిటలైజేషన్ దిశగా అడుగులు
- ఆప్కాబ్, డీసీసీబీలకు మూలధనంగా రూ.295 కోట్లు.. చరిత్రలో తొలిసారిగా డీసీసీబీలకు డివిడెండ్ పంపిణీ
- ప్రభుత్వ తోడ్పాటుతో రెట్టింపైన సహకార బ్యాంకుల పరపతి
- ఆప్కాబ్ పరపతి మూడు రెట్లు పెరుగుదల.. ఏలూరు మినహా మిగిలిన డీసీసీబీలన్నీ లాభాల బాటలోకి ..
- 'ఆప్కాబ్' వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొని నూతన లోగో ఆవిష్కరించిన ముఖ్యమంత్రి



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఆప్కాబ్ నూతన లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

తొలిసారిగా డీసీసీబీలకు డివిడెండ్

"రాష్ట్రంలో సహకార విప్లవంతో బ్యాంకింగ్ వ్యవస్థ రైతన్నలకు చేరువగా అడుగులు వేసింది. చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో సహకార రంగం బలోపేతమై ఆధునికీకరణ సంతరించుకుంటోంది. తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తూ అన్నదాతలకు చేదోడుగా నిలుస్తోంది"

"బ్యాంక్ చరిత్రలో తొలిసారిగా డీసీసీబీలకు డివిడెండ్ ఇచ్చే కార్యక్రమం మన ప్రభుత్వ హయాంలో జరుగుతున్నందుకు గర్వంగా ఉంది. ఆప్కాబ్ ఇంకా గొప్పగా ఎదిగి రైతన్నలకు మరింత మంచి చేసే అవకాశం ఇవ్వాలని ఆ దేవుడిని కోరుకుంటున్నా"

– సీఎం వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

సాక్షి అమరావతి: సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఆప్కాబ్‌ను నిలబెట్టిన ఘనత దివంగత వైఎస్సార్‌కే దక్కుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైద్యనాథన్ సిఫార్సులను ఆమోదించి సహకార పరపతి వ్యవస్థ బలోపేతం కోసం రూ.1,850 కోట్లు ఇచ్చిన తొలి రాష్ట్రంగా ఉమ్మడి ఏపీకి వైఎస్సార్ గుర్తింపు తెచ్చారని చెప్పారు. ఆప్కాబ్ (ద ఏపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్) ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు సీఎం జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆప్కాబ్ నూతన లోగో, ఆప్కాబ్ బ్రాండ్ ఐడెంటిటీ గైడ్‌లైన్స్ (బీఐజీ) బిగ్ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. డీసీసీబీలకు రూ.55.93 కోట్ల డివిడెండ్‌ను పంపిణీ చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన డీసీసీబీలు, పీఏసీఎస్, బ్రాంచ్‌లు, ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

ఆ ఒక్క మార్పుతో..

ఆప్కాబ్ షష్టి పూర్తి సందర్భంగా సహకార రంగ చరిత్రలో ఈ రోజుకు ఎంతో ప్రత్యేకత ఉంది. రైతులకు అండగా నిలుస్తూ బ్యాంకింగ్ సేవలతో ఆప్కాబ్ 60 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడిన పరిస్థితి చూస్తే చాలా గొప్పగా ఉంది. బ్యాంకును ఈ స్థాయికి తెచ్చేందుకు కృషి చేసిన యాజమాన్యానికి, బ్యాంకు కార్యకలాపాల్లో పాలు పంచుకుంటున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు. మన దేశంలో రైతు అప్పుల్లోనే పుడతాడు.. అప్పుల్లోనే పెరుగుతాడు.. అప్పుల్లోనే చనిపోతారని ఒకప్పుడు నానుడి ఉండేది. దీనికి కారణం విత్తనం నుంచి పంట కోత వరకు అన్నింటికీ పెట్టుబడి అవసరం. అందుకోసం రైతన్నలు అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఆ అప్పులకు వడ్డీలు కట్టలేక రైతన్నలు అవస్థలు పడుతున్న పరిస్థితుల వల్ల ఈ నానుడి వచ్చింది. అప్పుడు.. విప్లవంలా ఒక మార్పు జరిగింది. అదేమిటంటే.. ఎప్పుడైతే రైతులకు దగ్గరగా బ్యాంకింగ్ వ్యవస్థ అడుగులు వేసిందో అప్పుడు తక్కువ వడ్డీకే రుణాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఒక్క మార్పుతో వ్యవసాయంలో రైతన్నలు నిలదొక్కుకునే పరిస్థితి వచ్చింది. ఈ మార్పును మరింత ముందుకు తీసుకెళ్తూ మన రాష్ట్రంలో ఆప్కాబ్ అనే కోపరేటివ్ బ్యాంకు వచ్చింది. ఒక చారిత్రక అవసరంతో ఏర్పడ్డ ఈ బ్యాంకు రైతన్నలను చేయి పట్టుకుని నడిపించింది. ఈ క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందికర పరిస్థితులను చవి చూసింది.

సహకార చట్ట సవరణ.. ఆర్థిక చేయూత

ఆప్కాబ్‌ను మెరుగైన స్థితికి చేర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసే బాధ్యతను 2019 అక్టోబర్‌లో నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీస్ నాబ్‌కాన్స్‌కు అప్పగించాం. వారు ప్రతి బ్యాంకుకూ వెళ్లి ఏడాది పాటు క్షుణ్నంగా అధ్యయనం అనంతరం కొన్ని సూచనలు, సలహాలు అందించారు. వాటిని పరిగణలోకి తీసుకుంటూ సహకార సంఘాలు, రైతుల ప్రస్తుత పరిస్థితి, అవసరాలకు అనుగుణంగా 1964 సహకార చట్టాన్ని సవరించాం. కో ఆపరేటివ్ గవర్నెన్స్‌ను మరింత మెరుగుపరుస్తూ ఆప్కాబ్, డీసీసీబీ బోర్డుల్లో ప్రొఫెషనల్స్ ఉండేలా చర్యలు చేపట్టాం. దీనివల్ల పారదర్శకత, సామర్థ్యం పెరుగుతుంది. ప్రొఫెషనల్స్ డైరెక్టర్లుగా బ్యాంకుల్లో బాధ్యతలు తీసుకోవడంతో రాజకీయ కార్యకలాపాలు తగ్గే పరిస్థితి వచ్చింది. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ డీసీసీబీ సీఈవోల ఎంపిక కోసం రాష్ట్రస్థాయిలో కామన్ ఎంపిక కమిటీని ఏర్పాటు చేశాం. దాని ద్వారా సీఈవోల ఎంపిక, నియామకం చేపట్టడం ద్వారా మరింత ప్రొఫెషనలిజం తెచ్చాం. ఆర్బీఐ నిబంధనల ప్రకారం మూలధనాన్ని సమకూర్చుకోలేని డీసీసీబీలకు, ఆప్కాబ్‌కు గతేడాది రూ.295 కోట్లు షేర్ క్యాపిటల్ రూపంలో ఆర్థిక చేయూతనిచ్చాం. ఇవన్నీ ఆప్కాబ్‌ను బలోపేతం చేసే దిశగా అడుగులు వేసేందుకు దోహదపడ్డాయి.

పెరిగిన పరపతి.. లాభాల బాట

సహకార వ్యవస్థలో పారదర్శక, సమర్థతను పెంపొందించేందుకు కంప్యూటరైజేషన్ తీసుకొచ్చాం. టీసీఎస్ సహకారంతో కంప్యూటరైజేషన్, డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సహకార పరపతి సంఘాల వ్యవస్థ గణనీయంగా అభివృద్ధి చెందింది. 2019 నుంచి నాలుగేళ్ల వ్యవధిలో సహకార బ్యాంకుల వాణిజ్య కార్యకలాపాలు 24 శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. ఆప్కాబ్ లావాదేవీలు గణనీయంగా విస్తరించాయి. 2019 మార్చి 31 నాటికి రూ.53,249 కోట్లుగా ఉన్న సహకార బ్యాంకుల పరపతి ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.1,05,089 కోట్లకు చేరింది. అంటే నాలుగేళ్లలో ఏకంగా రెట్టింపైన పరిస్థితి కనిపిస్తోంది. 2019లో రూ.13,700 కోట్లుగా ఉన్న ఆప్కాబ్ పరపతి 2023 మార్చి నాటికి ఏకంగా రూ.36,700 కోట్లకు పెరిగింది. అంటే మూడు రెట్లు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఏలూరు మినహా మిగతా డీసీసీబీలన్నీ లాభాల్లో నడుస్తున్నాయని చెప్పేందుకు గర్వపడుతున్నా. అంతేకాదు.. 36 ఏళ్ల తర్వాత కర్నూలు డీసీసీబీ, 28 ఏళ్ల తర్వాత వైఎస్సార్ కడప జిల్లా డీసీసీబీలు లాభాల్లోకి వచ్చిన పరిస్థితిని ఈరోజు మనం చూస్తున్నాం. గొప్పగా అడుగులు వేసిన సిబ్బంది, యాజమాన్యానికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నా. డిజిటలైజేషన్ పూర్తి కావడం ద్వారా ఆప్కాబ్, డీసీసీబీలు మరింత బలోపేతమై ఈరోజు మనం చూస్తున్న మార్పులే కాకుండా ఇంకా మెరుగైన ఫలితాలు రానున్న రోజుల్లో కనిపిస్తాయి. ఇందుకోసం రూ.25 కోట్లు కేటాయించాం. కంప్యూటరైజేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఆప్కాబ్ సేవలు రైతులందరికీ విస్తరించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఆర్బీకేల స్థాయిలో అన్నీ..

ఇవాళ సాగైన ప్రతి పంటను నమోదు చేసేందుకు ఆర్బీకేల స్థాయిలో ఈ – క్రాపింగ్ జరుగుతోంది. ఆర్బీకేల స్థాయిలో వ్యవసాయ యాంత్రీకరణ తీసుకొచ్చాం. రైతులు గ్రూప్‌గా ఏర్పడి పది శాతం చెల్లిస్తే చాలు 40 శాతం బ్యాంకు రుణాలు, 50 శాతం సబ్సిడీగా ఇస్తూ తోడుగా నిలుస్తున్నాం. ఆర్బీకే స్థాయిలోనే అన్ని రకాల వ్యవసాయ యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చాం. వీటి కోసం ఆప్కాబ్ రూ.500 కోట్లు రుణాలు మంజూరు చేసింది.

ప్రభుత్వ సహకారం ప్రశంసనీయం: జేపీ

ఆప్కాబ్ మాజీ ఎండీ, లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ తాను ఆప్కాబ్ ఎండీగా ఉన్నప్పుడు సహకార రంగంలో సంస్కరణలు తేవాలని ప్రయత్నించానని, కానీ అప్పటి ప్రభుత్వాలు సహకరించలేదన్నారు. నాడు కేవలం 8 శాతానికి మించి రికవరీ చేయలేకపోయేవాళ్లమని, నేడు 80 శాతానికి పైగా రికవరీ సాధిస్తున్నారని చెప్పారు. సహకార వ్యవస్థ బలంగా ఉండాలన్న ఆకాంక్షతో ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు నిజంగా ప్రశంసనీయమని అన్నారు.

ఆర్బీకేలతో పీఏసీఎస్‌ల అనుసంధానం..

వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో (పీఏసీఎస్) అనుసంధానం చేయడంతో మరో గొప్ప మార్పు చోటు చేసుకుంది. ఆ తర్వాత డీసీసీబీలతో అనుసంధానించే ప్రక్రియ జరుగుతోంది. మిగతా బ్యాంకుల సహకారంతో ఈరోజు ప్రతి ఆర్బీకేలో బ్యాంకింగ్ కరస్పాండెంట్లను అందుబాటులోకి తెచ్చాం. కంప్యూటరైజేషన్, డిజిటలైజేషన్, బ్యాంకింగ్ కరస్పాండెంట్లు, ఆర్బీకేలతో 'ప్యాక్స్' అనుసంధానం.. ఇవన్నీ గ్రామ స్థాయిలో విప్లవాత్మక మార్పులకు నిదర్శనంగా నిలుస్తాయి. తద్వారా రైతులకు ఆర్బీకేల వద్దే వ్యవసాయ ఇన్‌పుట్స్‌తో పాటు రుణ పరపతి పొందే పరిస్థితి కూడా వస్తుందని గట్టిగా చెబుతున్నా.

రైతు.. గ్రామం బాగుండాలంటే

రైతు, గ్రామం రెండూ బాగుండాలంటే వ్యవసాయంతో పాటు ఆర్థిక స్వావలంబనపై ఆధారపడి ఉంటుంది. మన రైతన్నలు, అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా ఎదగగలిగితే గ్రామీణ వ్యవస్థ బతుకుతుంది. ఇలా అక్కచెల్లెమ్మలకు మంచి చేసే గొప్ప అడుగు ఆప్కాబ్ ద్వారా పడింది. పాడి, పంట సమృద్ధిగా పెరిగాయి. మనం అందచేస్తున్న వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ వీటన్నింటిని బ్యాంకులతో అనుసంధానించి ఆ డబ్బులను సరైన పద్ధతిలో వాడుకోవడం, అమూల్ లాంటి సంస్థ గ్రామ స్థాయిలోకి రావడం ద్వారా రైతన్నలు, అక్కచెల్లెమ్మలు మోసపోకుండా డబ్బులు సంపాదించుకునే పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు 12 శాతం లేదా అంతకంటే ఎక్కువ వడ్డీకి రుణాలిస్తున్న పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు ఆప్కాబ్ అన్ని రంగాల్లో విస్తరించడంతో గ్రామస్థాయిలో రుణాలు ఇప్పించగలిగే స్థితిలోకి వచ్చింది.

దేశంలోనే భారీ నెట్‌వర్క్

ఆప్కాబ్, డీసీసీబీలు, ప్యాక్స్‌తో అనుసంధానమైన ఆర్బీకేలు.. ఇలాంటి పంపిణీ వ్యవస్థ బహుశా దేశ చరిత్రలో ఏ బ్యాంకుకూ లేని విధంగా రానున్న రోజుల్లో మన ఆప్కాబ్‌కు మాత్రమే ఉంటుంది. వీటన్నింటికి తోడు ఆర్బీకేల్లోనే బ్యాంకింగ్ కరస్పాండెంట్లు ఉన్నారు. దీనివల్ల భారీ మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రతి గ్రామంలో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు సిద్ధమవుతున్నాయి. గ్రామ స్థాయిలోకి ఫైబర్ గ్రిడ్ చేరుకుంటుంది. ఇవన్నీ గొప్ప మార్పులకు శ్రీకారం చుట్టినట్లవుతుంది.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు..

మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జోగి రమేష్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ, నాఫ్‌స్కాబ్ ఎండీ బీమా సుబ్రహ్మణ్యం, నాబార్డు సీజీఎం ఆర్‌ఎం గోపాల్, సహకార మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, సహకార శాఖ రిజిస్ట్రార్ అహ్మద్‌బాబు, ఆప్కాబ్ ఎండీ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ, 13 జిల్లాల డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ బ్యాంకుగా కేడీసీసీబీ

సాక్షి, అమరావతి: ఆప్కాబ్ వజ్రోత్సవాల సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన బ్యాంక్‌లు, బ్రాంచ్‌లు, పీఏసీఎస్‌లు, ఉద్యోగులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవార్డులు ప్రదానం చేశారు. అన్ని విభాగాల్లో అత్యుత్తమ డీసీసీబీగా కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అవార్డు కైవసం చేసుకోగా, రీజనల్ స్థాయిలో ఉత్తమ డీసీసీబీలుగా శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు డీసీసీబీలు అవార్డులు పొందాయి. అవుట్‌స్టాండింగ్ పనితీరుతో ఉత్తమ బ్రాంచ్‌లుగా ఏటీ అగ్రహారం, రామవరప్పాడు, తిరుపతి బ్రాంచ్‌లు నిలవగా, స్పెషల్ అప్రిషియేషన్‌గా కరెన్సీనగర్, కానూరు, గొల్లపూడి బ్రాంచ్‌లు నిలిచాయి. ఇక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో టాప్–3 స్థానాల్లో 39 పీఏసీఎస్‌లకు అవార్డులను అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగుల్లో ఒక సీనియర్ మేనేజర్, ఏడుగురు మేనేజర్లు, ఐదుగురు స్టాఫ్ అసిస్టెంట్లు అవార్డులు అందుకున్నారు. వజ్రోత్సవాల సందర్భంగా ఆప్కాబ్ పేరిట పోస్టల్ స్టాంప్‌ను మంత్రి కాకాణి ఆవిష్కరించగా, ఆప్కాబ్ వెబ్‌సైట్‌ను సహకార శాఖ రిజిస్ట్రార్ అహ్మద్‌బాబు ప్రారంభించారు. పీఏసీఎస్, డీసీసీబీల స్టాటిస్టికల్ పబ్లికేషన్స్‌ను ఆప్కాబ్ మాజీ ఎండీ జయప్రకాష్ నారాయణ, నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్ ఆవిష్కరించారు.

క్యాన్సర్ బాధిత చిన్నారికి సీఎం వైఎస్ జగన్ భరోసా

- తక్షణం సాయం చేయాలని జేసీకి ఆదేశం
- బాధితురాలి కుటుంబానికి లక్ష రూపాయల చెక్కు అందజేత




సమస్యను సీఎంకు నివేదిస్తున్న బాధిత కుటుంబం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కంటి క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారిని చూసి సీఎం వైఎస్ జగన్ చలించిపోయారు. పాప వైద్యానికి తక్షణ సాయం అందించాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో జేసీ బాధిత కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందించారు. విజయవాడ మధురానగర్‌లో శ్యామలాదేవి, శ్రీనివాసరావు దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి 14 నెలల కుమార్తె జ్ఞానవిక ఉంది. పాప కంటి క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. ఇక పాప వైద్యానికి ఖర్చు చేసేంత ఆర్థిక స్తోమత లేక కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం నగరానికి సీఎం వైఎస్ జగన్ వస్తున్న విషయం తెలుసుకొని ఆయనను కలిసేందుకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి పాప తల్లిదండ్రులను సీఎం వద్దకు తీసుకెళ్లారు. వారు తమ పాప ఆరోగ్య పరిస్థితిని సీఎంకు వివరించారు. పాప పరిస్థితి చూసి చలించిపోయిన సీఎం వైఎస్ జగన్ చిన్నారి వైద్యానికి తక్షణం ఆర్థిక సాయం అందించాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్‌ను ఆదేశించారు.ఈ మేరకు జేసీ తన కార్యాలయంలో చిన్నారి తల్లిదండ్రులకు రూ.లక్ష చెక్కును అందజేశారు.

ఏ పార్టీ కూడా వైఎస్సార్‌సీపీ దరిదాపులకు రాలేదు

- 'వారాహి'ని ప్రజలు పట్టించుకోవడం మానేశారు : వైవీ సుబ్బారెడ్డి
- వైనాట్ పులివెందుల అని చంద్రబాబు అంటుంటే జనం నవ్వుతున్నారు : మంత్రి రజిని



సాక్షి, విశాఖపట్నం : పవన్‌కళ్యాణ్ ఎందుకు యాత్ర చేస్తున్నారో ఆయనకే తెలియదని, అందుకే ప్రజలు కూడా పవన్‌ను పట్టించుకోవడం మానేశారని టీటీడీ చైర్మన్, ఉమ్మడి విశాఖ వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఎద్దేవా చేశారు. విశాఖ కలెక్టరేట్‌లో నిర్వహించిన భీమిలి, విశాఖ పశ్చిమ, పెందుర్తి నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజినితో కలిసి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఉత్తరాంధ్రలో 9వ తేదీన వారాహి యాత్ర అని వస్తున్న వార్తలపై సుబ్బారెడ్డి మీడియాతో స్పందిస్తూ.. ఎన్ని ముహూర్తాలు పెట్టుకున్నా ఒరిగేదేమీ లేదని, వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ కూడా వైఎస్సార్‌సీపీ దరిదాపులకు వచ్చే అవకాశమే లేదని స్పష్టం చేశారు. నాలుగేళ్లలో ఏపీలో జరుగుతున్న అభివృద్ధి టీడీపీ నేతలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఏడాది కాలంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు, ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన, నిర్మాణ పనుల గురించి టీడీపీ నేతలకు నోరెందుకు పెగలడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు మాదిరిగా శిలా ఫలకాల స్థాయిలో ఏ పనీ ఆగదని, అనుకున్న సమయానికి ప్రతి పనీ పూర్తిచేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ సంకల్పమన్నారు. ఇటీవల వలంటీర్ ఒక వృద్ధురాల్ని హత్య చేశారంటూ బురద జల్లే కార్యక్రమాన్ని టీడీపీ ప్రారంభించిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేస్తే.. నిందితుడిని వలంటీర్ విధుల నుంచి ఎప్పుడో తొలగించేశారని తెలిసి మిన్నకుండిపోయారని చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భారీగా పెట్టుబడులు రావడమే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధికి నిదర్శనమని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే పెట్టుబడిదారులు ముందుకొస్తున్నారని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు.

చంద్రబాబు జోక్‌లు వేస్తున్నారు : మంత్రి రజిని



ఊరూరా తిరుగుతూ వైనాట్ పులివెందుల అంటూ చంద్రబాబు వేస్తున్న పెద్ద జోక్‌లకు ప్రజలు పగలబడి నవ్వుతున్నారని వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల తర్వాత చంద్రబాబు అండ్ కో అడ్రస్ గల్లంతవుతుందన్న విషయం ఏపీ ప్రజలందరికీ తెలుసన్నారు. ఆ విషయం తెలిసే.. ప్రభుత్వంపై బురద జల్లేందుకు దత్తపుత్రుడితో కలిసి చంద్రబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుంటే.. తమ హయాంలో ఏమీ చేయలేకపోయామన్న దుగ్ధతో టీడీపీ నేతలు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

'అసైన్డ్' రాత మారింది

అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు

- చట్ట సవరణకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం
- కేటాయించి 20 ఏళ్లు పూర్తయిన భూములపై రైతులకు సర్వ హక్కులు
- 1954 నుంచి 2003 లోపు ఇచ్చిన భూములు 28 లక్షల ఎకరాలకుపైనే
- కేటాయించి పదేళ్లు దాటితే ఇళ్ల స్థలాలపైనా యాజమాన్య హక్కులు
- చట్ట సవరణలో అది కూడా పొందుపరిచిన ప్రభుత్వం
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 'అసైన్డ్'పై విప్లవాత్మక నిర్ణయం

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూముల రైతుల తలరాతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమూలంగా మార్చేసింది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అసైన్డ్ భూములు పొందిన పేదలకు వాటిపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాన్ని అమల్లోకి తెచ్చింది. అసైన్డ్ భూములు కేటాయించి (అసైన్ చేసి) 20 ఏళ్లు పూర్తయితే వాటిని పొందిన వారికి ఆయా భూములపై యాజమాన్య హక్కులను కల్పించింది. ఈమేరకు 1977 ఏపీ అసైన్డ్ భూముల చట్టం (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) సవరణను ఆమోదిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆర్డినెన్స్ జారీ చేశారు.

మంత్రివర్గ కమిటీ సిఫారసు మేరకు

భూమి లేని నిరుపేదలు వ్యవసాయం చేసుకుని దానిపై వచ్చే ఆదాయంతో జీవించేందుకు ప్రభుత్వాలు భూమిని కేటాయిస్తాయి. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత రాష్ట్రంలో ఇలా లక్షల ఎకరాలను పేదలకు ఇచ్చారు. వాటికి చట్టపరంగా రక్షణ కల్పించేందుకు 1977లో అసైన్డ్ భూముల చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం ప్రభుత్వం అసైన్ చేసిన భూములపై అమ్మకాలు, కొనుగోళ్లు జరిపే అవకాశం లేకుండా నిషేధం విధించారు. దీంతో అత్యవసర సమయాల్లో భూమిని విక్రయించుకునేందుకు నిరుపేదలకు అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో భూములపై తమకు యాజమాన్య హక్కులు కల్పించాలంటూ నిరుపేద అసైన్డ్ రైతుల నుంచి ప్రభుత్వానికి చాలాసార్లు వినతులు వచ్చాయి. ఈ క్రమంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో నలుగురు మంత్రులు, ఎమ్మెల్యేలతో గతేడాది సెప్టెంబర్ 30న కమిటీని నియమించిన రాష్ట్ర ప్రభుత్వం దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై విస్తృతంగా అధ్యయనం చేసిన కమిటీ అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించిన తమిళనాడు, కర్ణాటకలో పర్యటించి అక్కడి విధానాలను పరిశీలించింది. అసైన్డ్ భూములపై హక్కులు కల్పించిన కేరళలో కూడా అధ్యయనం చేసింది. వాటన్నింటినీ పరిశీలించడంతోపాటు రాష్ట్రంలో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కేటాయించి 20 ఏళ్లు పూర్తయితే సంబంధిత రైతులకు అసైన్డ్ భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది. ప్రభుత్వం ఎవరికి భూమి కేటాయించిందో వారికే యాజమాన్య హక్కులు ఇవ్వాలని స్పష్టం చేసింది.

జిల్లాలవారీగా జాబితాలు..

కమిటీ సిఫారసులను ఆమోదించిన మంత్రివర్గం అందుకు అనుగుణంగా అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించాలని తీర్మానించింది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేనందున వెంటనే చట్ట సవరణ కోసం ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రభుత్వం అసైన్ చేసిన వ్యవసాయ భూములతోపాటు పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలకు సైతం ఇది వర్తిస్తుందని సవరణ చట్టంలో స్పష్టం చేశారు. కేటాయించి పదేళ్లు దాటితే ఆయా ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు లభిస్తాయి. దీనిపై 2021లోనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా ఇప్పుడు చట్టంలోనూ అందుకు వీలు కల్పించింది. వ్యవసాయ భూములైతే కేటాయించిన 20 ఏళ్లకు, ఇళ్ల స్థలాలైతే కేటాయించి పదేళ్లు పూర్తయిన వెంటనే వాటిపై సంబంధిత రైతులు, పేదలు, వారి వారసులకు యాజమాన్య హక్కులు లభిస్తాయి. వ్యవసాయేతర భూములను అనుకుని ఏవైనా అసైన్డ్ భూములు ఉంటే వాటిని అమ్ముకున్నప్పుడు ప్రస్తుత బేసిక్ మార్కెట్ విలువ చెల్లించాల్సి ఉంటుంది. చట్టం అమలుకు సంబంధించి ప్రభుత్వం విధి విధానాలను విడుదల చేయనుంది. వాటి ప్రకారం జిల్లాలవారీగా 20 ఏళ్లు పూర్తయిన అసైన్డ్ భూముల జాబితాను రూపొందిస్తారు.

▲ 1954 నుంచి 2014 వరకు రాష్ట్రంలో 33.29 లక్షల ఎకరాలను పేదలకు అసైన్ చేశారు. తాజా చట్ట సవరణ ప్రకారం 2003కి ముందు ఇచ్చిన భూములన్నింటిపైనా యాజమాన్య హక్కులు లభిస్తాయి. 1954 నుంచి 2003 వరకు 28 లక్షల ఎకరాలకుపైగా భూములను పేదలకివ్వగా వారంతా ఇప్పుడు లబ్ధి పొందనున్నారు.


సంజీవకుమార్

ఓ సాధారణ పట్టణంలో పుట్టి పెరిగాడతడు.
కంప్యూటర్ కోర్సు కోసం హైదరాబాద్ వచ్చాడతడు.
నేర్చుకున్నాడు... తను నేర్చిన విద్యను
ఇతరులకు నేర్పించేపనిలో మునిగిపోయాడు.
ఎదుగుతున్నాననుకున్నాడు... అగాధంలోకి జారిపోయాడు.
ఫుట్ పాత్ మీదే నిద్ర... అతడిని మార్చిన రోజది.

దారి చూపిన ఫుట్ పాత్

సంజీవకుమార్ పుట్టింది, పెరిగింది మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో. పాలిటెక్నిక్, ఐటీఐ, గ్రాడ్యుయేషన్ పట్టా పుచ్చుకునే నాటికి సమాజంలో సాంకేతికంగా మరో విప్లవం మొదలైంది. అదే కంప్యూటర్ ఎడ్యుకేషన్. రాబోయే కాలంలో కంప్యూటర్ లేనిదే ఏ పనీ చేయలేమని తెలుసుకున్నాడు సంజీవ్‌కుమార్. హైదరాబాద్‌కు వచ్చి డీటీపీతో మొదలు పెట్టి డీసీఏ, పీజీడీసీఏ, పీజీ డీఎస్‌ఈ వరకు అప్పటికి అందుబాటులో ఉన్న కోర్సులన్నీ చేశాడు. తన మీద నమ్మకం పెరిగింది. సైబర్‌టెక్ పేరుతో నల్ల కుంటలో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ స్థాపించాడు. కంప్యూటర్స్‌లో ప్రపంచాన్ని ఆందోళనలో ముంచెత్తిన వైటూకే సమస్య సద్దుమణిగింది. కానీ అంతకంటే పెద్ద ఉత్పాతం సంజీవకుమార్ జీవితాన్ని ఆవరించింది. ఆ వివరాలను సాక్షితో పంచుకున్నాడతడు.

ఫుట్‌పాత్ మీద కొత్త ఉపాధి!

కంప్యూటర్ సెంటర్‌లను అమ్మేసిన తర్వాత కన్సల్టెంట్‌గా మారాను. తార్నాకలోని సన్మాన్ హోటల్ ముందున్న ఫుట్ పాతే నా వర్క్ ప్లేస్. నా భుజాన ఒక్క బ్యాగ్‌తో పాన్ కార్డ్ సర్వీస్ రూపంలో జీవితం కొత్తగా మొదలైంది. రోజుకు వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు వచ్చేవి. నెలకు రెండు వేల అద్దెతో ఒక గదిలో 'స్కై క్రియేషన్స్' పేరుతో సర్వీస్‌ను రిజిస్టర్ చేశాను. పాన్ కార్డు నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్ సర్వీస్‌లు, ప్లేస్‌మెంట్‌ల వరకు సర్వీస్‌లను విస్తరించాను. పద్మారావు నగర్‌లో ఓ చిన్న ఫ్లాట్ కొనుకున్న తర్వాత స్కై ఫౌండేషన్ పేరుతో సామాజిక సేవ మొదలు పెట్టాను. అద్దె ఇంట్లో ఫౌండేషన్ రిజిస్టర్ చేయాలంటే ఇంటి యజమాని అనుమతించరు. కాబట్టి సొంత గూడు ఒకటి ఏర్పరుచుకునే వరకు ఆగి అప్పటి నుంచి వీధి పాలైన జీవితాల కోసం పని చేయడం మొదలు పెట్టాను.

- సంజీవకుమార్, ఫౌండర్, స్కై ఫౌండేషన్, హైదరాబాద్




ఫుట్‌పాత్ మీద ఉండేవారికి కరోనా వ్యాక్సిన్ వేయించడం : వీధి బాలలకు పుట్టినరోజు వేడుక

అప్పు మిగిలింది!

''నా మీద నాకున్న నమ్మకం, దానికితోడు అందరినీ నమ్మడం నా జీవిత గమనాన్ని మార్చేశాయి. నా మీద నమ్మకంతో కంప్యూటర్ సెంటర్‌లు ప్రారంభించాను. స్నేహితుల మీద నమ్మకంతో పదకొండు బ్రాంచ్‌లకు విస్తరించాను. కొన్ని బ్రాంచ్‌ల నిర్వహణ స్నేహితులకప్పగించాను. కొందరు స్నేహితులు పెట్టుబడి కోసం డబ్బు అప్పు ఇచ్చి సహకరించారు. నా పెళ్లి కోసం ఒకటిన్నర నెలలు మా ఊరెళ్లాను. పెళ్లి చేసుకుని హైదరాబాద్‌కి వచ్చేటప్పటికి పరిస్థితి తారుమారుగా ఉంది. ఫ్రాంచైసీలు తీసుకున్న స్నేహితులు మోసం చేశారు. నా కళ్ల ముందు తొంబై ఐదు లక్షల అప్పు. నా భార్య బంగారం, నేను నిర్వహిస్తున్న కంప్యూటర్ సెంటర్‌లను అమ్మేసి కూడా ఆ అప్పు తీరలేదు. అప్పు ఇచ్చిన స్నేహితుల నుంచి ఒత్తిడి పెరిగింది. నా భార్యను పుట్టింట్లో ఉంచి హైదరాబాద్‌కొచ్చాను. నా దగ్గర డబ్బున్నప్పుడు నా చుట్టూ ఉన్న వాళ్లెవరూ నాకు ఒక్కరోజు అన్నం కూడా పెట్టలేదు. ఆకలితో ఫుట్‌పాత్ మీద పడుకున్న రోజును నా జీవితంలో మర్చిపోలేను. డబ్బులేని మనిషికి విలువ లేదని తెలిసి వచ్చిన క్షణాలవి. మరి ఫుట్‌పాత్ మీదనే బతికేవాళ్ల పరిస్థితి ఏమిటి... అనే ఆలోచన మొదలైన క్షణం కూడా అదే.

వైద్యం... ఆహారం!

నేను స్కై ఫౌండేషన్ స్థాపించింది 2012లో. అప్పటి నుంచి వీధుల్లో బతికే వాళ్లకు ప్రతి ఆదివారం అన్నం పెట్టడం, మందులివ్వడం, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నాను. ఆఫీస్‌లోనే వండి రెండు వందలకు పైగా పార్సిళ్లతో మా వ్యాన్ బయలుదేరుతుంది. వాటిని ఫుట్‌పాత్ మీద, చెట్టుకింద పడుకున్న వాళ్లకు ఇస్తాం. అలాగే ప్రతి బిడ్డా పుట్టిన రోజు పండుగనూ, కేక్ కట్ చేసిన ఆనందాన్ని ఆస్వాదించాలనే ఉద్దేశంతో పిల్లలకు సామూహికంగా పుట్టిన రోజులు చేస్తున్నాను. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజు పిల్లల చేత జెండావందనం చేయిస్తాను. కోఠీలో పాత పుస్తకాలు తెచ్చి పంచుతాను. వీటన్నింటికంటే నేను గర్వంగా చెప్పుకోగలిగిన పని వీళ్లందరికీ కరోనా వ్యాక్సిన్ వేయించడం. ఫుట్‌పాత్‌ల మీద బతుకీడ్చే వాళ్లకు ఆధార్ కార్డు ఉండదు, మొబైల్ ఫోన్ ఉండదు. కరోనా వ్యాక్సిన్ వేయాలంటే ఈ రెండూ ఉండాలి. కేంద్ర ప్రభుత్వానికి తెలియచేసి ప్రత్యేక అనుమతి తీసుకుని వాళ్లందరికీ వ్యాక్సిన్ వేయించాను. కరోనా సమయంలో సేవలందించిన వైద్యులకు, వైద్య సిబ్బందికి సన్మానం చేశాను.

ఒక్క అవకాశమివ్వండి!

వీధుల్లో బతుకు వెళ్లదీసే వాళ్లకు తాత్కాలికంగా అన్నం పెట్టడం, దుస్తులివ్వడం శాశ్వత పరిష్కారం కాదు. ఈ బతుకులు రోడ్డు పక్కనే ఉండిపోకూడదంటే వాళ్లకు బతుకుదెరువు చూపించాలి. ప్రభుత్వాలు వాళ్లను షెల్టర్ హోమ్‌లో ఉంచి ఆహారం పెట్టడంతో సరిపెట్టకూడదు. చిన్న చిన్న పనుల్లో శిక్షణ ఇచ్చి సమాజంలోకి పంపించాలి. వడ్రంగం, బుక్ బైండింగ్, అగరుబత్తీల తయారీ, విస్తరాకుల కటింగ్ వంటి చిన్న పనులు నేర్పించినా చాలు. వాళ్లకు ఒక దారి చూపించినవాళ్లమవుతామని ప్రభుత్వానికి ఎన్నోసార్లు వినతి పత్రాలిచ్చాను. పైలట్ ప్రాజెక్టుగా ఒక ఏరియాకి బాధ్యత ఇవ్వండి. విజయవంతం చేసి చూపిస్తానని కూడా తెలియచేశాను. అలా చేయగలిగినప్పుడు వీధి జీవితాలు ఇంటివెలుగులవుతాయి'' అన్నారు సంజీవకుమార్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

'ఎఫ్‌బీఐలో పనిచేయడం అదృష్టం' అంటాడు
ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) మాజీ డైరెక్టర్ రాబర్ట్ ముల్లర్.
'ఎఫ్‌బీఐ'లో రెండు దశాబ్దాల అనుభవం ఉన్న ఇండో-అమెరికన్
సోహిని సిన్హా ఎప్పుడూ అదృష్టాన్ని నమ్ముకోలేదు.
కష్టాన్నే ఇష్టంగా నమ్ముకుంది.
ఎఫ్‌బీఐలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎన్నో స్థాయిలలో పనిచేసింది.
తాజాగా సోహిని సిన్హాను ఎఫ్‌బీఐ సాల్ట్‌లేక్ సిటీ ఫీల్డ్ ఆఫీస్
స్పెషల్ ఏజెంట్ ఇన్‌చార్జిగా నియమించింది...

న్యూస్‌మేకర్

తిరుగులేని ఏజెంట్


సోహిని సిన్హా

ఎఫ్‌బీఐలో సోహిని సిన్హాకు రెండు దశాబ్దాల అనుభవం ఉంది. కౌంటర్-టెర్రరిజం ఇన్వెస్టిగేషన్‌లో మంచి పేరు తెచ్చుకుంది. భద్రతకు సంబంధించిన సంక్లిష్టమైన అంశాలను హ్యాండిల్ చేయడంలో, క్రిమినల్ సైబర్ ఇన్వెస్టిగేషన్‌లో దిట్టగా పేరున్న సోహిని సిన్హా తన వృత్తిపరమైన అంకితభావంతో ఎన్నో ప్రమోషన్‌లు పొందింది.

2001లో ఎఫ్‌బీఐలో స్పెషల్ ఏజెంట్‌గా చేరిన సిన్హా 2009లో సూపర్‌వైజరీ స్పెషల్ ఏజెంట్‌గా నియామకం అయింది. ఆ తరువాత వాషింగ్టన్ డీసీలోని కౌంటర్-టెర్రరిజం విభాగానికి బదిలీ అయింది. 2012లో అసిస్టెంట్ లీగల్ అటాషెగా ప్రమోట్ అయింది. కౌంటర్ టెర్రరిజమ్‌కు సంబంధించిన వ్యవహారాల్లో రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్, కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్‌లతో కలిసి పనిచేసింది.

ఆ తరువాత ఫీల్డ్ సూపర్‌వైజర్ (డెట్రాయిట్ ఫీల్డ్ ఆఫీస్)గా ప్రమోట్ అయింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ ఉగ్రవాదానికి సంబంధించిన సంక్లిష్టమైన కేసులను ఇన్వెస్టిగేట్ చేసింది.

2020లో సైబర్ ఇన్‌ట్రూజన్ స్క్వాడ్‌లో చేరింది. తన నాయకత్వ సమర్థతతో 2021లో నేషనల్ సెక్యూరిటీ మ్యాటర్స్, క్రిమినల్ మ్యాటర్స్‌కు సంబంధించి అసిస్టెంట్ స్పెషల్ ఏజెంట్ ఇన్‌చార్జి (పోర్ట్‌లాండ్ ఫీల్డ్ ఆఫీస్) గా ప్రమోట్ అయింది. ఏజెన్సీ ఆపరేషన్స్‌లో తనదైన ముద్ర వేసింది.

ఆ తరువాత ఎఫ్‌బీఐ డైరెక్టర్‌కు ఎగ్జిక్యూటివ్ స్పెషల్ అసిస్టెంట్‌గా నియామకం అయింది.

ఇంటర్నేషనల్ ఎసైన్‌మెంట్స్‌లో కూడా తన సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఇంగ్లాండ్ నుంచి ఇరాక్ వరకు ఎన్నో దేశాల్లో, ఎన్నో సంస్కృతుల మధ్య పని చేసింది.

ఎఫ్‌బీఐలో చేరడానికి ముందు సోహిని సిన్హా థెరపిస్ట్‌గా, ఒక స్వచ్ఛంద సంస్థకు సంబంధించిన క్లినిక్‌లో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసింది.

ఇక చదువు విషయానికి వస్తే సైకాలజీలో డిగ్రీ, మెంటల్ హెల్త్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఆ చదువు తన వృత్తి జీవితంలో ఎంతో ఉపయోగపడింది.

ఇతరులకు సహాయపడాలనే సోహిని సిన్హా తపనకు ఎఫ్‌బీఐ బలమైన వేదికలా ఉపయోగపడుతోంది.

బ్యూటిప్స్ వానకాలం మేలైనవి...



ఈ కాలం జిడ్డు చర్మం గలవారి సమస్య మరింత పెరుగుతుంటుంది. అలాగే, ఫంగల్ ఇన్ఫెక్షన్లు కూడా పెరిగే అవకాశం ఉంది. డీ హైడ్రేట్ అయ్యి చర్మం నిస్తేజంగా మారే అవకాశం ఉంది. ఈ సమస్యలకు విరుగుడుగా..

- జిడ్డు, మలినాలను తొలగించడానికి క్లెన్సర్‌ను ఉపయోగించాలి. దీనివల్ల మృతకణాలు సులువుగా తొలగిపోతాయి. సహజసిద్ధమైన క్లెన్సర్ కావాలనుకుంటే ఇందుకు ఓట్ మీల్, చక్కెర లేదా పండ్ల గుజ్జును వాడుకోవచ్చు.
- చర్మం పొడిగా మారితే బాదం నూనె లేదా మాయిశ్చరైజర్‌ని ఉపయోగించాలి. రోజూ పది గ్లాసుల నీళ్లు తాగాలి.
- ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించడానికి వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి. తేమ ఉండే చోట ఫంగల్ పౌడర్లు, క్రీములను ఉపయోగించాలి.
- చర్మం తాజాగా ఉండాలంటే మీ ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రొటీన్లను చేర్చాలి. ఒత్తిడిని ఎదుర్కోవడానికి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇవి దోహదపడతాయి.
- వేప, తులసి, పసుపు, కలబంద వంటి వాటిలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. వీటిని చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి పై పూతలుగా వాడితే ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడతాయి.

సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే సామాన్యులు సైతం
కోటీశ్వరులు కావచ్చని నిరూపించి చూపిస్తున్నాడు
పదహారేళ్ల యువకుడు దిగ్విజయ్ సింగ్.

సమయాన్ని చాక్లెట్‌గా మార్చుకున్నాడు!


దిగ్విజయ్ సింగ్



కరోనా కారణంగా ఇళ్లలోనే జైల్లోలా కష్టంగా గడిపిన రోజులవి. పిల్లలు పెద్దలు అని తేడా లేకుండా హఠాత్తుగా దొరికిన బోలెడంత సమయాన్ని ఏం చేయాలో అర్థంకాని అయోమయ పరిస్థితులు. ఉదయపూర్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన దిగ్విజయ్ సింగ్ కూడా ఏమి తోచుబాటుగాని ఆ సమయంలో.. కొత్తగా ఏదైనా నేర్చుకోవాలనుకున్నాడు. అనుకున్న వెంటనే యూట్యూబ్‌లో చాక్లెట్స్ తయారీ గురించి చూశాడు. చాక్లెట్స్ తయారీ సులభంగా ఉండడంతో ఇంట్లో తయారు చేశాడు. దిగ్విజయ్ చేసిన చాక్లెట్‌లు రుచిగా ఉన్నాయని కుటుంబ సభ్యులు, స్నేహితులు చెప్పడంతో మరిన్ని చాక్లెట్స్ తయారు చేసి అమ్మాలనుకున్నాడు. ఇదే విషయాన్ని తన స్నేహితుడు మహావీర్ సింగ్‌కు చెప్పడం, అతనికి ఆసక్తి ఉండడంతో ఇద్దరూ కలిసి చాక్లెట్‌లు తయారు చేద్దామని నిర్ణయించుకున్నారు.

గిఫ్ట్‌బాక్స్‌ను చూసి...

పదహారేళ్ల తన స్నేహితుడితో కలిసి యూట్యూబ్ సాయంతో చాక్లెట్స్, వివిధ రకాల డిజర్ట్‌లు తయారు చేసి స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంచేవాళ్లు. దీపావళికి దిగ్విజయ్ తండ్రి కారు కొన్నాడు. కారు షోరూం వాళ్లు కారుతోపాటు చాక్లెట్ బాక్స్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు. షోరూంలో కారు కొనే కస్టమర్లందరికీ చాక్లెట్ బాక్స్‌లు గిఫ్ట్‌గా ఇస్తున్నారని దిగ్విజయ్‌కి తెలిసింది. వెంటనే హోటల్, కార్‌షోరూం యజమానులను కలిసి కాంప్లిమెంటరీగా ఇచ్చేందుకు తాను ఇంట్లో తయారు చేసిన చాక్లెట్స్ ఇస్తానని చెప్పాడు. అందుకు వారు ఒప్పుకోవడంతో చాక్లెట్స్ తయారీ మొదలుపెట్టాడు.

రెండేళ్లలో రెండుకోట్లు

ఒక కార్ షోరూం వాళ్లు వెయ్యి చాక్లెట్స్ కావాలని 2021లో తొలి ఆర్డర్ ఇచ్చారు. అప్పుడే 'సరామ్'అనే పేరుతో చాక్లెట్ విక్రయాలు ప్రారంభించాడు. చాక్లెట్స్ రుచిగా ఉండడంతో .. విక్రయాలు క్రమంగా పెరిగి ఏడాదిలోనే మంచి ఆదాయం వచ్చింది. దేశవ్యాప్తంగా రెండు టన్నులకు పైగా చాక్లెట్ విక్రయాలు జరిగాయి. దీంతో రెండేళ్లలోనే 'సరామ్' రెండు కోట్లను ఆర్జించింది.

సరికొత్తగా...

సాదా సీదాగా కాకుండా దేశంలో దొరికే రకరకాల పండ్లు, మసాలాలను ఉపయోగించి చాక్లెట్స్‌ను సరికొత్తగా తయారు చేసి విక్రయిస్తున్నాడు దిగ్విజయ్. కేరళ, తమిళనాడునుంచి కోకోపొడి, చాక్లెట్స్‌లో వాడే పండ్లను బాగా పండే రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని నాణ్యమైన రుచికరమైన చాక్లెట్స్‌ను తయారు చేస్తున్నాడు. ఢిల్లీ, బెంగళూరు, ఉదయ్‌పూర్, జైపూర్‌లలో సరామ్ కస్టమర్లు చాలామంది ఉన్నారు. ఉదయ్‌పూర్, జైపూర్‌లలో స్టోర్‌లు, ఆఫ్‌లైనేగాక, ఆన్‌లైన్‌లో చాక్లెట్ విక్రయాలు జరుగుతున్నాయి. సమయాన్ని సక్రమంగా వినియోగిస్తే కోట్లు సంపాదించవచ్చుననడానికి దిగ్విజయ్ ఉదాహరణగా నిలుస్తున్నాడు.

హిజార్బీ వచ్చేసిందోచ్!


హిజార్బీ


హనీఫా ఆడమ్

బార్బీ బొమ్మలను ఇష్టపడని వారు ఉండరేమో. బార్బీ అంత అందంగా ఉండాలని అమ్మాయిలంతా అనుకుంటారు. కానీ నాలాగా బార్బీలేదే? నాలాంటి డ్రెస్ వేసుకోలేదే అని అనుకున్న ఓ ఆర్టిస్ట్ ఏకంగా సరికొత్త బార్బీని రూపొందించింది. సంప్రదాయం ఉట్టిపడేలా తయారైన ఈ సరికొత్త బార్బీ అందర్నీ తెగ ఆకర్షిస్తోంది.

రంగు రంగుల డ్రెస్‌లు, ప్రముఖుల రూపాలతో అందర్నీ ఆకర్షించే బార్బీ హిజాబ్ వేస్తే ఎలా ఉంటుంది అనుకుంది నైజీరియాకు చెందిన 32 ఏళ్ల హనీఫా ఆడమ్. మార్కెట్లో హిజాబ్ ధరించిన బొమ్మల కోసం వెతికింది. ఎంత గాలించినా హిజాబ్ ధరించిన ఒక్క బొమ్మ కూడా కనిపించలేదు. తనలా హిజాబ్ ధరించిన బార్బీ కనిపించలేదని బాధపడింది. దీంతో తనే... హిజాబ్ ధరించిన బార్బీని తయారు చేయాలని నిర్ణయించుకుంది. 2015 డిసెంబర్‌లో ..నేవీ మ్యాక్సీ స్కర్ట్ కుట్టి, నీలం రంగు జాకెట్, నలుపు రంగు హిజాబ్‌ను బార్బీకి తొడిగి ఫోటో తీసింది. 'హిజార్బీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెరిచి...చక్కగా చూడముచ్చటగా ఉన్న తొలి హిజార్బీ ఫోటోను పోస్టు చేసింది. ఈ ఫోటో చూసిన వారంతా..'' చాలా బావుంది. మా పిల్లలకు కూడా ఇటువంటి డ్రెస్సే కావాలని'' అడిగారు. దీంతో హనీఫా మరింత ఉత్సాహంతో వివిధ రకాల హిజార్బీలను రూపొందించింది. డ్రెస్‌లన్నింటిలోకి లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్ హబీబీ డిసిల్వా ధరించిన బ్రిటిష్ స్టైల్ డ్రెస్ బాగా పాపులర్ అయ్యింది. మీడియా భారీ కవరేజ్‌తోపాటు, టీన్‌వోగ్ కూడా గుర్తించడంతో హిజార్బీకి మంచి ఆదరణ లభించింది. ఇప్పటిదాక హిజార్బీ అకౌంట్‌లో రెండు వందలకు పైగా ఫోటోలు పోస్టు చేసింది. ముస్లిం సాంప్రదాయం, ఫ్యాషన్‌ను ప్రతిబింబించేలా హనీఫా హిజార్బీలు తయారు చేయడం విశేషం.

ఇటీవల విడుదలైన బార్బీ సినిమాతో బార్బీ



మేనియా చూసి హనీఫా మరోసారి హిజార్బీని యాక్టివ్ చేసింది. ఈ క్రమంలోనే ..ఆరేళ్ల తరువాత పింక్ రంగు వేసిన గోడ ముందు పింక్ కలర్ డ్రెస్ వేసుకుని, హిజాబ్ ధరించి నిలుచున్న హిజార్బీ ఫోటోను ఇన్‌స్టా అకౌంట్‌లో ''హిజార్బీ ఈజ్ బ్యాక్'' అంటూ పోస్టు చేసింది. ఈ పోస్టుకు నెటిజన్లు ఫిదా అయిపోయి తెగ లైక్‌లు కొడుతున్నారు.

మ్యాటెల్ హిజార్బీ..

హనీఫా తయారు చేసిన హిజార్బీ పాపులర్ కావడంతో 2017లో బార్బీ తయారీ సంస్థ కూడా హిజాబ్ ధరించిన బార్బీని విడుదల చేసింది. అమెరికా ఒలింపిక్ ఫెన్సర్ ఇతిహాజ్ మహమ్మద్ రూపంతో హిజార్బీని విడుదల చేసింది.

వ్యాపారిని కాదు.. ఆర్టిస్ట్ అవాలనుకోలేదు

''ఫైన్ ఆర్ట్స్‌ను చదివాను. కానీ ఆర్టిస్ట్ అవ్వాలనుకోలేదు. డాక్టర్ అవాలనుకున్నాను. అదీ కుదరక ఫిజియాలజీ చదివాను. ఫార్మకాలజీలో మాస్టర్స్ చేసాను. చదువు పూర్తిచేసి యూకే నుంచి నైజీరియా వచ్చాక... నాకు తెలిసిన ఫ్యాషన్ ఐడియాలను ఆన్‌లైన్‌లో పోస్టు చేసేదాన్ని. వాటిని చూసిన వారంతా అభినందించేవారు. 2016లో ఫుడ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో పాల్గొని విజేతగా నిలిచాను. అప్పుడు ఆర్టిస్ట్‌గా మారాలనుకున్నాను. అప్పటినుంచి నేను రూపొందించిన కళారూపాలను నైజీరియా, న్యూయార్క్ ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శించడం మొదలు పెట్టాను. ఇలా చేస్తూ హిజార్బీని మీ ముందుకు తీసుకొచ్చాను. నేను వ్యాపారిని కాదు. నా స్నేహితురాళ్లు ప్రోత్సహించడంతో వివిధరకాల హిజార్బీని రూపొందించాను. ఈ నెలలో హిజార్బీ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించబోతున్నాను. బట్టల తయారీతోపాటు, నైజీరియా డిష్‌లకు ఫుడ్ ఆర్ట్‌ను జోడిస్తూ మా సంప్రదాయాలకు మరింత గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. నేను రూపొందించే హిజార్బీల్లో.. ఏసియన్, తెలుపు, నలుపు బొమ్మలు ఉన్నాయి. సెలబ్రెటీలను రోల్ మోడల్స్‌గా తీసుకునేందుకు వివిధ రంగుల్లో రూపొందిస్తున్నాను'' అని చెబుతోంది హనీఫా.

అప్పడే జుట్టు తెల్లబడుతోందా?



ఒకప్పుడు యాభైఏళ్లు దాటిన వారికే తెల్లజుట్టు వచ్చేది కానీ ఇప్పుడు చాలామందికి పాతికేళ్లకంటే ముందే తెల్లజుట్టు వచ్చేస్తోంది. దాంతో ఉన్న వయసు కంటే పెద్దగా కనిపించడం, దానిని కప్పి పుచ్చుకోవ డానికి తలకు రకరకాల హెయిర్ డైలు, షాంపూలు వాడటం... వాటిలోని రసాయనాల ప్రభావంతో సైడ్ ఎఫెక్టులు రావడం... వీటన్నింటి బదులు అసలు చిన్న వయసులోనే తెల్లజుట్టు ఎందుకు వస్తుందో చెబుతూ...దానిని నివారించడానికి తగిన సూచనలు, సలహాలతో కూడిన కథనం ఇది.

ఈ చిట్కాలు పాటించి చూడండి

టెన్షన్ వద్దు... ఇలా చేసి చూడండి

చిన్న వయసులోనే తెల్లజుట్టు రావడానికి గల అనేక కారణాలలో అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన కారణాలు ప్రధానం. డైట్‌లో పోషకాల కొరత ఉండకూడదు.

తెల్లజుట్టు రాకుండా ఉండాలంటే విటమిన్ బి ఉండే ఆహారాలని పుష్కలంగా తినాలి. డైట్‌లో ఇవి కచ్చితంగా ఉండేవిధంగా చూసుకోవాలి. జుట్టు తెల్లగా మారుతుందంటే విటమిన్ బి లోపం ఉందని అర్థం చేసుకోండి. అంతే కాదు దీనివల్ల జుట్టు రాలడం, పొడి జుట్టు సమస్యలు కూడా ఎదురవుతాయి. రోజువారీ ఆహారంలో విటమిన్ బి ఉందా లేదా అన్నదానిపై శ్రద్ధ వహించాలి. ఎందుకంటే హెల్తీ ఫుడ్స్ ద్వారా జుట్టుకు పోషణ లభిస్తుంది. తెల్ల జుట్టును సహజంగా నల్లగా సరైన సమయంలో ఆహారంలో మార్పులు చేయకపోతే అది జుట్టుకు హాని కలిగిస్తుంది. విటమిన్ బి సమృద్ధిగా లభించే పాల ఉత్పత్తులను ఎక్కువగా తీసుకోవాలి. దీనితో పాటు విటమిన్ బి6, విటమిన్ బి12 కూడా ఉండే ఆహారాలని తినాలి. శరీరంలో విటమిన్ బి లోపం ఉంటే జుట్టుకు ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. బయోటిన్, ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల కూడా చిన్న వయస్సులోనే జుట్టు నెరుస్తుంది.

కాయధాన్యాలు, తృణధాన్యాలు, గింజలు, పాలు, పెరుగు, జున్ను, గుడ్లు, ఆకుకూరలు, గోధుమలు, పుట్టగొడుగులు, బఠానీ, పొద్దుతిరుగుడు గింజలు, అవకాడో, చేపలు, మాంసం, చిలగడ దుంప, సోయాబీన్, బంగాళదుంప, బచ్చలికూర, అరటి, బ్రకోలీ, బీన్స్ ప్రతిరోజు డైట్‌లో ఉండేలా చూసువడం వల్ల తెల్లజుట్టు సమస్యను వాయిదా వేయచ్చు.



గుడ్డు లోని తెల్లసొన లేదా మజ్జిగతో కలిపి రుబ్బిన కరివేపాకు లేదా మెంతి ఆకు పేస్ట్‌ని తలకు ప్యాక్‌గా వేసుకోవాలి. రెండు గంటల తర్వాత గోరువెచ్చని నీటితో వాష్ చేసుకోవాలి. తలస్నానానికి తక్కువ గాఢత ఉన్న షాంపూలనే ఉపయోగించాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వల్ల తెల్లజుట్టు రాదు. వచ్చిన తెల్ల జుట్టు కాలక్రమేణా నల్లగా మారుతుంది.





తెల్ల జుట్టు సమస్యను అదుపు తంగా పారదోలే వాటిలో కాఫీ పొడి ఒకటి. ఓ గ్లాసుడు నీళ్లలో ఒకటిన్నర చెంచాల కాఫీ పొడిని మరిగించి చల్లారిన తర్వాత జుట్టు కుదుళ్లకు పట్టించాలి. వేళ్లను జుట్టు కుదుళ్లకు తగిలేలా మసాజ్ చేస్తుండాలి. ఇలా చేసిన 30 నిమిషాల తర్వాత తల స్నానం చేయాలి.



మీ తలకు సరిపడేటన్ని మందార ఆకు తీసుకుని పేస్ట్ లా చేసుకుని అందులో కొబ్బరి నూనె కలిపి జుట్టుకి అప్లయ్ చేసి 2 గంటల తర్వాత గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయడం వల్ల తెల్లజుట్టు సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది.



తెల్ల జుట్టు ఉన్న వారు పెనంపై రెండు చెంచాల పసుపును వేసి వేడి చేసి నల్లగా మారేంత వరకు మాడ్చాలి. చల్లారిన తర్వాత దీనికి సరిపోయేంత కొబ్బరినూనె లేదా నువ్వులనూనెలో కలిపి తలకు పట్టించాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టు ఎక్కువ కాలం నల్లగా ఉంటుంది.



తల స్నానానికి గోరు వెచ్చని నీళ్లు మాత్రమే వాడాలి. హెర్బల్ హెన్నాలో బీట్ రూట్ రసం కలిపి ప్యాక్ వేసుకున్నా జుట్టుకు మంచి రంగు వస్తుంది.



హెన్నా పౌడర్ ను ఆముదంలో మరిగించాలి. ఆ తర్వాత స్టవ్ పై నుంచి దించి చల్లారిన తర్వాత దానిని జుట్టు కుదుళ్లకు అంటుకునేలా రాయాలి. ఆ తర్వాత కుంకుడు కాయ లేదా శీకాయతో తలస్నానం చేయాలి.



మీ ఎముకలు ఎంత బలమైనవండి?



వయసు పెరుగుతున్నకొద్దీ ఎముకలకు సంబంధించి అనేక సమస్యలు వస్తాయి. పాత ఎముకల్లోని మృత కణాలు నశిస్తాయి, కొత్తవి పుట్టుకొస్తాయి. ఇదో సహజమైన ప్రక్రియ. చిన్నపిల్లలు, యువకులలో ఇది వేగంగా జరుగుతుంది. మూడుపదుల వయసులో మనిషి ఎముకల సాంద్రత పరిపూర్ణ స్థితికి చేరుకుంటుంది. ఆ తర్వాత క్షీణిస్తూ పోతుంది. ఈ నేపథ్యంలో ఎముకల ఆరోగ్యానికి సూచనలు..

శరీరంలోని అవయవాలను కాపాడటం, కండరాలు సాఫీగా పనిచేసేలా చూడటం, క్యాల్షియంను భద్రపరచడం.. ఎముకల ముఖ్య విధి. అయితే కొందరిలో చిన్న వయసులోనే ఎముకలు పెళుసు బారతాయి. కొందరిలో తొందరగా అరిగిపోతాయి. వ్యాధి వచ్చాక ఉపశమన చర్యలు తీసుకోవడానికి బదులు రాకుండా నివారించడం మంచిది.

ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో విటమిన్-డి ది కీలక పాత్ర. ఎందుకంటే శరీరం క్యాల్షియాన్ని శోషించుకోవడానికి సహకరించేది ఇదే. అందుకే విటమిన్-డి కొరత ఉన్న వారిలో ఎముకల సాంద్రత తక్కువగా ఉంటుంది. విటమిన్-డి తగినంత తీసుకునే వారితో పోలిస్తే, తీసుకోని వారిలో ఎముకల క్షీణత ఎక్కువ. ఉదయం, సాయంత్రం కొద్దిసేపు ఎండలో గడపటం, చీజ్, కొవ్వులు ఎక్కువగా ఉన్న చేపలను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరంలో విటమిన్-డి నిల్వలను పెంచుకోవచ్చు.

వ్యాయామం

ఎముకలు బలంగా ఉండాలంటే.. శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి. వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్, రన్నింగ్, మెట్లు ఎక్కడం లాంటివి ఇందుకు దోహదపడతాయి. ఈ వ్యాయామాలు ఎముకల కణాల పెరుగుదలకు సాయపడతాయి.

సమతుల ఆహారం

విటమిన్-సి, ప్రొటీన్లు, క్యాల్షియం సమృద్ధిగా ఉన్న ఆహారంతో ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రొటీన్లు, కూరగాయలు ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే.. ఎముకలు క్యాల్షియంను శోషించుకునే సామర్థ్యం తగ్గుతుంది. దాంతో ఎముక మీద దుష్ప్రభావం పడుతుంది. ఎక్కువ ప్రొటీన్లు ఉన్న ఆహారం తీసుకుంటే రక్తంలో ఆమ్లత్వం పెరుగుతుంది. అందుకని తగు మొత్తంలోనే తీసుకోవాలి.

సరైన జీవనశైలి

పోషకాలతో కూడిన సమతులాహారం, ఆరోగ్యకరమైన బరువు ఎముకల బలోపేతానికి ఉపకరిస్తాయి. బరువు ఎక్కువైనా, మరీ తగ్గినా ఎముకలు, కీళ్లకు సంబంధించిన సమస్యలు చుట్టుముట్టవచ్చు. బరువు తక్కువ ఉన్నవారికి ఆస్టియోపొరోసిస్ ముప్పు ఉంటుంది. బరువు ఎక్కువగా ఉంటే ఎముకలు పెళుసు బారిపోవచ్చు. అందువల్ల బరువును బట్టి ఎలాంటి ఆహారం... ఎంత తీసుకోవాలో అంతే తీసుకోవాలి.

హెల్త్ టిప్స్



కొంతమందికి బస్సులో లేదా రైలులో ప్రయాణిస్తున్నప్పుడు వికారంగా అనిపించడంతోపాటు తలనొప్పి, వాంతులు వస్తాయి. ఇలాంటి పరిస్థితిని మోషన్ సిక్‌నెస్ అంటారు. ఇది రాకుండా ఉండాలంటే లాంగ్ జర్నీ చేయాల్సి వచ్చినప్పుడు టీ, కాఫీల వంటివి తాగకూడదు.అలాగే ఖాళీ కడుపుతో కూడా ఉండకూడదు. సులభంగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారాలని తీసుకోవాలి. నోటిలో ఒకటి రెండు యాలకులు పెట్టుకోవాలి. ఇది వికారం సమస్యని తొలగిస్తుంది. ప్రయాణం చేసేరోజు ఖాళీ కడుపుతో అర టీస్పూన్ నల్ల ఉప్పు, నిమ్మకాయ రసం, తేనె కలిపి తాగితే గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు దరిచేరవు. ప్రయాణంలో నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లను తింటూ ఉండాలి. అరగ్లాసు నీటిలో చెంచాడు యాపిల్ సిడార్ వెనిగర్ కలిపి పరగడుపున తాగితే వాంతులు రావు.



కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తీసుకుని తినాలి. దీంతో మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. రాత్రిపూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం తిన్నా సమస్య నుంచి బయటపడచ్చు..



ఒకటి రెండు జామాకులను తీసుకుని శుభ్రంగా కడిగి వాటిని నీటిలో వేసి పది నిమిషాల పాటు మరిగించాలి. ఆ నీటిని వడకట్టి అందులో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి హెర్బల్ టీ మాదిరిగా తాగాలి. రోజుకు ఇలా రెండు సార్లు తాగితే చాలు, స్త్రీలకు నెలసరి సమయంలో వచ్చే నొప్పులు రాకుండా ఉంటాయి. షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. చర్మం కాంతిమంతంగా... మృదువుగా తయారవుతుంది.

సినిమా

చేపల వేటలో..


● నాగచైతన్య

మత్స్యకారుల జీవితం గురించి తెలుసుకునే పని మీద నాగచైతన్య శ్రీకాకుళం, వైజాగ్ వెళ్లిన విషయం తెలిసిందే. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై 'బన్నీ' వాసు ఓ సినిమా నిర్మించనున్నారు. మత్స్యకారుల జీవితం నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుంది. ఈ సినిమా కోసమే టీమ్ కసరత్తులు చేస్తోంది. గురువారం శ్రీకాకుళంలోని మత్స్యకారులను స్వయంగా కలిసి, వారి సంస్కృతి, జీవనశైలిని అడిగి తెలుసుకున్నారు చైతన్య, చందు, 'బన్నీ' వాసు. శుక్రవారం వైజాగ్ పోర్టును సందర్శించారు. మత్స్యకారులతో కలసి చేపల వేటకు వెళ్లారు. సముద్ర ప్రయాణం, వేట, అక్కడ ఎదురయ్యే పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

బెస్ట్ గిఫ్ట్

'తంగలాన్' సినిమా కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు హీరోయిన్ మాళవికా మోహనన్. విక్రమ్ హీరోగా పా. రంజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ ఫిల్మ్ 'తంగలాన్'. ఈ చిత్రంలో పార్వతి, మాళవికా మోహనన్ హీరోయిన్లు. కేజీ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం (ఆగస్టు 4) మాళవికా మోహనన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'తంగలాన్'లోని ఆమె ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. 'బెస్ట్ బర్త్ డే గిఫ్ట్' అని ఈ పోస్టర్‌ని ఉద్దేశించి మాళవిక ట్వీట్ చేశారు. ఈ చిత్రంలో గిరిజన యువతిగా ఆమె నటిస్తున్నట్లు తెలుస్తోంది. భారతదేశంలో 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలన కొనసాగుతున్నప్పుడు కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ వద్ద ఆక్రమణలకు ఎదురు నిలిచిన ఓ గిరిజన తెగ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోందని సమాచారం.


● మాళవికా మోహనన్

మారకపోతే ఆగిపోతాం
- తమన్నా

'నువ్వు కావాలయ్యా...' అంటూ 'జైలర్'లో హుషారుగా స్టెప్పులేశారు తమన్నా. ఈ బ్యూటీ కూడా సినిమా ఇండస్ట్రీకి మోస్ట్ వాంటెడ్. అందుకే దాదాపు 20 ఏళ్లయినా ఇంకా ఫుల్ బిజీగా ఉన్నారు. తమిళంలో 'అరణ్‌మణై', మలయాళంలో తొలి చిత్రం 'బాంద్రా', ఓ టీవీ షోతో బిజీగా ఉన్నారామె. చిరంజీవి సరసన తమన్నా నటించిన 'భోళా శంకర్' ఈ 11న విడుదల కానుంది. అంతకు ఒక్కరోజు ముందు రజనీకాంత్ 'జైలర్'తో థియేటర్లకు వస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర 'భోళా శంకర్'ని నిర్మించారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్' రూపొందింది. రెండు చిత్రాలతో థియేటర్లకు రానుండటం, ఇతర విశేషాలు తమన్నాతో జరిపిన ఇంటర్వ్యూలో ఈ విధంగా...



ఈ నెల 10న 'జైలర్', 11న 'భోళా శంకర్' సినిమాలతో వస్తున్నారు. సో.. వచ్చే వారం మీకు స్పెషల్ అనొచ్చు...

విషయం ఏంటంటే.. ఒకటి తమిళ సినిమా, మరొకటి తెలుగు సినిమా అయినా రెండు సినిమాలూ అన్ని భాషల్లో థియేటర్లకు వస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవిగారు, సూపర్ స్టార్ రజనీకాంత్‌గారు.. ఇద్దరూ దేశంలో పెద్ద స్టార్స్. ఇలా ఒక్క రోజు గ్యాప్‌లో ఇద్దరు స్టార్స్‌తో సినిమా అంటే కల నెరవేరినట్లు ఉంది. ఈ రెండు మాత్రమే కాదు.. నేను చేసిన ఇంకో సినిమా కూడా రిలీజ్‌కు రెడీ అవుతోంది. అదొక మంచి ఫీలింగ్.

చిరంజీవి డ్యాన్స్ మామూలుగా ఉండదు... మీరు డ్యాన్స్‌లో బెస్ట్. అయితే మీ ఇద్దరికీ 'సైరా'లో డ్యాన్స్ చేసే చాన్స్ రాలేదు.. 'భోళా శంకర్'లో మీ కాంబో డ్యాన్స్ గురించి...

'మిల్కీ బ్యూటీ...' మంచి రొమాంటిక్ మెలోడి సాంగ్. ఈ పాటలో ఒక హుక్ స్టెప్ ఉంటుంది. మిగతా స్టెప్స్ కూడా గ్రేస్‌ఫుల్‌గా ఉంటాయి. చిరంజీవిగారి డ్యాన్స్ చాలా గ్రేస్‌ఫుల్‌గా ఉంటుంది. అందుకే మిగతా వారికి ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది. పైగా శేఖర్ మాస్టర్ మంచి స్టెప్స్ డిజైన్ చేశారు. స్విట్జర్లాండ్‌లో ఈ పాట షూట్ జరిగింది. పెద్దగా రిహార్సల్స్ చేయలేదు. అక్కడికి అక్కడే నేర్చుకుని చేసేశాం. అలాగే ఇదే సినిమాలో 'జామ్ జామ్...' పాట కూడా నాకు చాలా ఇష్టం.

సీనియర్ హీరోలతో సినిమాలు చేసినప్పుడు... అంత సీనియర్స్‌తో ఎందుకు? అనే ప్రశ్న ఎదురవుతుంటుంది కదా...

ఇప్పుడు నా కెరీర్‌లో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. అన్ని రకాల యాక్టర్స్‌తో నటిస్తున్నాను. నాకన్నా చిన్నవాళ్లకు జోడీగా, నాకు సమానమైన ఏజ్ ఉన్నవాళ్లతో, సీనియర్లతో సినిమాలు చేస్తున్నాను. ఓటీటీ ప్రాజెక్ట్స్‌లో నటిస్తున్నాను. నా కెరీర్‌లో నేనెప్పుడూ ఏజ్ గురించి పట్టించుకోలేదు. నేను యాక్టర్లను యాక్టర్లగా చూస్తాను. నా పాత్ర గురించి మాత్రమే ఆలోచిస్తాను. నా క్యారెక్టర్ ప్రేక్షకులకు నచ్చుతుందా? లేదా అన్నదే నాకు ముఖ్యం. ఏజ్ వల్ల ఈక్వేషన్ ఏం మారదు.

దాదాపు 20 ఏళ్లుగా సినిమాలు చేస్తున్నారు. ఇంకా బిజీ బిజీగా సినిమాలు చేస్తూ రేస్‌లో దూసుకెళ్ల దానికి కారణం?

అస్సలు నేను ఇది రేస్ అనుకోను. చాలా చిన్న వయసులో కెరీర్ స్టార్ట్ చేశాను. జయాపజయాలనేవి మన చేతుల్లో ఉండవు. టీమ్ వర్క్ ముఖ్యం. ఒక్కోసారి కొన్ని విజయాలకు నేనూ కారణం అవుతాను. ఆ సంగతి పక్కనపెడితే.. కెరీర్‌లో ముందుకు వెళ్లాలంటే నిరంతరం హార్డ్‌వర్క్ చేయాలి. ఆ ఫోకస్‌తోనే వెళుతున్నాను.

ఈ మధ్య కొన్ని హద్దులను దాటి, బోల్డ్ క్యారెక్టర్స్ చేస్తున్నారు.. ఈ మార్పు గురించి?

మారకపోతే నేనెక్కడ మొదలయ్యానో అక్కడే ఆగిపోయినట్లే.. అలా ఆగిపోవాలని ఎవరూ అనుకోరు. ఎవరైనా కెరీర్‌లో ఎదగాలనే అనుకుంటారు. ప్రతీ జాబ్‌లో ప్రమోషన్ ఉన్నట్లే మా జాబ్ కూడా. ప్రమోషన్ కోసం కొంచెం బ్రాడ్‌గా ఆలోచించాలి.. కొత్త ప్రయత్నాలు చేయాలి. అప్పుడు జర్నీ ఇంకా లాంగ్‌గా, బెటర్‌గా ఉంటుంది.

'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్‌లో నటించిన అనుభవం గురించి?

మన చుట్టూ ఇప్పుడు రకరకాల మాటలు దొర్లుతుంటాయి. వాటిలో ఏది మంచో.. చెడో తెలుసుకోలేం. అందుకే 'లస్ట్ స్టోరీస్ 2' గురించి నాతో అభిమానులు, ఇంకా వేరేవాళ్లు బాగుందని అన్నప్పుడు కొత్త ప్రయత్నం రీచ్ అయిందనే ఆనందం కలిగింది. ముఖ్యంగా ఉమన్ వచ్చి బాగుందని అభినందించడంతో చాలా హ్యాపీ ఫీలయ్యాను.

ఇన్నేళ్లల్లో మీ గురించి రానటువంటి వార్తలు ఇప్పుడు వస్తున్నాయి.. ఫర్ ఎగ్జాంపుల్ నటుడు విజయ్ వర్మ, మీ గురించి ఎక్కువ ప్రచారమవుతోంది...

ఎవరో ఏదో మాట్లాడతారు. కానీ నేను ఎప్పుడు మీడియాతో మాట్లాడినా హానెస్ట్‌గానే మాట్లాడాను. ఇక ఎవరెవరో రూమర్స్ క్రియేట్ చేస్తే నేనేం చేయలేను.

పెళ్లి ప్లాన్ ఏమైనా?

ఇప్పటికైతే లేదు. ప్లాన్ చేసుకున్నప్పుడు కచ్చితంగా చెబుతాను.

టైటిల్ బాగుంది
- ఎమ్మెల్సీ కవిత

''సౌండ్ పార్టీ' టైటిల్, పోస్టర్ ఆసక్తిగా ఉన్నాయి. కాన్సెప్ట్ వినోదాత్మకంగా ఉంటుందనిపిస్తోంది. ఈ చిత్రం హిట్ అవ్వాలి'' అన్నారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. వీజే సన్నీ, హ్రితికా


● వీజే సన్నీ, కవిత

శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వం వహించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను కవిత ఆవిష్కరించారు. ''త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు నిర్మాతలు.

టీఎఫ్‌సీసీకి ప్రభుత్వ గుర్తింపు లేదు
● తెలుగు, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి

''తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' (టీఎఫ్‌సీసీ) తెలంగాణ ప్రభుత్వంచే గుర్తింపు పొందలేదు. ఆ ఛాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న దుబాయ్‌లో నిర్వహించే నంది అవార్డు వేడుక ఆయన వ్యక్తిగతంతో పాటు ఓ ప్రైవేట్ వేడుక. ఈ నంది అవార్డు వేడుకకు, ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి)కు ఎలాంటి సంబంధం లేదు. ఈ వేడుకకి మేం భాగస్వామ్యం వహించం'' అని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శి కేఎల్. దామోదర్ ప్రసాద్, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి కార్యదర్శి కె. అనుపమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ''తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి, ఏపీ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల వద్ద టీఎఫ్‌సీసీ నంది అవార్డుల వేడుకకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అన్నది తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీకి మాతృసంస్థ. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాత్రమే తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన సంస్థలు. 24-09-2023న దుబాయ్‌లో నిర్వహించనున్న టీఎఫ్‌సీసీ నంది అవార్డుల గురించి మా రెండు ఛాంబర్‌లకు సంబంధం లేదు. 'నంది' అవార్డు అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పేటెంట్. నంది పేరును ఉపయోగించడం, అవార్డు వేడుక నిర్వహించడాన్ని ఖండిస్తున్నాం. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రిత్వశాఖ, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల వద్ద కూడా టీఎఫ్‌సీసీ నంది అవార్డుల వేడుకకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు'' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రీల్స్

రజనీ సినిమాలో?


● నాని

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో నాని సిల్వర్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ ఓ కీలక పాత్రలో నటించనున్నారని ప్రచారం జరిగింది. తాజాగా హీరో నాని పేరు తెరపైకి వచ్చింది. కథ రీత్యా ఈ సినిమాలోని ఓ కీలక పాత్రకు నానీని చిత్ర యూనిట్ సంప్రదించిందని కోలీవుడ్ టాక్. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. సో.. ఈ సినిమాకి నానీని అడిగారా? లేదా అనేది త్వరలో తెలిసిపోతుంది.

ఈ నెలలో నేనేనా


● రెజీనా

రెజీనా ప్రధాన పాత్రలో నటించిన ఫ్యాంటసీ థ్రిల్లర్ తమిళ చిత్రం 'సూర్పనగై' (తెలుగులో 'నేనేనా'). కార్తీక్ రాజు దర్శకత్వంలో ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్ నిర్మించిన చిత్రం ఇది. అక్షరా గౌడ, అలీ ఖాన్ , జై ప్రకాష్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాను ఈ నెల 18న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. 19వ శతాబ్దంతో పాటు ప్రస్తుత కాలంతో ఈ సినిమా కథ ఉంటుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో రెజీనా రెండు పాత్రలు చేశారు. ఓ పాత్రలో ఆమె పురావస్తు శాస్త్రవేత్తగా కనిపిస్తారట.

రహస్యాలు ఏంటి?


● అనన్య

'మల్లేశం' చిత్రం ఫేమ్ అనన్య నాగళ్ల ప్రధాన పాత్ర చేస్తున్న చిత్రం 'తంత్ర'. ఈ సినిమా ద్వారా శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. దివంగత నటుడు శ్రీహరి తమ్ముడి కొడుకు ధనుష్ ఈ చిత్రంతో హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. పి. నరేష్ బాబు, రవి చైతన్య నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రం 'తంత్ర'. భారత తంత్ర శాస్త్రానికి చెందిన విస్తు గొలిపే రహస్యాలను ఈ సినిమా ద్వారా చెప్పబోతున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

మస్త్ మజారే...

'బేగంపేట కుర్రదాన్ని మామా... నేను మలక్‌పేట చిన్నదాన్ని..' అని మొదలై 'మస్త్ మజా.. మస్త్ మజా రే..' అంటూ సాగే పాట 'బాలుగాడి లవ్‌స్టోరీ' చిత్రంలోనిది. ఆకుల అఖిల్, దర్శక మీనన్ జంటగా నటించిన చిత్రం ఇది. శ్రీనివాస్ తేజ్‌ను దర్శకునిగా పరిచయం చేస్తూ, ఆకుల భాస్కర్ సమర్పణలో ఆకుల మంజుల నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రంలో 'బేగంపేట కుర్రదాన్ని..' అంటూ సాగే స్పెషల్ సాంగ్‌ని విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఘనశ్యామ్ స్వరపరచగా, ఎల్. శ్రీనివాస్ తేజ్ రాసిన ఈ పాటను ఎమ్ఎమ్ మానసి ఆలపించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	481	65,721
నిఫ్టీ ▲	136	19,517

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,084	▲	125
డోజోన్స్	35,421	▲	234
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,564	▲	35
డాక్స్	15,952	▲	58
షాంఘై	3,288	▲	8
నికాయ్	32,193	▲	33

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	59,294	▽	16
బంగారం (99.5 స్వచ్ఛత)	59,057	▽	16
వెండి (కేజీ)	72,000	▽	197

ఎన్‌ఎండీసీకి కొత్త లోగో



న్యూఢిల్లీ: ముడి ఇనుము ఉత్పత్తి దిగ్గజం ఎన్‌ఎండీసీ కొత్త లోగోను కేంద్ర పౌర విమానయాన, ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం ఆవిష్కరించారు. కంపెనీ భవిష్యత్ విస్తరణ, సామర్థ్యాలను ప్రతిబింబించేలా దీన్ని తీర్చిదిద్దారు. ముడి ఇనుము కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, స్వావలంబన సాధించే ప్రయత్నాల్లో కంపెనీ కీలకపాత్ర పోషించిందని సింధియా చెప్పారు. ఏటా 40 మిలియన్ టన్నుల ఉత్పత్తితో భారత్ అవసరాల్లో 16 శాతాన్ని తీరుస్తోందని పేర్కొన్నారు. ఎన్‌ఎండీసీ 2.0ని ప్రతిబింబించేలా కొత్త లోగోని తీర్చిదిద్దినట్లు సంస్థ సీఎండీ అమితవ ముఖర్జీ చెప్పారు. జాతీయ ఉక్కు విధానం 2030 లక్ష్యాల సాధనలో సంస్థ ప్రధాన పాత్ర పోషించగలదని పేర్కొన్నారు.

విశాఖలో ట్రయంఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం



ట్రయంఫ్ బైక్‌ను లాంచ్ చేస్తున్న వరుణ్ ప్రభుకిషోర్, ప్రోబైకింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్

విశాఖపట్టణం: ట్రయంఫ్ మోటార్ సైకిల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ విశాఖపట్టణంలో ప్రారంభమైంది. ప్రోబైకింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్‌లు ఈ షోరూంను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రోబైకింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ మాట్లాడుతూ విశాఖ మార్కెట్‌లోకి 400 సీసీ ట్రయంఫ్ బైక్‌లను ప్రవేశపెట్టామన్నారు. కొత్త కస్టమర్లకు 16వేల కిలోమీటర్ల సర్వీసు విరామంతోపాటు, రెండేళ్ల అపరిమిత మైలేజ్ వారంటీతో, మూడేళ్ల వారంటీని అందిస్తున్నామన్నారు. 400 సీసీ బైక్, షోరూం ధర రూ.2.33 లక్షలు నుంచి అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోబైకింగ్ సర్వీసు వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పింగ్లే, ప్రోబైకింగ్ సర్కిల్ హెడ్ గౌతమ్, రీజినల్ మేనేజర్ రాహుల్‌లు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ లాభం రికార్డ్

- క్యూ1లో రూ. 16,884 కోట్లు
- ఆదాయం రూ. 1,32,333 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. క్యూ1(ఏప్రిల్–జూన్)లో నికర లాభం 178 శాతం దూసుకెళ్లి రూ. 16,884 కోట్లను తాకింది. ఒక త్రైమాసికంలో ఇది అత్యధికంకాగా.. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 6,068 కోట్లు ఆర్జించింది. ఇందుకు మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం దోహదపడ్డాయి. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సైతం నికర లాభం రూ. 7,325 కోట్ల నుంచి రూ. 18,537 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం రూ. 94,524 కోట్ల నుంచి రూ. 1,32,333 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.91 శాతం నుంచి 2.76 శాతానికి, ఎన్‌పీఏలు 1 శాతం నుంచి 0.71 శాతానికి తగ్గాయి. నికర వడ్డీ మార్జిన్లు 0.24 శాతం మెరుగై 3.47 శాతంగా నమోదయ్యాయి. కనీస మూలధన నిష్పత్తి 1.13 శాతం పుంజుకుని 14.56 శాతాన్ని తాకింది.

వడ్డీ ఆదాయం ప్లస్

క్యూ1లో ఎస్‌బీఐ మొత్తం ఆదాయం(స్టాండెలోన్) సైతం రూ. 74,989 కోట్ల నుంచి రూ. 1,08,039 కోట్లకు జంప్ చేసింది. వడ్డీ ఆదాయం రూ. 72,676 కోట్ల నుంచి రూ. 95,975 కోట్లకు బలపడింది. అయితే నికర వడ్డీ ఆదాయం 25 శాతం ఎగసి రూ. 38,905 కోట్లను తాకింది. పొదుపు ఖాతాల్లో 63 శాతం, రిటైల్ ఆస్తులలో 35 శాతం యోనో(డిజిటల్) ద్వారా పొందినట్లు బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖారా పేర్కొన్నారు. ఎస్‌బీఐ జనరల్



ఇన్సూరెన్స్‌లో దాదాపు రూ. 490 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అయితే సంస్థ ఐపీవో ప్రణాళికలను పునరుద్ధరించే యోచనలో లేనట్లు స్పష్టం చేశారు. రుణ నష్టాలకు ప్రొవిజన్లు 38 శాతం తగ్గి రూ. 2,652 కోట్లకు చేరాయి. గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో నమోదైన రూ. 1,278 కోట్లతో పోలిస్తే 107 శాతం అధికమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు 3 శాతం క్షీణించి రూ. 573 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో 5.27 కోట్ల షేర్లు, బీఎస్‌ఈలో 27.42 లక్షల షేర్లు ట్రేడయ్యాయి.

క్యూ1లో ఎంఅండ్‌ఎం జోరు

రూ. 3,684 కోట్లకు నికర లాభం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎం అం డ్‌ఎం) ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 56 శాతం జంప్‌చేసి రూ. 3,684 కోట్లకు చేరింది. ఆటోమోటివ్ విభాగం ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 2,361 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 28,412 కోట్ల నుంచి రూ. 33,406 కోట్లకు ఎగసింది. ఇది 18 శాతం వృద్ధి. అయితే మొత్తం వ్యయాలు రూ. 26,195 కోట్ల నుంచి రూ. 30,492 కోట్లకు పెరిగాయి. ట్రాక్టర్ల బిజినెస్‌లో మార్కెట్ వాటా 42.9 శాతాన్ని తాకగా.. ఈ 3వీలర్ బిజినెస్‌లో 65.5 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్నట్లు కంపెనీ ఆటో,



ఫామ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో రాజేష్ జెజూరికర్ పేర్కొన్నారు.

బ్యాంకింగ్‌లోకి నో..

ఆర్‌బీఎల్ బ్యాంకులో మరిన్ని పెట్టుబడుల యోచన ప్రస్తుతానికి లేదని, భవిష్యత్‌లో వ్యూహాత్మక అవసరాలు ఏర్పడితే పరిశీలిస్తామని కంపెనీ ఎండీ, సీఈవో అనిష్ షా వెల్లడించారు. ప్రస్తుతం బ్యాంకింగ్‌లోకి ప్రవేశించే ప్రణాళికలేవీలేవని స్పష్టం చేశారు. జూలై 26న ఆర్‌బీఎల్ బ్యాంకులో 3.53 శాతం వాటాను ఎంఅండ్‌ఎం కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్‌ఎం షేరు 0.27 శాతం తగ్గి రూ. 1,465 వద్ద ముగిసింది.

పీసీల దిగుమతి లైసెన్సుకు ప్రత్యేక పోర్టల్

వివరాలన్నీ సక్రమంగా ఉంటే 4 రోజుల్లోనే జారీ

న్యూఢిల్లీ: పర్సనల్ కంప్యూటర్లు (పీసీ), ల్యాప్‌టాప్‌ల దిగుమతి లైసెన్సు కోసం కంపెనీలు/ట్రేడర్లు దరఖాస్తు చేసుకునేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ప్రత్యేక పోర్టల్ రూపొందించింది. వివరాలన్నీ సక్రమంగా ఉంటే దరఖాస్తు చేసుకున్న 3–4 రోజుల్లోనే లైసెన్సును జారీ చేయవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే రవాణాలో ఉన్న కన్‌సైమెంట్స్‌ను లైసెన్సు లేకుండా అనుమతిస్తారని వివరించాయి. పీసీలు, ల్యాప్‌టాప్‌ల దిగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దేశీయంగా ఐటీ హార్డ్‌వేర్ డివైజ్‌లను తయారు చేసుకునేందుకు భారత్‌కు తగినంత సామర్థ్యం ఉండటం వల్ల నియంత్రణల విధింపుతో కంప్యూటర్ల లభ్యతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండబోదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

భద్రత కోసమే నియంత్రణలు..

దిగుమతైన కంప్యూటర్లలోని హార్డ్‌వేర్‌లో ఏవైనా లొసుగులు ఉంటే, వాటి నుంచి కీలకమైన వ్యక్తిగత, సంస్థాగత డేటాకు ముప్పు కలగకుండా భద్రత కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వివరించాయి. ఇంటర్నెట్ విస్తృతి పెరుగుతుండటంతో ప్రజలు ఆన్‌లైన్ మోసాల బారిన పడే అవకాశాలూ మరింతగా పెరిగాయని చెప్పాయి. ఈ నేపథ్యంలోనే దేశం, దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతోనే ప్రభుత్వం



తాజా నియంత్రణలు విధించిందని అధికారులు తెలిపారు. అలాగే, చైనాతో వాణిజ్య సమతౌల్యం సాధించేందుకు కూడా ఇది ఉపయోగపడగలదని పేర్కొన్నారు. టారిఫ్‌యేతర నియంత్రణలనేవి దిగుమతులపై నిషేధం కిందికి రావని, లైసెన్సు తీసుకున్న వారు దిగుమతి చేసుకోవచ్చని వివరించారు. అటు, హార్డ్‌వేర్.. సిస్టమ్స్ విశ్వసనీయమైనవిగా ఉండేలా చూసేందుకు, దిగుమతులను తగ్గించుకునేందుకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఒక ట్వీట్ ద్వారా తెలిపారు. 2022–23లో ల్యాప్‌టాప్‌లు, పీసీల దిగుమతులు 5.33 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ మధ్య వ్యవధిలో పీసీలు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లతో పాటు ఎలక్ట్రానిక్స్ దిగుమతుల విలువ 19.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

తాన్లా పన్ను పారదర్శకత నివేదిక

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పన్నుల వివరాల వెల్లడిలో మరింత పారదర్శకతను పాటిస్తూ సీపాస్ (కమ్యూనికేషన్ ప్లాట్‌ఫాం యాజ్ ఏ సర్వీస్) దిగ్గజం తాన్లా ప్లాట్‌ఫామ్స్ తొలిసారి 2023 ఆర్థిక సంవత్సరానికి గాను ట్యాక్స్ ట్రాన్స్‌పరెన్సీ నివేదికను ఆవిష్కరించింది. అనేక సంవత్సరాలుగా అసాధారణమైన పనితీరుతో తాన్లా తమ వాటాదారులకు మరింత విలువ చేకూరుస్తూ వస్తోందని గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ ఉదయ్ రెడ్డి తెలిపారు. పన్నులు చెల్లింపులతో పాటు, ప్రభుత్వాల తరఫున వసూళ్లకు తోడ్పాటు



అందించడం ద్వారా అంతర్జాతీయంగా ఖజానాలకు రూ. 900 కోట్ల మేర సమకూర్చామని ఆయన పేర్కొన్నారు. పన్నులను తాము ఒక వ్యయంగా కాకుండా బాధ్యతగా చూస్తామని ఉదయ్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలోనే గవర్నెన్స్‌కు పెద్ద పీట వేస్తూ, ఇన్వెస్టర్లకు వెల్లడించే వివరాల విషయంలో పారదర్శకతను పాటిస్తున్నామన్నారు. ఈ దిశగా తొలి ట్యాక్స్ ట్రాన్స్‌పరెన్సీ నివేదికను ఆవిష్కరించినట్లు వివరించారు. దేశీయంగా సీపాస్ పరిశ్రమలో 35% వాటాతో తాన్లా మార్కెట్ లీడరుగా కొనసాగుతోందని ఉదయ్ రెడ్డి తెలిపారు.

3 రోజుల నష్టాలకు చెక్

- సెన్సెక్స్‌కు 481 పాయింట్ల లాభం
- 19,500 ఎగువకు నిఫ్టీ

ముంబై: ఐటీ, ఫార్మా, ప్రైవేట్ బ్యాంకు రంగాల షేర్లు రాణించడంతో శుక్రవారం స్టాక్ సూచీలు మూడు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ షేర్లు ఒకటిన్నర శాతం లాభపడి తమ వంతు తోడ్పాటు అందించాయి. ఫిచ్ అమెరికా రుణ రేటింగ్ తగ్గింపు ప్రతికూలతల నుంచి ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చింది. ఉదయం సెన్సెక్స్ 213 పాయింట్లు పెరిగి 65,454 వద్ద, నిఫ్టీ 81 పాయింట్లు బలపడి 19,463 వద్ద మొదలయ్యాయి. ఆయా రంగాల షేర్లకు రోజంతా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 558 పాయింట్లు దూసుకెళ్లి 65,799 వద్ద,



నిఫ్టీ 157 పాయింట్లు బలపడి 19,539 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. చివరి అరగంటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సూచీలు కొంత మేర లాభాలు కోల్పోయాయి. చివరికి సెన్సెక్స్ 481 పాయింట్లు పెరిగి 65,721 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 136 పాయింట్లు బలపడి 19,517 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.1.8 లక్షల కోట్లు పెరిగి రూ. 304.09 లక్షల కోట్లకు చేరింది.

ఆయిల్ ఇండియాకు మహారత్న హోదా

ఓఎన్‌జీసీ విదేశ్‌కు నవరత్న

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఆయిల్ ఇండియా (ఓఐఎల్)తాజాగా 'మహారత్న' హోదాకు అప్‌గ్రేడ్ అయ్యింది. దీనితో సంస్థ బోర్డుకు ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో మరింత స్వేచ్ఛ లభించనుంది. అప్‌గ్రేడ్ అనంతరం మహారత్న హోదా గల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్‌ఈ) ఓఐఎల్ పదమూడో సంస్థగా నిలవనుంది. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ ఈ విషయాలు వెల్లడించింది. అలాగే, ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ (ఓవీఎల్)ను నవరత్న సీపీఎస్‌ఈగా అప్‌గ్రేడ్ చేసినట్లు వివరించింది.



సాక్షి స్పోర్ట్స్



సానియా–షోయబ్ మధ్య విభేదాలు!

ముంబై: భారత స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా తన భర్త, పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో విడిపోయిందా! గతంలో కూడా పలుమార్లు వీరి విడాకులపై పుకార్లు రావడం, వాటిని సన్నిహితులు ఖండించడం జరిగాయి. అయితే ఈసారి జరిగిన పరిణామం మరోసారి అదే అనుమానాన్ని రేకెత్తిస్తోంది. షోయబ్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి రిలేషన్‌షిప్ స్టేటస్‌లో చేసిన మార్పుతో ఈ చర్చ మొదలైంది. ఇప్పటివరకు షోయబ్ ప్రొఫైల్‌లో 'సూపర్ ఉమన్ సానియా హజ్బెండ్' అంటూ ఉండగా, ఇప్పుడు మారి 'ఫాదర్ టు వన్' అని వచ్చింది. దీంతో వీరిద్దరు విడిపోయారని వార్తలు వస్తున్నాయి. అయితే ఇది వారి వ్యక్తిగత వ్యవహారమని, దీనిపై ఏ రకంగా వారు స్పందించదల్చుకోలేదని సానియా కుటుంబ వర్గాలు వెల్లడించాయి. సానియా, షోయబ్ మధ్య 2010లో పెళ్లి జరగ్గా... 2018లో కొడుకు ఇజహాన్ పుట్టాడు.

కాంస్యంతో జ్యోతి జాతీయ రికార్డు



చెంగ్డూ (చైనా): భారత స్టార్ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ మరో ఘనత సాధించింది. ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పతకం నెగ్గిన తొలి భారతీయ అథ్లెట్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును విశాఖపట్నం జిల్లాకు చెందిన 23 ఏళ్ల జ్యోతి 12.78 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో 12.82 సెకన్లతో గత ఏడాది తానే నెలకొల్పిన జాతీయ రికార్డును జ్యోతి బద్దలు కొట్టింది. గత నెలలో ఆసియా చాంపియన్‌గా నిలిచిన జ్యోతి తదుపరి ఈనెల మూడో వారంలో హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పోటీపడుతుంది. అథ్లెటిక్స్‌లో శుక్రవారమే భారత్ ఖాతాలో రెండో పతకం చేరింది. పురుషుల 200 మీటర్ల విభాగంలో అమ్లాన్ బొర్గోహైన్ కాంస్య పతకం సాధించాడు. అమ్లాన్ 20.55 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం భారత జట్టు 11 స్వర్ణాలు, 5 రజతాలు, 9 కాంస్యాలతో కలిపి మొత్తం 25 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

భారత్, జపాన్ మ్యాచ్ 'డ్రా'



హర్మన్‌ప్రీత్

చెన్నై: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత్ తమ రెండో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. శుక్రవారం జపాన్‌తో జరిగిన మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. ఇరు జట్ల ఆటగాళ్లు ఆరంభం నుంచే పట్టుదల కనబరచడంతో మ్యాచ్ ఆఖరిదాకా పోటాపోటీగా సాగింది. రెండో క్వార్టర్ ముగిసే దశలో జపాన్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెన్ నగయొషి (28వ ని.లో) గోల్‌గా మలచడంతో జపాన్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం మూడో క్వార్టర్‌లో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా గోల్‌పోస్ట్‌లోకి నెట్టాడు. స్కోరు సమం కాగా... ఆఖరి క్వార్టర్‌లో మరో గోల్ నమోదు కాలేదు. ఇతర మ్యాచ్‌ల్లో మలేసియా 5–1తో చైనాపై ఘనవిజయం సాధించగా... డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన పోరు కూడా 1–1తో 'డ్రా' అయ్యింది. ఆదివారం జరిగే తదుపరి లీగ్ మ్యాచ్‌లో భారత్... మలేసియాతో తలపడుతుంది.

ఆర్‌సీబీ హెడ్ కోచ్‌గా ఫ్లవర్



బెంగళూరు: ఐపీఎల్‌లో ఒక్కసారి కూడా విజేతగా నిలువలేకపోయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మరోసారి కోచింగ్ బృందంలో కీలక మార్పు చేసింది. జట్టు హెడ్ కోచ్‌గా జింబాబ్వే మాజీ కెప్టెన్, కోచింగ్‌లో అపార అనుభవం ఉన్న ఆండీ ఫ్లవర్‌ను ఎంపిక చేసింది. దాంతో ఇప్పటి వరకు హెడ్ కోచ్‌గా ఉన్న సంజయ్ బంగర్‌తో పాటు క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ హోదాలో టీమ్‌ను పూర్తి స్థాయిలో నడిపించిన మైక్ హెసన్‌పై వేటు పడినట్లయింది. నాలుగు సీజన్ల పాటు హెసన్ డైరెక్టర్‌గా పని చేయగా... మూడుసార్లు ప్లే ఆఫ్స్‌కు చేరిన బెంగళూరు 2023 సీజన్‌లో ఆరో స్థానంతో ముగించింది. అయితే ఈ ప్రదర్శన ఆర్‌సీబీ యాజమాన్యానికి సంతృప్తినివ్వలేదు.

మూడో రౌండ్‌లో అర్జున్



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 'టైబ్రేక్' ద్వారా ఫలితం తేలిన రెండో రౌండ్‌లో అర్జున్ 3.5–2.5తో సెర్గీ అజరోవ్ (రష్యా)పై గెలిచాడు. భారత్‌కే చెందిన విదిత్ 4.5–3.5తో దిమిత్రోస్ (గ్రీస్)పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరగా... ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ 1.5–2.5తో నకమురా (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. మహిళల విభాగంలో మేరీ ఆన్ గోమ్స్ (భారత్) 2.5–1.5తో కాటరీనా లాగ్నో (రష్యా)ను ఓడించి మూడో రౌండ్‌కు చేరింది.

భారత్ బాణం బంగారం

బెర్లిన్‌లో భారత మహిళల బృందం అద్భుతం చేసింది. గతంలో ఎవరికీ సాధ్యంకాని ఘనతను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తొలిసారి దేశానికి స్వర్ణ పతకాన్ని అందించి కొత్త చరిత్రను లిఖించింది. ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు 1931లో మొదలు కాగా భారత ఆటగాళ్లు మాత్రం 1981 నుంచి ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు. తాజా పసిడి పతక ప్రదర్శనకంటే ముందు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు 11 పతకాలురాగా అందులో తొమ్మిది రజతాలు, రెండు కాంస్యాలు ఉన్నాయి. ఈ పతకాల సరసన తొలిసారి పసిడి పతకం వచ్చి చేరింది.

ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తొలిసారి స్వర్ణం

- చరిత్ర సృష్టించిన జ్యోతి సురేఖ, అదితి, పర్ణీత్ కౌర్ బృందం
- మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో విశ్వవిజేతగా భారత్



జ్యోతి సురేఖ

స్వర్ణాలతో అదితి, పర్ణీత్, జ్యోతి సురేఖ

బెర్లిన్ (జర్మనీ): ఎట్టకేలకు భారత ఆర్చరీ పసిడి కల నెరవేరింది. ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో ఎంతోకాలంగా ఊరిస్తున్న స్వర్ణ పతకం మన దరి చేరింది. తెలుగుతేజం వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర అమ్మాయి అదితి స్వామి, పంజాబ్ క్రీడాకారిణి పర్ణీత్ కౌర్ బాణాల గురికి భారత్ ఖాతాలో బంగారు పతకం వచ్చింది. శుక్రవారం జరిగిన మహిళల కాంపౌండ్ టీమ్ విభాగం ఫైనల్లో జ్యోతి సురేఖ, అదితి, పర్ణీత్‌లతో కూడిన భారత జట్టు 235–229 పాయింట్ల తేడాతో డాఫ్ని క్వింటెరో, అనా సోఫియా హెర్నాండెజ్ జియోన్, ఆండ్రియా బెసెరాలతో కూడిన మెక్సికో జట్టుపై గెలిచి విశ్వవిజేతగా అవతరించింది. 2017, 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో ఫైనల్ చేరిన భారత జట్టు రజత పతకాలతో సరిపెట్టుకోగా... మూడో ప్రయత్నంలో మాత్రం పసిడి స్వప్నాన్ని సాకారం చేసుకుంది. భారత బృందం స్వర్ణం నెగ్గడంలో సీనియర్ జ్యోతి సురేఖ కీలకపాత్ర పోషించింది. తొమ్మిదోసారి ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న 27 ఏళ్ల జ్యోతి సురేఖ ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తోంది. మెక్సికోతో జరిగిన ఫైనల్లో భారత జట్టు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా నాలుగు సిరీస్‌ల లోనూ పైచేయి సాధించింది. ఒక్కో సిరీస్‌లో జట్టులోని ముగ్గురు సభ్యులు రెండు బాణాల చొప్పున మొత్తం ఆరు బాణాలు సంధిస్తారు. తొలి సిరీస్‌లో భారత్ 59–57తో, రెండో సిరీస్‌లో 59–58తో... మూడో సిరీస్‌లో 59–57తో.. నాలుగో సిరీస్‌లో 58–57తో ఆధిక్యం సంపాదించి చివరకు 235–229తో విజయం సాధించింది.

నేడు జరిగే వ్యక్తిగత విభాగం నాకౌట్ దశ మ్యాచ్‌ల్లో జ్యోతి సురేఖ, పర్ణీత్, అదితి పోటీపడనున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో పర్ణీత్‌తో జ్యోతి సురేఖ, సాన్ డి లాట్ (నెదర్లాండ్స్)తో అదితి ఆడతారు. గెలిస్తే జ్యోతి, అదితి సెమీఫైనల్లో తలపడతారు.

12 ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్ నెగ్గిన మొత్తం పతకాలు. ఇందులో ఒక స్వర్ణం, తొమ్మిది రజతాలు, రెండు కాంస్య పతకాలు ఉన్నాయి.

7 ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో జ్యోతి సురేఖ గెలిచిన మొత్తం పతకాలు. 2021లో మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో 3 రజత పతకాలు. 2017లో మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో ఒక రజతం. 2019లో మహిళల టీమ్ విభాగంలో, వ్యక్తిగత విభాగంలో 2 కాంస్య పతకాలు... 2023లో మహిళల టీమ్ విభాగంలో ఒక స్వర్ణం.

ఈ పతకం ఎంతో ప్రత్యేకం

ఈసారి ఎలాగైనా స్వర్ణ పతకం సాధించాలనే లక్ష్యంతో వచ్చాం. గతంలో రజత, కాంస్య పతకాలు గెలిచా. ఇది కేవలం ఆరంభం మాత్రమే. భవిష్యత్‌లో మరిన్ని పసిడి పతకాలు సాధిస్తాం. తొలి స్వర్ణం కావడంతో ఈ పతకం నాతోపాటు నా సహచరులకు ఎంతో ప్రత్యేకం. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో టీమ్, వ్యక్తిగత విభాగాల్లో పలు పతకాలు నెగ్గినా స్వర్ణం మాత్రం దక్కలేదు. ఈసారి బంగారు పతకం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉన్నాను. నేడు వ్యక్తిగత విభాగంలో పోటీపడుతున్నాను. ఇందులోనూ స్వర్ణం గెలవడమే నా లక్ష్యం. నేనీస్థాయికి చేరుకోవడానికి ఎల్లవేళలా మద్దతు ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు. –జ్యోతి సురేఖ

క్వార్టర్స్‌లో సింధు, శ్రీకాంత్ అవుట్

సెమీస్‌లో ప్రణయ్‌తో ప్రియాన్షు 'ఢీ' • ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



సిడ్నీ: ఈ సీజన్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఏ టోర్నీలో ఆడినా నిరాశ తప్పడంలేదు. తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆమె క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు 12–21, 17–21తో ప్రపంచ 12వ ర్యాంకర్ బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల ఈవెంట్‌లో మాత్రం మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ప్రపంచ 9వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్, యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ సెమీఫైనల్ చేరగా, మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్‌కు క్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. ఆరో సీడ్ ప్రణయ్ 16–21, 21–17, 21–14తో టాప్‌సీడ్ ఆంథోనీ సినిసుక జిన్‌టింగ్ (ఇండోనేసియా)పై పోరాడి గెలుపొందగా, ప్రియాన్షు 21–13, 21–8తో సీనియర్ సహచర ఆటగాడు శ్రీకాంత్‌కు షాక్ ఇచ్చాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రణయ్‌తో ప్రియాన్షు ఆడతాడు. దీంతో ఎవరు గెలిచినా... భారత షట్లర్ ఒకరు ఫైనల్ చేరడం, కనీసం రన్నరప్ ఖాయమవుతుంది. గెలిస్తే టైటిల్ చేజిక్కుతుంది.

క్లుప్తంగా...

రీజినల్ కోడింగ్ సెంటర్‌లో పూర్తి స్థాయి సేవలు

- 'ఈనాడు' కథనంలో వాస్తవం లేదు
- వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: అమరావతిలోని రాష్ట్ర విత్తన క్షేత్రంలో ఫెర్టిలైజర్ టెస్టింగ్ ల్యాబ్, ఫెర్టిలైజర్ కోడింగ్ సెంటర్, డీఎన్ఏ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'నిర్మాణాలకు రూ.5 కోట్లు పోశారు, గాలికొదిలేశారు' అంటూ ఈనాడులో వచ్చిన వార్తా కథనంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ప్రతిపాదించిన ల్యాబ్‌ల కోసం భవన నిర్మాణాల బాధ్యతను ఏపీ వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)కు అప్పగించామని వెల్లడించారు. ఫెర్టిలైజర్ కోడింగ్ సెంటర్ భవనంలో రీజినల్ కోడింగ్ సెంటర్‌ను ప్రారంభించి, పూర్తిస్థాయిలో సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. మిగిలిన రెండు భవనాలు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు.

ఇండియన్ మిలటరీ కాలేజ్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ-డెహ్రాడూన్)లో 8వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ శుక్రవారం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. www.rimc.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా జనరల్ అభ్యర్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీలు రూ.555 చెల్లించి ఆర్ఐఎంసీ నుంచి దరఖాస్తులు, పాత ప్రశ్నాపత్రాల బుక్‌లెట్లు పొందవచ్చు. 2024 జూలై 1నాటికి ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు.. దరఖాస్తులను అక్టోబర్ 15లోగా విజయవాడలోని ఏపీపీఎస్సీ కమిషన్ కార్యాలయానికి పంపించాలి. డిసెంబర్ 2న రాత పరీక్ష ఉంటుంది.

12మందికి నాన్ కేడర్ ఎస్పీలుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 12 మంది అదనపు ఎస్పీ (సివిల్)లకు నాన్ కేడర్ ఎస్పీలుగా పదోన్నతి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2022-23కుగానూ నాన్ కేడర్ ఎస్పీలుగా పదోన్నతుల కోసం హోం శాఖ పదోన్నతుల కమిటీ సిఫార్సులను ఆమోదించింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు ఎస్పీలు డి.హిమవతి, పి.శ్రీనివాస్, కె.లతామాధురి, పి.వెంకటరత్నం, కె.కృష్ణప్రసన్న, కరీముల్లా షరీఫ్, ఎస్.రజిని, షేక్ షకీలాబాను, డీఎస్ మహేశ్, బి.ప్రసాదరావు, పీవీఆర్ఎస్ఎస్ఎస్ఆర్ వర్మ, పి.సోమశేఖర రావు నాన్ కేడర్ ఎస్పీలుగా పదోన్నతి పొందనున్నారు.

ఆ ప్రొఫెసర్లను కొనసాగించండి: సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 2017, 2018లో చేపట్టిన ప్రొఫెసర్ల నియామకాలు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆయా నియామకాలు రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లను శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ ప్రొఫెసర్లను కొనసాగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని ఏపీ ప్రభుత్వం ధర్మాసనానికి స్పష్టం చేసింది. అనంతరం ప్రొఫెసర్ల నియామకాలు సక్రమమేనని,వారిని కొనసాగించాలని ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల తొలగింపుపై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను సెప్టెంబరు 4కు వాయిదా వేసింది.

98.27 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: ఆగస్టు నెలకు సంబంధించి శుక్రవారం సాయంత్రానికి 98.27 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు వెల్లడించారు. మొత్తం 62,77,106 మంది లబ్ధిదారుల కోసం ప్రభుత్వం రూ.1,729.22 కోట్లు విడుదల చేయగా... ఇప్పటి వరకు 61,68,445 మందికి రూ.1,699.11 కోట్లు అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు.

ఏడు నెలలు గర్భిణి... అయినా సేవే ముఖ్యం




కాకినాడ జిల్లా కృష్ణునిపాలెం పంచాయతీకి చెందిన కొల్లం రాణి వలంటీర్‌గా పనిచేస్తోంది. ఆమె ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. అదే పంచాయతీకి చెందిన నెల్లిమి ఝాన్సీ అనే దివ్యాంగురాలు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకుని 30 కిలో మీటర్ల దూరంలోని ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేసింది. – గోకవరం

వివేకా లేఖను పట్టించుకోరా?

అన్ని గొడ్డలి వేట్లు పడ్డాక ఆయన లేఖ రాశారా?

మెదడు బయటికి వచ్చాక కూడా రాయడం సాధ్యమేనా?

- ఈ విషయంపై వైద్యుల అభిప్రాయం తీసుకోవాలి కదా!
- ఇంత ముఖ్యమైన అంశాన్ని ఎందుకు విస్మరించారు?
- ఘటనా స్థలంలో వేలి ముద్రల సంగతి ఏమైంది?
- అక్కడున్న వారందరివీ కాకుండా కొత్త వేలి ముద్రలు ఎవరివి?
- నిందితులు ఆస్తి పత్రాల కోసం వెదికారన్నది వాస్తవం..
- అలాంటప్పుడు ఈ అంశంపై ఎందుకు దృష్టి పెట్టలేదు?
- అవగాహన లేకుండా గూగుల్ టేక్ అవుట్ అంటూ హడావుడి దేనికి?
- ఐపీడీఆర్ డేటా ద్వారా కాల్స్, మెసేజ్‌ల వివరాలన్నీ తెలియవు
- వివేకా హత్య కేసు దర్యాప్తు తీరుపై 'ద వైర్' విశ్లేషణాత్మక కథనం



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అత్యంత కీలకమైనదిగా భావిస్తున్న వివేకా లేఖపై సీబీఐ నిశితంగా దృష్టి సారించక పోవడం విస్మయ పరుస్తోందని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్ 'ద వైర్' పేర్కొంది. 'డ్రైవర్ ప్రసాద్ తనపై తీవ్రంగా దాడి చేసినట్టు వివేకా పేర్కొన్నట్టుగా ఆ లేఖలో ఉంది. ఆ లేఖను వంట మనిషి లక్ష్మమ్మ కుమారుడు ప్రకాశ్ చూసి పీఏ కృష్ణా రెడ్డికి ఇచ్చాడు. ఆయన వెంటనే అంటే ఉదయం 6.29 గంటలకు వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి ఆ లేఖలో ఉన్న సమాచారాన్ని చదివి వినిపించారు. తాము వచ్చే వరకు ఆ లేఖను గోప్యంగా ఉంచమని, ఎవ్వరికీ ఇవ్వొద్దని చెప్పారు. దాంతో కాసేపటి తర్వాత అక్కడకు చేరుకున్న సీఐ శంకరయ్యకు కూడా కృష్ణా రెడ్డి ఆ లేఖ విషయం చెప్పలేదు. వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తదితరులు పులివెందులకు చేరుకున్నాక ఆ రోజు సాయంత్రం ఆ లేఖను వైఎస్సార్ జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మకు అప్పగించారు' అనే విషయాన్ని చార్జ్‌షీట్‌లో ప్రస్తావించడం మినహా ఇంత కీలకమైన విషయంపై సీబీఐ ఎందుకు లోతుగా దర్యాప్తు చేయలేదని ప్రశ్నించింది. రాజకీయ, నేర సంబంధమైన పరిశోధనాత్మక పాత్రికేయంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ జర్నలిస్ట్ సరితా రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన రెండవ కథనంలో మరిన్ని ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

తీవ్ర గాయాలతో లేఖ రాయగలిగారా?

వివేకా లేఖపై ఇప్పటికీ సందిగ్ధత తొలగిపోలేదు. సీబీఐ దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి వాంగ్మూలం ఇప్పించేంత వరకు ఆ లేఖ ఎప్పుడు రాశారన్న దానిపై స్పష్టత రాలేదు. వివేకాపై దాడి తర్వాత ఆయనతో బలవంతంగా ఆ లేఖను తాము ఎలా రాయించిందీ దస్తగిరి వెల్లడించాకే సందేహాలు మరింతగా పెరిగాయి. అప్రూవర్‌గా మారిన దస్తగిరి తన వాంగ్మూలంలో వెల్లడించిన ప్రకారం.. మొదట సునీల్ యాదవ్ వివేకానందరెడ్డి ముఖంపై గట్టిగా కొట్టాడు. దాంతో వివేకా కింద పడిపోయారు. ఉమాశంకర్ రెడ్డి గొడ్డలితో వివేకా నుదుటి మీద నరికాడు. వివేకా నుదుటి మీద 3.5 ఇంచ్‌ల వెడల్పు, 6 ఇంచ్‌ల లోతుగా పక్క పక్కనే రెండు గాయాలున్నాయని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. సునీల్‌యాదవ్ వివేకా గుండెపై 15–16 సార్లు గట్టిగా పిడిగుద్దులు గుద్దాడు. ఉమాశంకర్ రెడ్డి తన చేతిలో ఉన్న గొడ్డలిని దస్తగిరికి ఇచ్చి వివేకా లేవకుండా చూడమని చెప్పారు. తాము భూమి పత్రాలు ఎక్కడ ఉన్నాయో వెతుకుతాం అని చెప్పాడు. వివేకా అతి కష్టం మీద లేవడానికి ప్రయత్నిస్తూ నా ఇంట్లో ఏం వెతుకుతున్నారని ప్రశ్నించారు. దాంతో దస్తగిరి గొడ్డలితో వివేకా కుడి చేతి మీద దాడి చేశాడు. దీంతో వివేకా కుడి అరచేతిలో 2 ఇంచ్‌ల వెడల్పు, ఒక ఇంచి లోతున గాయం ఉందని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. కుడి చేతి మీద గొడ్డలితో గాయపరిచిన తర్వాత వివేకాతో నిందితులు లేఖ రాయించారు. కుడి చేతివాటం వ్యక్తి అయిన వివేకా ఆ లేఖ రాశారని సీబీఐ పేర్కొంది. గాయం వల్ల వివేకా మెదడు బయటకు వచ్చిందని దస్తగిరి పేర్కొనడం గమనార్హం. అంత తీవ్ర గాయమైన తర్వాత లేఖ రాసే స్థితిలో వివేకా ఉన్నారా అన్నది ప్రశ్నార్థకం. ఆ లేఖ వివేకానే రాసినట్టు హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (సీఎఫ్ఎస్ఎల్) నిర్ధారించింది. కాగా తీవ్రమైన ఒత్తిడి, అత్యంత సంక్లిష్ట ప్రక్రియ నడుమ ఆ లేఖ రాసినట్టుగా ఉందని ఢిల్లీలోని సీఎఫ్ఎస్ఎల్ నివేదిక వెల్లడించింది. కానీ అంతటి తీవ్ర గాయాలు అయ్యాక.. మెదడు బయటకు వచ్చిన తర్వాత కూడా ఓ వ్యక్తి అలా లేఖ రాయడం సాధ్యమా? అని సీబీఐ వైద్య నిపుణులను సంప్రదించకపోవడం విడ్డూరం.

ఆ వేలి ముద్రలు ఎవరివో?

హత్య కేసు దర్యాప్తులో వేలి ముద్రలు అత్యంత కీలకం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే వివేకా హత్యకు గురైన స్థలంలో గుర్తించిన మూడు గుర్తు తెలియని వేలి ముద్రలు ఎవరివనే విషయంపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టి సారించకపోవడం విస్మయ పరుస్తోంది. వివేకా నివాసంలోని బాత్‌రూమ్ గోడల టైల్స్ మీద రెండు వేలి ముద్రలు, తలుపు వెనుక ఒక వేలి ముద్రను క్లూస్ టీమ్ గుర్తించింది. గోడల టైల్స్ మీద ఉన్న వేలి ముద్రలు రక్తంతో ఉండటం గమనార్హం. కాగా ఆ మూడు వేలి ముద్రలు నిందితులు నలుగురితోపాటు వివేకా నివాసానికి వచ్చిన బంధువులు, ఇతరుల వేలి ముద్రలతో సరిపోల లేదు. అంటే ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆ రోజు రాత్రి వివేకా నివాసంలో ఉన్నట్టుగా భావించాల్సి వస్తోంది. కానీ సీబీఐ ఇప్పటి వరకు ఆ వేలి ముద్రలు ఎవరివనే దిశగా దర్యాప్తు చేయనే లేదు.

ఐపీడీఆర్ డేటా అహేతుకం

ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు 'ఇంటర్నెట్ ప్రొటోకాల్ డీటైల్ రికార్డ్స్(ఐపీడీఆర్) నివేదిక ఆధారంగా గుర్తించినట్టు సీబీఐ పేర్కొంది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 1.37 గంటల నుంచి 5.02 గంటల వరకు వారిద్దరి మొబైల్ ఫోన్ల డేటా ఆన్‌లో ఉన్నట్టుగా చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ ఐపీడీఆర్ డేటా అన్నది శాస్త్రీయంగా కచ్చితమైన ఆధారం కాదు. ఆ సమయంలో మొబైల్ ఫోన్లు ఆన్‌లో ఉన్నాయని మాత్రమే ఐపీడీఆర్ చెబుతుంది. సాధారణంగా అర్ధరాత్రి దాటిన తర్వాత మొబైల్ నెట్‌వర్క్‌లు తమ డేటా బ్యాకప్ తీసుకుంటూ ఉంటాయి. దాంతో మొబైల్ డేటా ఆన్‌లో ఉన్నట్టు చూపిస్తుంది. అంత మాత్రాన ఆ మొబైల్ ఫోన్ల ద్వారా మాట్లాడుతున్నట్టుగానీ, మెసేజ్‌లు పంపిస్తున్నట్టుగానీ నిర్ధారించినట్టు కాదు. ఇక ఆ ఫోన్ల నుంచి ఇతర ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లాయా.. లేదా అన్నది కూడా ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. కాబట్టి ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్ రెడ్డి మధ్య ఆ రోజు రాత్రి వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించలేం. ఈ విషయంలో సీబీఐ వాదన పూర్తిగా అహేతుకమని స్పష్టమవుతోంది. గంగిరెడ్డి మొబైల్ ఫోన్ నుంచి వెళ్లిన మెసేజ్‌లను గుర్తించేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదని సీబీఐ తెలిపింది. కాగా 2019 మార్చి 15నే ఎర్ర గంగిరెడ్డి మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డేటాను పరిశీలించినప్పటికీ అందులో అనుమానాస్పదమైన సమాచారం ఏమీ లభించలేదని పోలీసులు ప్రకటించిన విషయం ప్రాధాన్యం సంతరించుకుంది.

రూ.40 కోట్ల డీల్ కథ తేల్చలేదెందుకు?

అసలు వివేకానందరెడ్డిని నిందితులు ఎందుకు హత్య చేశారనే అంశంపై సీబీఐ వాదన అసంబద్ధంగా ఉంది. దస్తగిరి వాంగ్మూలం ప్రకారం.. వివేకాను హత్య చేస్తే శివశంకర్ రెడ్డి రూ.40 కోట్లు ఇస్తారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని దస్తగిరి పేర్కొన్నాడు. అందుకు సునీల్ యాదవ్ ద్వారా దస్తగిరికి అడ్వాన్స్‌గా రూ.కోటి పంపించారు. అందులో రూ.25 లక్షలు సునీల్ యాదవ్ అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బులతో పులివెందులలో విల్లా కొనుగోలు చేయాలని భావించినట్టు దస్తగిరి చెప్పాడు. కాగా ఇక్కడ ప్రశ్నార్థకం ఏమిటంటే.. వివేకా హత్య కోసం కుదిరినట్టు చెబుతున్న డీల్ డబ్బును సీబీఐ ఇప్పటికీ రికవరీ చేయలేకపోయింది. కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కూడా సీబీఐని ఇదే విషయంపై ప్రశ్నించారు. నిందితుల మధ్య చేతులు మారినట్టు చెబుతున్న డబ్బును ఎందుకు రికవరీ చేయలేకపోయారంటే సీబీఐ సరైన సమాధానం చెప్పలేకపోయింది. పులివెందులలో చెప్పుల దుకాణం నిర్వహిస్తున్న మున్నా బ్యాంక్ లాకర్ నుంచి రికవరీ చేసిన రూ.46.70 లక్షలకు సంబంధించి సీబీఐ చెబుతున్న వాదన నమ్మదగ్గదిగా లేదని కూడా న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. 2020 సెప్టెంబర్ 9న మున్నా బ్యాంకు లాకర్లో ఉన్న రూ.46.70 లక్షలను సీబీఐ జప్తు చేసింది. ఈ జప్తు వ్యవహారం భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 27 ప్రకారం లేదని న్యాయస్థానం స్పష్టం చేయడం గమనార్హం.

గూగుల్ టేక్ అవుట్‌పై మాట మారింది!

నిందితులు 2019 మార్చి 14, 15 తేదీల్లో ఎక్కడ ఉన్నారనే విషయాన్ని గూగుల్ టేక్ అవుట్ ద్వారా నిర్ధారించామన్న సీబీఐ వాదన తప్పని తేలిపోయింది. ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి ఫోన్లు వారి ఇళ్లలోనే ఉన్నట్టుగా సెల్ టవర్ల లోకేషన్ స్పష్టం చేస్తోంది. కాగా సునీల్ యాదవ్ మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ డేటాపై సీబీఐ ఎక్కువగా దృష్టి సారించింది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 2.42 గంటలకు సునీల్ యాదవ్ వివేకా నివాసంలో ఉన్నట్టు.. 2.34 గంటలకు వివేకా నివాసానికి 15 మీటర్ల దూరంలో, 2.35 గంటలకు వివేకా నివాసానికి 10 మీటర్ల దూరంలో ఉన్నట్టు.. 2.42 గంటలకు వివేకా నివాసంలో ఉన్నట్టుగా పేర్కొంది. కాగా సునీల్ యాదవ్ నివాసం వివేకా నివాసానికి 160 మీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఎంతో ముఖ్యమైన అంశం. ఎందుకంటే పట్టణ ప్రాంతాల్లో గూగుల్ టేక్ అవుట్ డేటాకు, వాస్తవ లోకేషన్‌కు 500 మీటర్ల నుంచి 1,500 మీటర్ల వరకు వ్యత్యాసం ఉంటుందని నిపుణులే స్పష్టం చేస్తున్నారు. అందుకే ఈ కేసు విచారణ సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఆ విషయాన్ని ప్రశ్నించారు. గూగుల్ టేక్ అవుట్ డేటాను బట్టి ఎలా నిర్ధారించగలుగుతారని అడిగారు. దాంతో సీబీఐ తన మూడో అనుబంధ చార్జ్‌షీట్‌లో మాట మార్చింది. యూనివర్సల్ కాలమానానికి (యూటీసీ), భారత కాలమానానికి (ఐటీసీ) మధ్య వ్యత్యాసాన్ని తాము గమనించక పొరపాటు చేశామని వెల్లడించడం గమనార్హం. గూగుల్ టేక్ అవుట్ డేటాను విశ్లేషిస్తూ ఢిల్లీలోని సీఎఫ్ఎస్ఎల్ పేర్కొన్న సమయం యూటీసీ కాలమానం ప్రకారం అని వెల్లడించింది. వాస్తవానికి యూటీసీ కాలమానం కంటే భారత కాలమానం 5.30 గంటలు ముందుంటుంది. అంటే సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 14 అర్ధరాత్రి దాటిన తర్వాత 2.42 గంటలకు ఉన్నట్టు తాము మొదటి చార్జ్‌షీట్‌లో పేర్కొంది వాస్తవం కాదని సీబీఐ అంగీకరించింది. సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 15న ఉదయం 8.12 గంటలకు ఉన్నారని తెలిపింది. అంటే వివేకా హత్యకు గురయ్యారని అందరికీ తెలిసిన తర్వాత కొన్ని వందల మంది అక్కడ గుమిగూడిన తర్వాత సునీల్ యాదవ్ చేరుకున్నారని చెప్పింది.

ఆస్తి వివాదాన్ని ఎందుకు పట్టించుకోలేదు?

రాజకీయ కారణాలతోనే వివేకాను హత్య చేశారని సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ దస్తగిరి, రంగన్న వాంగ్మూలాలను పరిశీలిస్తే ఆస్తి కోసం ఈ హత్య చేసి ఉండొచ్చన్నది స్పష్టమవుతోంది. ఎందుకంటే వివేకాను హత్య చేసిన తర్వాత నిందితులు ఆస్తి పత్రాల కోసం ఆయన నివాసంలో వెతికారన్నది స్పష్టమవుతోంది. ఆ నివాసంలో అల్మారా (బీరువా) తలుపు బద్దలు గొట్టడానికి ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు కూడా. అంటే హత్యకు ఆస్తి వివాదం ప్రధాన కారణం కావచ్చు. నిందితులు ఏ పత్రాల కోసం వెతికారన్నది సీబీఐ ఇప్పటి వరకు గుర్తించలేకపోయింది. దొంగతనం, ఆస్తి వివాదం అనే కోణంలో సీబీఐ ఈ కేసును ఎందుకు దర్యాప్తు చేయడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఒకే సమయంలో రెండు చోట్ల ఉండటం సాధ్యమా?

సునీల్ యాదవ్ ఎక్కడ ఉన్నారనే దానిపై సీబీఐ వాదనలు మరింత అసంబద్ధంగా ఉన్నాయి. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన వాంగ్మూలం, రంగన్న వాంగ్మూలం ప్రకారం ఆ రోజు రాత్రి 1.30 గంటల నుంచి 3 గంటల వరకు సునీల్ యాదవ్ వివేకానందరెడ్డి నివాసం లోపల ఉన్నాడు. కానీ ఆ రోజు రాత్రి 1.58 గంటలకు సునీల్ యాదవ్.. వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసంలో ఉన్నట్టుగా గూగుల్ టేక్ అవుట్ డేటా చూపిస్తోందని కూడా సీబీఐ పేర్కొంది. ఒకే సమయంలో ఒక వ్యక్తి వేర్వేరు చోట్ల ఎలా ఉండగలరు? సునీల్ యాదవ్ ఆ సమయంలో వైఎస్ భాస్కర్ రెడ్డి నివాసంలో ఉంటే.. అదే సమయంలో అక్కడికి కిలోమీటర్ దూరంలో ఉన్న వివేకా నివాసంలో కూడా ఉండి ఆయన్ను ఎలా హత్య చేయగలడు? మరి సీబీఐ ఇంత చిన్న అంశాన్ని విస్మరిస్తూ కేసు దర్యాప్తు చేస్తుండటం ఏమిటి?

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీల ప్రైవేటు మెంబర్ బిల్లులు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు తలారి రంగయ్య, సంజీవ్‌కుమార్ ప్రైవేట్ మెంబర్ బిల్లులు ప్రవేశపెట్టారు.

పట్టణ ప్రాంతాల్లో వందరోజుల ఉపాధి కల్పించాలి

పట్టణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు పెంచడానికి 100 రోజుల గ్యారెంటీ ఉపాధి కల్పించాలని తలారి రంగయ్య కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టారు. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రతి కుటుంబంలో అర్హులైన ఒకరికి ఉపాధి కల్పించాలని బిల్లులో పేర్కొన్నారు.

జిల్లాకో దివ్యాంగుల పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలి

శారీరక, మానసిక వైకల్యం ఉన్న వారికి తోడ్పడేలా జిల్లాకో దివ్యాంగుల పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని సంజీవ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టారు. దివ్యాంగులకు ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాలు, పునరావాససేవలు అమలు చేయడానికి వికలాంగుల హక్కుల చట్టం బాధ్యత వహిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సిన మాండేటరీ లేదని ఆయన గుర్తుచేశారు.

జాతీయ స్థాయిలో చేనేత కార్మికుల వెల్ఫేర్ అథారిటీ ఏర్పాటు చేయాలి

చేనేత కార్మికుల భద్రత నిమిత్తం జాతీయస్థాయిలో వెల్ఫేర్ అథారిటీ ఏర్పాటు చేయాలని సంజీవ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా 35,33,512 మంది చేనేత కార్మికులు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని బిల్లులో పేర్కొన్నారు.

అఖిల భారత వైద్యసేవలు ప్రవేశపెట్టాలి

కరోనా మహమ్మారి వంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో సమర్థమైన చర్యలు చేపట్టడానికి అఖిల భారత వైద్యసేవలు ఏర్పాటు చేయాలని కోరుతూ సంజీవ్‌కుమార్ ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టారు. తద్వారా వైద్య మౌలిక సదుపాయాలు ఏర్పాటు, ఆరోగ్య సంరక్షణ సేవల పర్యవేక్షణ మరింత సమర్థంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం సంజీవ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో మూడు ప్రైవేటు మెంబరు బిల్లులు ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విభజన హామీల సాధనకు ప్రైవేటు మెంబరు బిల్లు

- బిల్లులో ప్రత్యేక హోదా, రైల్వే జోన్ వంటి కీలకాంశాలు: ఎంపీ భరత్
- పోలవరం నిధులపై మిథున్ రెడ్డి మరో బిల్లు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ శుక్రవారం లోక్‌సభలో ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టారు. ప్రత్యేక హోదా, పోలవరం సవరించిన అంచనాలతో సహా పలు హామీల అమలుకు సంబంధించిన అంశాలను ఆయన బిల్లులో పొందుపరిచారు. అనంతరం ఏపీ భవన్‌లో భరత్ మీడియాతో మాట్లాడారు. విభజన హామీలను అమలుచేయాలంటూ రాజ్యసభలో ప్రైవేటు మెంబరు బిల్లును పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రవేశపెట్టారని.. ద్రవ్య బిల్లు అని చెప్పడంతో లోక్‌సభలో ప్రవేశపెట్టామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి నిమిత్తం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ బిల్లు ఎంతో ఉపకరిస్తుందన్నారు. బిల్లులో ప్రత్యేక హోదాను ప్రధానంగా ప్రస్తావించామని, వెనకబడిన జిల్లాలకు ప్యాకేజీ, రైల్వేజోన్ తదితర అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. గతంలో చంద్రబాబు తప్పిదాలను సవరిస్తూ ఏపీకి రావాల్సినవి తీసుకొస్తున్నామని భరత్ వివరించారు. వచ్చే సమావేశాల్లో బిల్లు చర్చకు వచ్చే అవకాశముందన్నారు. అలాగే, పోలవరం సవరించిన అంచనాల ఆమోదానికి సంబంధించి లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి మరో బిల్లు ప్రవేశపెడతారని భరత్‌రామ్ తెలిపారు. సీఎం జగన్ దిశానిర్దేశంతో పార్లమెంటులో వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నామని ఆయన తెలిపారు. ప్రజా ప్రయోజన బిల్లులకే పార్లమెంటులో మద్దతిస్తున్నామన్నారు. ప్రైవేటు మెంబరు బిల్లులు ఎందుకు ప్రవేశపెడుతున్నామో కేంద్రం ఆలోచించాలని ఎంపీ భరత్ తెలిపారు. ఏపీ విభజన చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత కేంద్రానికి లేదా అని ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో ఒక పెట్రో కెమికల్ రిఫైనరీ తీసుకురావాల్సి ఉందని, దానికి వయబిలిటీ గ్యాప్ ఫండ్ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పెట్టుకోవాలన్నారు. గుజరాత్, పారాదీప్‌ల్లోని రిఫైనరీలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అడిగారా? అని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటిస్తే ప్రధాని మోదీ చరిత్రలో నిలిచిపోతారని ఎంపీ తెలిపారు.

గోడ మీద పిల్లిలా టీడీపీ..

ఇక ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుపై టీడీపీ వ్యవహారం గోడ మీద పిల్లిలా ఉందని ఎంపీ భరత్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర అప్పులపై పార్లమెంటులో ప్రశ్నలు వేసి టీడీపీ ఎంపీలు అభాసుపాలయ్యారన్నారు. వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన లోకేశ్‌కు ధైర్యముంటే తనపై ఎంపీగా పోటీచేయాలని సవాల్ విసిరారు.

విశాఖకు రూ.800 కోట్ల రైల్వే ప్రాజెక్టులు

- రాజ్యసభలో కేంద్ర రైల్వే మంత్రి

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖకు రూ.800 కోట్ల విలువైన రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మంజూరు చేశామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం బీజేపీ ఎంపీ జీవీఎల్ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ ఈ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రారంభమైనట్లు చెప్పారు. విశాఖపట్నం నుంచి గోపాలపట్నం (15.31 కి.మీ.) మధ్య, దువ్వాడ నుంచి సింహాచలం నార్త్ (20.543 కి.మీ.) మధ్య, వడ్లపూడి-గేట్ జంక్షన్ క్యాబిన్ (12.04 కి.మీ.) మధ్య 3వ, 4వ లైన్ల ప్రాజెక్టులు, గంగవరం పోర్టు-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మధ్య టై లైన్, పెందుర్తి-సింహాచలం నార్త్ మధ్య సింహాచలం (7.135 కి.మీ.) రైలు ఫ్లైఓవర్ మంజూరు చేసినట్లు వివరించారు.

ట్రయల్ ప్రారంభమైనా బెయిలుకు దరఖాస్తు చేసుకోవచ్చు

వైఎస్ వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి సుప్రీంకోర్టు అనుమతి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ట్రయల్ ప్రారంభమైనప్పటికీ, నిందితుడు శివశంకర్‌రెడ్డి బెయిలు కోసం కింది కోర్టులో దరఖాస్తు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల్లో స్పష్టత కోరుతూ శివశంకర్‌రెడ్డి భార్య తులశమ్మ దాఖలు చేసిన అప్లికేషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. కేసు ట్రయల్ ఆరు నెలల్లో ప్రారంభం కాకపోతే బెయిలుకు దరఖాస్తు చేసుకోవచ్చని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని తులశమ్మ తరఫు సీనియర్ న్యాయవాది గిరి తెలపగా.. మిమ్మల్ని ఎవరు ఆపుతున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో గతంలో జరిగిన వాదనలను గిరి మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఒక వేళ ట్రయల్ ప్రారంభం అయితే బెయిలుకు దరఖాస్తు చేసుకొనే అవకాశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రధాన రిట్ పిటిషన్ ఏమిటని ధర్మాసనం ప్రశ్నించగా.. దర్యాప్తు అధికారిని మార్చాలని కోరగా కోర్టు ఆ మేరకు ఆదేశాలిచ్చిందని గిరి చెప్పారు. దర్యాప్తు పూర్తయిందని, ఛార్జిషీటు, సప్లిమెంటరీ ఛార్జిషీటు కూడా నమోదయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ 'బెయిలుకు దరఖాస్తు చేసుకొనే హక్కు మీకు ఉంది. బెయిలు ఇవ్వాలా లేదా అనేది కింది కోర్టు విచారించి నిర్ణయం తీసుకుంటుంది' అని వ్యాఖ్యానించింది. దర్యాప్తునకు అడ్డంకి సృష్టిస్తారా ఇతరత్రా విషయాలన్నీ కింది కోర్టు ముందు వాదనలు వినిపించుకోవాలని తెలిపింది. మెరిట్స్ ఆధారంగా అన్ని పక్షాల వాదనలు విని పరిష్కరించాలని కింది కోర్టుకు ధర్మాసనం సూచించింది.

విచారణ పరిధి తెలంగాణ హైకోర్టు తేలుస్తుంది

మార్గదర్శి కేసులో సుప్రీంకోర్టు.. అక్కడ ఊరట లభించకపోతే తిరిగి రావొచ్చని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ : మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో విచారణ పరిధిని తెలంగాణ హైకోర్టు తేలుస్తుందని సుప్రీం కోర్టు తెలిపింది. మార్గదర్శి ఎండీ శైలజ కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దన్న తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ, మార్గదర్శి కేసుల విచారణ పరిధి, ఏపీ హైకోర్టుకు కేసుల బదిలీకి సంబంధించి ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు మణీందర్ సింగ్, నీరజ్‌కిషన్‌కౌల్ వాదనలు వినిపించారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ దాఖలైంది ఏపీలోఅని, దానిపై తెలంగాణ హైకోర్టు విచారణ జరుపుతోందని వారు తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో ఆరోపణలన్నీ ఏపీకి సంబంధించినవేనని చెప్పారు. వ్యక్తిగత ఖాతాల బ్యాలెన్స్ షీటు లేదని, కార్పొరేట్ అకౌంట్‌గా మెయింటైన్ చేశారని చెప్పారు. చిట్ పాడుకున్న వారి నుంచి చట్టవిరుద్ధంగా చిట్ సొమ్మును డిపాజిట్ చేసుకొని వడ్డీ ఇస్తామని తెలిపారన్నారు. ఒక రాష్ట్రంలో సేకరించిన సొమ్ము మరో రాష్ట్రంలో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టారన్నారు. పారదర్శకత లేకుండా ఖాతాల పూలింగ్ చేశారని, వ్యక్తిగత ఖాతాల బ్యాలెన్స్ చేయలేదని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు, సాక్షులు అందరూ ఏపీకి చెందినవారేనని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణ పరిధి విషయంలో తెలంగాణ హైకోర్టుకు వెళ్లాలని చెప్పింది. అక్కడ ఊరట లభించకపోతే తిరిగి రావొచ్చని ఆదేశాలు ఇచ్చింది. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్‌పై చర్యలకు సంబంధించిన పిటిషన్‌లో జోక్యం చేసుకోబోమని పేర్కొంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.